సంపుటి: 19
సంచిక: 4

ఫోన్: నెం
36959

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు.
ఉచిత చందా డిపాజిట్టు 250 రూపాయలు.

మే, 1975

BOOK CENTER,
PALASA

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. వీ. మోహన్రావ్

తొలిమాట

నమస్కారము. అనివార్య కారణాలవల్ల గత కొన్ని నెలలుగా పత్రిక కొంత ఆలస్యంగా వెలువడుతున్నది. అందుకు చాలా చింతిస్తున్నాము. మరికొన్ని నెలలు కూడా ఇదే పరిస్థితి కొనసాగవచ్చు. పాఠకులు సహృదయంతో మాతో సహకరించగలరని ఆశిస్తాము.

పత్రిక ఆలస్యంగా వెలువడుతున్న కారణంగా పోటీ గడువులలో కొంత రాయితీ వుంటుంది. ఆలస్యంగా వచ్చిన వాటిని కూడా పోటీకి స్వీకరిస్తున్నాము.

వచ్చే సంచికలో శ్రీ కొమ్మూరి సాంబశివరావుగారి '10 గంటలసేపు ప్రపంచానికే ప్రమాదం' సీరియల్ పూర్తవుతుంది. ఈ సీరియల్ ప్రారంభించి సరిగా ఏడాది అవుతుంది. జులై '75లో మీకు మరో కొత్త సీరియల్ అందిస్తున్నాము.

ఈ నెల "సప్లిమెంట్"లో కంచర్ల రమణగారి 'రత్త కొండ', వసుంధరగారి 'ఆమె ఎవరు?', సుజనశ్రీగారి 'జాడ తెలియని జయ', ఏ. వీ. మోహన్రావ్‌గారి 'ఇంటి దొంగలు' నవలలు ప్రచురించబడ్డాయి.

సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ సంచికలో ....

కథలు

4. ఫలించని ప్రయత్నం—కురుమద్దాలి విజయలక్ష్మి.
22. నిధి వేట—సుజనశ్రీ.
46. కూలిపోయిన విమానం—'రాజా'
90. అతివ సాహసం—ఏ. వీ. మోహన్రావ్.
106. నిజంగా దేవత—కె. రవీంద్రప్రసాద్.
148. 10 గంటల సేపు ప్రపంచానికే ప్రమాదం.
—కొమ్మూరి సాంబశివరావు.
170. అంతరిక్ష యాత్ర—రమణశ్రీ.

శీర్షికలు

11. అపరాధ పరిశోధన పోటీ_82.
20. పాఠకుల ప్రశ్నలు?
41. పాఠకుల పరిశోధన పోటీ
53. అపరాధపరిశోధన పోటీ_80 (ఫలితాలు)
76. ఈ నెల జోక్స్—గుంటూరి సుబ్బరాజు.
81. హమేషా_హంగామా.
89. సప్లిమెంట్ పోటీ (ఫలితాలు)
102. మీ తీర్పు ఏమిటి?
111. హోమ్ డెలివరీ.
160. ఈ నెల జోక్స్—ఎం. వీరాస్వామి.
166. క్రైమ్‌లో తమాషాలు.
189. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ.
190. లేఖలు.

ఇంకా – కార్టూన్లు, మీకు తెలుసా, చెప్తావినండి మరెన్నో ఆకర్షణలు!!

ఫలించని ప్రయత్నం

కురుమద్దాలి విజయలక్ష్మి

''అబ్బ అప్పుడే నాలుగయింది.''

సగం చదివిన నవలమూసి బెడ్ దిగుతూ అనుకున్నాను.

బుక్ షల్ఫ్‌లో నవలపెట్టి షల్ఫ్ మీదున్న లెటర్ అందు కుని సోఫాలో కూర్చుని లెటర్ చదవటం మొదలుపెట్టాను.

''లక్ష్మిగారికి.

ఇప్పటికి నేను మీకు అరడజను లెటర్స్ రాశాను. పరి శోధన మాసపత్రికలో "పాఠకుల తీర్పు!"లో మీరు విజేత లయిన సందర్భంలో మీ ఎడ్రస్ ప్రచురించబడింది. అప్పటి నుంచీ అనగా మూడు నెలలబట్టీ లెటర్స్ రాస్తూనేవున్నాను. మీ వద్దనుంచి రిప్లయి నో.

వివిధ వార, మాసపత్రికలలో ముఖ్యంగా ''పరిశోధన'' మాసపత్రికలో మీ స్టోరీస్ వెరీఫైన్. మీలాటి రచయిత్రితో కలం స్నేహం చేయాలని ఎంతగా వువ్విళ్ళూరుతున్నానో ఆ దైవానికే ఎరుక. మీ రచనలు ఎందుకు బాగుంటాయో వివరిస్తూ అన్ని లెటర్స్‌లోనూ రాశాను.

మీకు పెన్ ఫ్రెండ్స్ అంటే యిష్టంలేదా? పోనీ ఆ మాట రాయవచ్చుకదా? మిమ్మల్ని యింతగా అభిమానిస్తున్న పాఠకురాలిని నిరాశపర్చటం భావ్యమా? మే 24 న నా బర్త్‌డే ఆరోజు అందేటట్లు రెండంటే రెండే ముక్కలు. పెన్ ఫ్రెండ్స్ అంటే నే లైక్ చేయను, లేక మధ్యమధ్య రాస్తుం టాను. ఏదయినా సరే రాయండి. అదే పదివేలని భావిస్తాను.

నా నలుగురన్నయ్యలూ ఎగతాళిచేస్తున్నారు - రచయిత్రి లక్ష్మిగారు నీకు లెటర్‌రాయరు, ఆవిడకు గర్వం అని. అన్నయ్యలు నేను పందెం వేసుకున్నాము. మీరు నాకు తిడుతూ అయినా సరే లెటర్‌రాయాలి. మీ వద్దనుంచి మే 24 లోపల లెటర్‌పొందానా, అన్నయ్యలు ఓడిపోయి, వాళ్ళు నలుగురూ వాడే పియట్‌కారు నాకిస్తారు. నే ఓడానా? నా

ఇంపాలా వారి పరంచేయాలి. రెండంటే రెండే ముక్కలు మీ కలంనుంచి పొందే భాగ్యం కోరుతూ.

మీ అభిమాన పాఠకురాలు

పిరీష."

లెటర్ చదవటం పూర్తిచేసి, ముత్యాలలా వున్న అక్షరాలను చూస్తూ కూర్చున్నాను. ఈ లెటర్ యిప్పటికి పాతిక సార్లు చదివివుంటాను. లెటర్‌లో మేటర్‌కన్నా అక్షరాలే ఆకర్షించటంవల్ల కాసేపటికి ఓ నిర్ధారణకొచ్చాను, పిరీషకు లెటర్ రాద్దామని.

లెటర్‌ప్యాడ్ అందుకున్నాను.

"ప్రియమైన పిరీషకు,

నీ లెటర్స్ అన్నీ అందాయి. కథలు రాయటంతోపాటు, తమాషాలుచేయటం కూడా నా హాబీ. నన్నభిమానించే పాఠకులు నిజంగా నాపై అభిమానముండి మీ కథలు బాగుంటాయి, అంటూ రాస్తున్నారా! లేక రచయిత్రితో కలం స్నేహం చేయాలని రాస్తున్నారా?

అది తెలుసుకోటానికి ఫస్ట్ లెటర్‌కి రిప్లయ్ రాయను ఎవరికీ.

కొందరు మొదటి లెటర్‌కి జవాబుపొందక అంతటితో వూరుకుంటున్నారు. కొందరు వారి ఓపిక కొద్దీరాస్తూ నా సహనాన్ని పరీక్షచేస్తున్నారు.

పెన్‌ఫ్రెండ్స్ రకరకాలు. ఆప్యాయతగా అనురాగంగా విమర్శిస్తూ తిడుతూ ఒక లెటర్‌కి మరో లెటర్‌కి పోలిక వుండదు ఏమాత్రం.

రెండు ముక్కలున్నా చాలన్నావాలానే రాశాను, ఇహపై తరుచు రాస్తుంటాను. ఏం చదువుతున్నావు? నీ హాబీలు వగైరా రాయి.

అన్నట్లు నలుగు రన్నయ్యలు ఫెయిల్ కారు ఓడిపోయి కాలినడకన పడ్డారా?

లక్ష్మి (రచయిత్రి)

సిరీషకు లెటర్ రాయటం పూర్తి అయింది. కవరులో పెట్టి అంటించబోతుంటే నా పొరపాటు తెలిసింది. తిరిగి రాయటం పిన నాలుగు ముక్కలూ రాసి కవరు అంటించాను.

సాయంత్రం బజారు వెళ్ళినప్పుడు పోస్ట్‌బాక్స్‌లో వెయ్యవచ్చనుకున్నాను.

* * *

సిరీషవద్దనుంచి వెంటనే లెటర్ వచ్చింది. నే లెటర్ రాసి నందుకు తానెంత ఆనందిస్తున్నదో ఒకటికి పదిసార్లు రాసింది.

"మిమ్మల్ని చూడాలనివుంది. మీరు మాయింటికి రావలసింది" అంటూ ఆహ్వానించింది.

తన గురించి వివరాలురాస్తూ నా గురించి వివరాలు అడిగింది.

సిరీష బి. ఎ. చదువుతున్నది. తల్లి పసితనంలోనే స్వర్గస్తురాలయింది. తండ్రి, నలుగురన్నయ్యలూ ముద్దుగా చూస్తారుట. అన్నిటికన్నా తను యిష్టపడేది కలం స్నేహం. విదేశాలలో కూడా పెన్‌ఫ్రెండ్స్ వున్నారట.

చాలామంది రచయిత్రులకు లెటర్స్ రాసినా, ఎవరూ తిరిగి రాయలేదుట నేను తప్ప.

సరీగా మినీకథంత లెటర్ రాసింది సిరీష.

ఏమాత్రం ఆలశ్యం చేయకుండా వెంటనే రిప్లయ్ యిచ్చాను సిరీషకి.

నెల లోపల మా మధ్య పదకొండు లెటర్స్ నడిచాయి.

మార్చి 18 న సిరీషకు లెటర్ రాశాను.

"ప్రియచెల్లీ పిరీషా.

ఈ నెల యిరవైన హైద్రాబాద్ వస్తున్నాను. "పరిశోధన" మాసపత్రిక ఎడిటర్‌గారు రమ్మని లెటర్ వ్రాసిన కారణాన బైలుదేరుతున్నాను. స్టేషన్‌కివచ్చి రిసీవ్ చేసుకో, లేకపోతే నేనేవస్తాను మీ యిల్లెతుక్కుంటూ.

ఆరెంజ్ కలర్ శారీ అదే బ్లవుజ్ వేసుకుంటాను. తెల్ల గులాబీ జడలో వుంటుంది. గమనించగలవు.

నీ లక్ష్మి"

ఏ ఎక్స్‌ప్రెస్‌కి బైలుదేరేది, ఏ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కేది కూడ వివరంగారాసి పోస్ట్‌బాక్స్‌లో లెటర్ వేశాను.

హైద్రాబాద్‌లోవుండేది మూడే రోజులు కాబట్టి, ఎయిర్ బ్యాగ్‌లో కొద్దిగానే బట్టలు సర్దుకున్నాను.

రాధా మాధవుల బొమ్మ గంధపుచెక్కతో చేసింది "లేపాక్షి"లో కొన్నాను నా గుర్తుగా పిరీష కివ్వటానికి.

పిరీష తన లెటర్స్‌లో తనెలావుండేది రాసింది. అందమైనదే అనుకోవచ్చు పిరీష రాసిం దానినిబట్టి.

పిరీష రాసిన వుత్తరాలు మరోసారి చదువుతూ కూర్చున్నాను, చేసేపనేం లేకపోవటంవల్ల.

* * *

నాంపల్లి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ ఆగింది.

కంపార్ట్‌మెంట్ డోర్‌దగ్గర నుంచున్నాను, ప్లాట్‌ఫామ్ మీదకు దిగబడకుండా.

పిరీషకు తెలియజేసినట్లే ఆరంజ్ కలర్ శారీ, బ్లవుజ్ వేసుకున్నాను. తెల్లగులాబీ జడలో పెట్టుకున్నాను.

పిరీష నన్ను గుర్తిస్తుంది. నేనే పిరీషను గుర్తించటం కష్టం, పిరీషవచ్చి నేనే పిరీషను అని చెబితే తప్ప.

పిరీషకు నా లెటర్ అందిందో, లేదో! లెటర్ అందితే

స్టేషన్‌కు రాకుండా వుండదు.

పది నిమిషాలు గడచిపోయ్యాయి.

నాకోసం సిరీష స్టేషన్‌కి రాలేదని నిర్ధారణ చేసుకున్నాను. అంతవరకు ఎక్కేవాళ్ళకు దిగేవాళ్లకు అడ్డంగా డోర్ దగ్గర నుంచున్నాను. నిరాశ అణువణువునా ఆవరించింది.

ట్రైన్ దిగుదామని బ్యాగ్ అందుకున్నాను.

నన్ను నఖశిఖ పర్యంతం పరీక్షిస్తూ యిద్దరు యువకులు డోర్ దగ్గరకు వచ్చారు.

'వీళ్ళెందుకు నన్నంత పరీక్షగా చూస్తున్నారు? అందంగా వున్న ఆడదాన్ననా?'

"మీరు....మీరు....?" ఒక యువకుడు గుటకలు మింగుతూ అన్నాడు.

"రచయిత్రి లక్ష్మిగారేనా? విజయవాడనుంచి వచ్చారు కదూ?" రెండో యువకుడు ఎవరో తరుముతున్నట్లు అన్నాడు.

యాంత్రికంగా నా తలవూపాను. నేనే లక్ష్మిని రచయిత్రిని అన్నట్లు.

తక్షణ యిద్దరి చేతులు లేచాయి. "నమస్తే" అన్నారు. వాళ్ళెవరో తెలీకపోయినా నేనూ చెప్పాను నమస్తే.

"సిరీష బ్రదర్స్ మేం. నాపేరు రమణ వీడిపేరు కృష్ణ" చెప్పాడు. యిరువురిలో చిన్నగా వున్నతను.

రమణ అన్నయ్య, కృష్ణ తమ్ముడు, కాని రూపంలో కృష్ణే పెద్దవాడుగా వున్నాడు. నేవూహించింది చెప్పాను వారితో.

"పరిశోధన, మాస పత్రికలో వివిధ పజిల్స్‌లో కనీసం పాతికసార్లు విజేతలు మీరు. యిలాటిని సింపుల్‌గా చెప్పగలరు." రమణ నవ్వుతూ అన్నాడు.

నవ్వి వూరుకున్నాను.

కృష్ణమటుకు భక్తి గౌరవాలతో కళ్లార్పకుండా నన్నే చూస్తున్నాడు. సినిమా తారలను చూడాలని, రచయిత్రులను చూడాలని తహతహలాడే వాళ్ళు యీదేశంలో నూటికి తొంభై తొమ్మదిమంది.

"స్టేషనుకి సిరీష రాలేదేం?" అడిగాను.

"మూడు రోజులనుంచి జ్వరం వస్తున్నది. తను స్టేష నుకి రాలేకపోయినందుకు చాలాబాధ పడుతున్నది," రమణ చెప్పాడు.

దీనిలో ఏంమోసం లేదుకదా, అనుకుంటా నుంచుండి పోయాను. రమణ నా ముఖ కవళికలు గమనించి జేబులోంచి కవరుతీశాడు.

"సిరీషకు మీరురాసిన లెటర్ యిది. మీరు మమ్మల్ని గుర్తించటానికి తీసుకు వచ్చాము" రమణ కవరు నాచేతికి యివ్వబోయాడు.

"భలేవారే, సిరీష రాలేదేం అని అడిగా గాని, మీరు సిరీష బ్రదర్స్ కాదని అనలేదే? పదండి వెళదాం" అన్నాను ముందుకు దారితీస్తూ.

రమణ కవరు జేబులో పెట్టుకున్నాడు.

ముగ్గురం స్టేషన్ బైటకు వచ్చాము.

* * *

చుట్టూ అందమైన గార్డెను, దానిమధ్య న్యూ స్టైప్‌లో కట్టిన రెండంతస్తుల మేడ, దానిముందు ఇంపాలా ఆగింది.

రమణ, కృష్ణ ముందుకు దారి తీయగా వారి వెనుకనే లోపలికి బైలుదేరాను.

ముందుహాలులో యస్వీ రంగారావు లాంటి విగ్రహం దీక్షగా పేపరు చదువుతూ దర్శనం యిచ్చింది.

అపరాధ పరిశోధన పోటీ-82

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకి 75 పైసలు పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-5-'75 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జులై '75 నెల సంచికలో ప్రకటిస్తాము. *

1. ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని_? (పొందినది, కోల్పోయినది.)

2. ఇండియా నేషనల్ గేమ్_? (హాకీ, క్రికెట్.)

3. నిరపరాధి కేసు గెలవాలంటే ఇది కావాలి_? (డబ్బు, సాక్ష్యం.)

4. ఇతడు పచ్చి అబద్ధాలకోరు_? (హిట్లరు, ఔరంగజేబు.)

5. రివాల్వారు ట్రిగ్గరు నొక్కితే ఇది వెలువడుతుంది_? (బుల్లెట్, శబ్దం.)

"మా ఫాదర్," అంటూ పరిచయంచేసి నన్ను వారికి పరిచయం చేశాడు రమణ.

"మా నాన్నగారికి మీకు చాలా పోలికలున్నాయ్," రంగారావు పోలికలతో వున్న రాజశేఖరంగారితో అన్నాను.

"మీ నాన్నగారు....."

రాజశేఖరంగారు వాక్యం పూర్తి వేయక ముందే అన్నాను "లేరు. నా చిన్నప్పుడే స్వర్గస్తులయారు."

రాజశేఖరంగారు ఏదో అడగాలని నోరు తెరిచి ఆ ప్రయత్నం విరమించుకున్నారు. "సిరీ, నీకోసం ఎదురు చూస్తుంది వెళ్లమ్మా!" అన్నారు తిరిగి పేపర్లో తలదూర్చి.

నేను, రమణ, కృష్ణ మేడమీద కెళ్లాం.

"ఇది నారూమ్, యిది కృష్ణరూమ్. యిదే సిరి రూమ్," అంటూ గదులు దాటుతూ చెప్పాడు రమణ.

సిరీష రూమ్‌లో కాలుపెట్టాము.

కప్పుకున్న రగ్గు పక్కకు తొలిగించి ఆనందంతో లేచి కూర్చుంది సిరీష, "అక్కా!" అంది.

బెడ్ పక్కనే ఛెయిర్‌లో కూర్చుని "సిరీషా!" అన్నాను.

మా యిరువురి మధ్య మాటలు కరువయ్యాయి. మౌనంగా ఒకరి నొకరం చూస్తూ కూర్చున్నాము చాలాసేపు.

మా యిద్దరినీ వదిలేసి రమణ, కృష్ణ వెళ్ళిపోయారు బైటేదో పనివుందంటూ.

"నా కెంతో సంతోషంగా వుందక్కా! యింత తొందరగా చూస్తా ననుకోలేదు మిమ్మల్ని!"

"ఎడిటర్‌గారి దగ్గరనుంచి లెటర్ రాబట్టి బైలుదేరి వచ్చాను" చెప్పాను.

సిరీష వంటిమీద చెయ్యివేసి చూశాను. నిప్పుసెగ తగిలి నట్లనిపించింది.

"జ్వరం ఎన్నాళ్లబట్టి తగులుతున్నది?"

"పదిరోజులనుంచి వస్తున్నది. తింటూ తిరుగుతూన్నాను. మూడురోజులబట్టి రెస్టుకోసం మంచం ఎక్కాను," నవ్వుతూ చెప్పింది సిరీష. చిన్నగా నవ్వాను.

వంటమనిషి కామాలి కాఫీ, టిఫెన్ ట్రేలో తీసుకొచ్చింది. నాముందుపెట్టి "తీసుకోండమ్మా!" అంది.

ప్లేటులో రవ్వట్టు చట్నీ వున్నాయి. కప్పులో కాఫీ సువాసన విరజిమ్ముతూ పొగలు కక్కుతున్నది.

"మీ దగ్గరనుంచి వుత్తరం వచ్చింది, అప్పటి నుంచి మా సిరమ్మగారి సంతోషం చెప్పలేనమ్మా!" వంటావిడ అంది.

"అవును, రాజమ్మగారు చెప్పింది నిజం" సిరీష అంది.

"నీవద్దనుంచి వచ్చే లెటర్స్ చెప్పాయి. నువ్వెంత ఆనందం పొందుతున్నావో!" అన్నాను.

కబుర్లు చెబుతూ కాఫీ, టిఫెన్ ముగించాను.

నే తెచ్చిన రాధామాధవుల బొమ్మ సిరీషకు యిచ్చాను. బొమ్మ చూచి సిరీష ఎంతో సంతోషించింది.

మా మధ్య గంట గడిచిపోయింది.

బైటకు వెళ్లిన రమణ, కృష్ణ రాలేదు. మిగిలిన యిద్దరన్నయ్యలు రాత్రికి కాని రారుట, బిజినెస్ పనిమీద పక్కవూరు వెళ్లినట్లు సిరీష చెప్పింది.

సిరీషకు ఇంజక్షన్ యిచ్చి పోవటానికి వాళ్ల ఫామిలీ డాక్టరు రావటంతో యివతలికి వచ్చేశాను.

రూమ్ బైట నుంచున్న నాకు డాక్టర్‌తో మాట్లాడుతున్న సిరీష గొంతు వినపడుతున్నది.

"సాంఘిక, డిటెక్టివ్ స్టోరీస్ రచయిత్రి లక్ష్మిగారు ఆమెనే. యిప్పుడు మీరు చూచింది...." అంటూ సిరీష

డాక్టర్‌తో చెబుతున్నది నా గురించి.

డాక్టరుగారు పిరీషను పరీక్ష చేయటం మరచిపోయి కబుర్లు వింటున్నారు లాగుంది, అనుకున్నాను.

లోపలికి రమ్మని పిరీష పిలిచింది నన్ను.

బహుశా, డాక్టరుకి నన్ను పరిచయం చేయటానికి అయి వుండవచ్చు అనుకున్నాను.

చిరునవ్వుతో రూమ్‌లో అడుగు పెట్టాను.

* * *

పిరీషకు మర్నాడు జ్వరం తగ్గింది.

సాయంత్రంపూట కుర్చీలు వేసుకుని అందరం యింటి ముందు గార్డెన్‌లో కూర్చున్నాము.

రాజశేఖరంగారు మధ్య మధ్య మాతో మాటలాడుతూ యీవినింగ్ పేపరు చదువుతున్నారు.

ఏపని చేస్తున్నా చేతిలో పేపరో నవలో విడవకుండా వుండటం గమనించాను. బహుశా రాజశేఖరంగారి అలవాటు అదికావచ్చు.

రమణ, కృష్ణ ఫిలింఫేర్‌లో తలదూర్చి మాట్లాడు కుంటు న్నారు.

పిరీష పెద్దన్నయ్య లిద్దరూ అంటే రఘుపతి, రాజా రామ్‌లు నాతో కబుర్లు చెబుతున్నారు.

"ఎడిటర్‌గారితో పని పూర్తి అయిందా," రాజారామ్ అడిగాడు.

"ఇంకా పూర్తికాలేదు. పై నెలకు వాయిదా పడింది. మళ్లీ రావాల్సివస్తుంది" చెప్పాను.

"అక్క రేపే వూరెళ్లిపోతుందిట అన్నాయ్," పిరీష మూతి సున్నాలా చుట్టి చిరుకోపంతో అంది.

"కనీసం వారం రోజు లయినా వుండకపోతే వూరు

కోము," రఘుపతి కావాలని సీరియస్ ముఖం పెట్టి అన్నాడు.

"ఒక వార పత్రిక్కి మరో మాసపత్రిక్కి పదిరోజుల్లో నవలలు అందించాలి, ఎడిటర్స్‌కి అందిస్తానని మాటిచ్చాను. మరోసారి వస్తున్నా కదా, అప్పుడు వారమేం ఖర్మ, నెల వుంటాను," చెప్పాను.

"మీరు రాస్తున్న నవల యితివృత్తం టూకీగా చెప్పండి," ఫిలింఫేర్ చూడటం పూర్తయిన రమణ అడిగాడు.

"రెండు నవల్స్ సస్‌పెన్స్‌తో నడుస్తాయి. ముందే స్టోరీ చెప్పేస్తే బాగుండదు. స్టోరీ గురించి అడగవద్దు," మొహ మాటం లేకుండా గట్టిగా చెప్పాను.

ఎవరూ మాట్లాడలేదు కాసేపటిదాకా.

"జయమాల మాసపత్రికలో 'పిలి మనసులు' పెద్దకథ రాశారు. కథకు ఆ పేరు సమంజసంగా వుందా?" రాజారామ్ చాలా పేపు తరువాత అడిగాడు.

జవాబు యివ్వటానికి ఆలోచించ వలసి వచ్చింది.

"నిజం చెప్పాలంటే నా స్టోరీకి ఆ పేరు నేను పెట్టలేదు 'మగువ మనసు' అని పెడితే ఎడిటర్ పేరు మార్చారు" చెప్పాను.

రాజశేఖరంగారు చదువుతున్న పేపరు మడిచి ప్రక్కన పెట్టారు.

"కొత్తగావస్తున్న "వెలుగు" మాసపత్రికలో మీ స్టోరీ "ప్రతిబింబం" వెరీ ఫైన్‌గావుంది. ఉమాపతి పాత్ర చాలా చక్కగా మలిచావమ్మా!" రాజశేఖరంగారు మెచ్చికోలుగా అన్నారు.

"ఉమాపతి పాత్రకు సరి అయిన న్యాయం కలుగజేయ టానికి నెల రోజులు ఆలోచించాను," చెప్పాను రాజశేఖరం

గారితో.

"రేడియోలో బ్రాడ్‌కాస్ట్ అయిన మీ స్టోరీస్ వ్యాసాలు అన్నీ విన్నాము. మీ వాయిస్ బొంగురుగా వస్తున్నది. యిప్పుడు మీరు మాట్లాడుతున్నదానికి రేడియోలో వినే స్వరానికి ఎంతో భేదంవుంది" రమణ అన్నాడు.

"అది నా దురదృష్టం."

"కదంబకార్యక్రమం ఒకసారే యిచ్చావేం అక్కా! నాటకం ఎంత బాగుందో, మరోసారి అలాటివి యివ్వ కూడదా?" సిరీష అంది.

కదంబకార్యక్రమము, యువభారతిలో మరో ప్రోగ్రాము రెండు నాటకాలు సెలక్టు అయినట్లు బ్రాడ్‌కాస్ట్ అయేముందు తెలుపుతానని చెప్పాను, సిరీషతో.

మరో అరగంట కబుర్లు చెప్పుకుని లేచాము అందరం.

* * *

"రేపెళ్లి పోతావ్ కదక్కా?" అంటూ సిరీష రాత్రి పద కొండు గంటలదాకా మేలుకుని కబుర్లు చెప్పింది.

అంతకు క్రితం దాకా సిరీష రూమ్‌లోవున్న రమణ, కృష్ణ కూడా నిద్రవస్తుందని 'గుడ్‌నైట్' చెప్పి వెళ్లి పోయారు.

పదకొండున్నరయే టప్పటికి సిరీష నిద్రపోయింది.

చప్పుడు చేయకుండా నా మంచంమీదనుంచి లేచాను.

"సిరీషా!" పిలిచాను. జవాబుగా సిరీషనుంచి చిన్నగా గురక వినిపించింది.

"ఇహ నాపని మొదలు పెట్టవచ్చు" అనుకున్నాను.

నా బ్యాగ్ తెరిచి సిల్కు రేపర్‌లో వుంచిన కర్‌చీఫ్ తీశాను. సిరీష ముక్కు దగ్గర కర్‌చీఫ్ వుంచాను.

మత్తుమందు వాసన పీల్చి సిరీష గాఢనిద్రలో పడి

పోయింది.

సిరీష రూమ్‌లోవున్న ఎయిర్ బ్యాగ్ ఒకటి తీసుకున్నాను. సిరీష బీరువాలో నగలన్నీ ఆ వుదయమే చూపించింది. బీరువా తాళంచెవులు సిరీష రూమ్‌లోనే వుండటం నా అదృష్టం.

బీరువా తెరిచి నగలన్నీ బ్యాగ్‌లో సర్దాను. సిరీషకు చిల్లర డబ్బులు పోగుచేయటం, కొత్త కొత్త నోట్లకట్టలు అందమైన అట్టపెట్టెల్లో వరసగా పేర్చి పెట్టటం హాబీ.

బ్యాగ్‌లో నోట్లకట్టలుపెట్టి రూపాయి కాయిన్స్ మాత్రం తీసుకున్నాను. మిగతా చిల్లర వదిలేశాను.

చిల్లర బరువెక్కువ. గలగల చప్పుడు అవుతుంది. అలా అవి చూస్తు వూరుకోలేక అర్ధరూపాయి, పావలా బిళ్లలు టవల్‌లో కట్టి నే తెచ్చిన బ్యాగ్‌లో పెట్టాను.

అయిదు, పది, యిరవై పైసల నాణాలు వదిలేశాను.

ఖరీదైన ఫారెన్ కెమేరా, మినీ ట్రాన్‌సిష్టర్, మినీ టేప్ రికార్డ్ లాంటివి కూడా బ్యాగ్‌లో సర్దాను.

బ్యాగ్ నిండిపోయింది.

తలుపులు తీపి ఓసారి నడవాలోకి వెళ్ళి పరిసరాలు చూచి వచ్చాను.

అంతా నిశ్శబ్దంగావుంది. ఎవరి గదుల్లో వాళ్ళు నిద్రపో తున్నారు.

లోపలికివచ్చి రెండు బ్యాగ్‌లు తీసుకున్నాను.

"గుడ్ నైట్-గుడ్‌బై" అంటూ నిద్రపోతున్న సిరీషతో చెప్పి బైటకు వచ్చాను.

మేడమెట్లు దిగి కింద హాలులోకి వచ్చాను.

గేటుదగ్గర సుబ్బయ్య కాపలా వుంటాడు. గేటునుంచి వెళ్లటం ప్రమాదం. దొడ్డిదోవన వెళ్ళటం శ్రేయస్కరం

అనుకున్నాను.

'గప్' మంటూ హాలులో లైట్ వెలిగింది.

భయంతో అలాగే నుంచుండిపోయాను.

ఓ పక్కనుంచి రమణ, కృష్ణ. మరోపక్కనుంచి రఘుపతి, రాజారామ్. వేరో పక్కనుంచి సుబ్బయ్య, ఎదురుగా భారీ విగ్రహం రాజశేఖరంగారు.

అందరి చూపుల్లో హేళన.

'పట్టుపడిపోయాను' లోలోపల అనుకున్నాను.

*　　*　　*

"నిజమే నే దొంగను, ఎలా గ్రహించారు?" అందరి ముఖాలు ముఖ్యంగా సిరీష ముఖం చూడలేక తలదించుకుని అడిగాను. రాజశేఖరంగారు కంఠం సవరించుకున్నారు.

"నీవద్దనుంచి వచ్చిన లెటర్స్ చూచి, ఆ తరువాత నిన్ను చూచి రచయిత్రి లక్ష్మి అనే అనుకున్నాము. నిన్న వుదయం మా ఫామిలీ డాక్టరుగారి ధర్మమా అని నీ నిజస్వరూపం తెలిసింది.

సిరీష దగ్గరనుంచి యింటికెళ్లిన డాక్టరుగారు నీ గురించి భార్యతో చెప్పారుట. లక్ష్మి నాకెందుకు తెలియదు. రచయిత్రుల మహాసభ కొచ్చినప్పుడు చూచాను. నల్లని రింగుల జుట్టు. బుగ్గన బ్యూటీస్పాట్ పెద్ద పెద్ద కళ్ళు అంటూ చెప్పబోయిందిట. తను చూచిన రచయిత్రి లక్ష్మి యిలావుండదని డాక్టరుగారు చెప్పారుట.

భార్యా భర్తలు వాదించుకోటంలో వారికే అనుమానం వచ్చింది, రచయిత్రి లక్ష్మివి నీవు అవునో కాదో అని.

ఆ సంగతి ఫోన్‌చేసి నాతో చెప్పారు డాక్టర్.

వెంటనే నేను పరిశోధన కార్యాలయంకు వెళ్ళి ఎడిటర్ గారిని కలుసుకున్నాను. నీవు అక్కడికి రాలేదని యిందులో

ఏదో మోసం వుందని చెప్పారు.

నువ్వు మోసగత్తెవని, ఏదో ప్లాన్ వేసి మా యింట్లో చేరావని గ్రహించాను. నీవు లేనప్పుడు నీ బ్యాగ్ గాలించి మత్తుమందువున్న కర్చీఫ్ స్థానంలో మంచిది పెట్టాము. మిగిలిన జాగ్రత్తలు తీసుకున్నాము.

"వెలుగు" మాస పత్రికలో 'ప్రతిబింబం' కథ గురించి బాగుందంటే తలూపావు. అసలు 'వెలుగు' మాసపత్రికేలేదు.

నీవు రచయిత్రి లక్ష్మివి కావనటానికి యివి చాలను కుంటాను. మరో అరగంటలో ఇన్ స్పెక్టరుగారు రాబో తున్నారు. అప్పుడయినా నిజంచెప్పక తప్పదు.

"రచయిత్రి లక్ష్మికి రాసిన లెటర్స్ నీ కెలా అందాయి? ఎలా మాయింటికి రాగలిగావు?"

రాజశేఖరంగారు గంభీరంగా అడిగారు.

మరోగంట కయినా నిజం బైటపడకమానదు. అందుకే నిజంచెప్ప దలుచుకున్నాను.

"దొంగతనం చేయటం నావృత్తి. ఓరోజు బజారునుంచి వస్తుంటే పోస్ట్మన్ ఎదురయాడు. అతని చేతిలోంచి కవరు జారిపడింది. చూచుకోకుండా వెళ్ళిపోయాడు. కవరు ఓపెన్ చేసి చదివాను. ఇంపాలా, ఫియట్ కార్లు వున్నాయని చదివి, మీరు లక్షాధికార్లని వూహించాను. ప్లాన్ పన్ని ఎడ్రస్ మారిందంటూ లెటర్ రాశాను. పుస్తకాల పురుగుని కాబట్టి రచయిత్రి రాసిన కథలన్నీ చదివాను. రచయిత్రి లక్ష్మిగా మీ యింట్లో అడుగు పెట్టాను. ఆపై జరిగింది మీకుతెలిసిందే."

పొందబోయే శిక్ష ఎలాగు తప్పదు కాబట్టి, ధైర్యంగా నిజం చెప్పేశాను.

రాజశేఖరంగారి ఫామిలీతోపాటు నేనూ ఎదురుచూస్తూ కూర్చున్నాను ఇన్ స్పెక్టరుగారి రాకకోసం. ★

పాఠకుల ప్రశ్నలు

ఎన్. పరశురాం, భీవండి.

శ్యామ్‌జీ! మీ దృష్టిలో అన్నిటికంటే విలువైనది ఏమిటి?

నీతి-నిజాయితి.

డి. వి. రమేష్‌కుమార్ రానా, బొకారం.

ఎడిటర్‌గారూ! మీ మాసపత్రికలోని రచయితల, పాఠకుల, హోం. డె. సభ్యుల చిరునామాలు ఎవరికైనా కావలిస్తే ఇస్తారా?

చిరునామాలు ఎవ్వరివీ ఇవ్వలేము.

జి. ధర్మారెడ్డి, మల్లారెడ్డిపల్లి.

డియర్ శ్యామ్‌జీ! మా జాబులనేకాక, మాకు ప్రకటించే బహుమతులను కూడ మీ బుట్టాసురుడే స్వాహా చేస్తే మేమిక చేసేదేమిటి?

బుట్టాసురుడు మీరనుకున్నంత కర్కోటకుడు కాదు. ప్రకటించిన బహుమతులు కరెక్టుగా అందజేస్తూనే వున్నాము. ఒక్కొక్కసారి చిరునామాదారులు లేకపోవడంవల్లనో, మరే కారణం చేతనో మణియార్డర్లు తిరిగివస్తున్నాయి. అటువంటి వారికి కూడా ఏదోవిధంగా వారి కొత్త చిరునామాలు సంపాదించి బహుమతులు అందజేస్తూనే వున్నాము.

అరుట్ల నళినీదేవి, విజయనగరం.

కథలు మేము పంపవచ్చునా? హోం. డె. సభ్యులవి మాత్రమే ప్రచురిస్తారా?

కథలు ఎవరైనను పంపవచ్చును. ప్రచురించబడిన ప్రతి కథకు పారితోషికం కూడా వుంటుంది.

జి. సుధాకర్, భీవండి.

ప్రపంచంలో కెల్లా సిరిసంపదలతో తులతూగే దేశం ఏది ?

అమెరికా.

మహ్మద్ జమాల్, బైంసా.

"అసన" 3 రూపాయలైనప్పుడు సంవత్సర చందా 39 రు. లు ఎలా అవుతుంది?

పోస్టేజి, ప్యాకింగ్ మొదలైన ఖర్చులతో 39 రు. లు అవుతాయి.

ఎన్. శ్రవణ్ కుమార్, సోమాజిగూడ.

రెడ్డిగారూ! కత్తికన్న పదునైనది ఏమిటి?

నాలుక.

బి. సరాశ్రీ, రుద్రంపూర్.

ఎడిటర్‌గారూ! మీ ఆఫీసులో ఏవైన ఖాళీలు వున్నాయా?

ఉన్నాయి. చెత్తబుట్ట, ఇంకుబుడ్లు, గమ్‌బాటిల్స్ ఖాళీగా వున్నాయి.

యం. శంకరరెడ్డి, బెల్లంపల్లి,

ఒక వ్యక్తి నిరాశతో చావాలనుకొన్నప్పుడు, ఇంకొక వ్యక్తి వచ్చి ఏం సాధిస్తావ్ అంటాడు. కాని ప్రతిమనిషి ఎప్పుడో ఒకప్పుడు చావవలసిందే కదా?

ఎప్పుడో ఒకప్పుడు చచ్చేవాళ్లము పుట్టగానే ఎందుకు చావగూడదూ! నిరాశ, నిస్పృహలతో దేనినీ సాధించలేము. ఎటువంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోటమే జీవిత పరమార్థం. ★

నిధివేట

సుజనశ్రీ

భారత నౌకాదళానికి చెందిన నౌక 'సామ్రాట్ అశోక్' విశాఖపట్నం అవుటర్ హార్బర్‌లో లంగరు వేసి ఉంది. ఆ నౌక నిర్మాణం విశాఖపట్నం షిప్‌యార్డ్‌లో జరిగింది. పైగా 'సామ్రాట్ అశోక్' జలప్రవేశంచేసి ఆరోజుకి పది సంవత్సరాలు పూర్తయింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని, నౌకలో వార్షికోత్సవాలు జరిగినయ్.

అనేకమంది ప్రముఖులూ, మంత్రులూ, ఉన్నతాధికారులూ ఆ రోజున నౌకలోకి వచ్చి, ఆ ఉత్సవంలో పాల్గొన్నారు. విందులూ, వినోద కార్యక్రమాలతో ఎంతో వేడుకగా జరుపబడింది వార్షికోత్సవం.

నౌక కెప్టెన్ రాజేంద్ర అతిధులందరినీ నౌక అంతా త్రిప్పి, అన్ని భాగాలగురించి వివరించి చెప్పాడు.

ఇంత వేడుకలోనూ రాజేంద్ర తన ప్రాణస్నేహితుడు జనార్ధనరావు రానందుకు ఒకవైపు కొద్దిగా బాధపడక తప్పలేదు. జనార్ధనరావు గూఢచారి శాఖలో స్పెషల్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నౌక వార్షికోత్సవాల గురించి అతగాడికి నెలరోజులు ముందే తెలియజేసి ఉన్నాడు రాజేంద్ర.

ఎన్ని పనులున్నాసరే, ఆ రోజుకి తను తప్పకుండా వస్తానని వాగ్దానం చేశాడు జనార్ధనరావు. కానీ ఎంత ప్రయత్నం చేసినా, తన విధులనుంచి బయటపడేసరికి వార్షికోత్సవం అయిపోయింది. విశాఖపట్నం జేరుకొనేసరికి మరునాడు తెల్లవారింది.

వార్షికోత్సవం పూర్తయాక కూడా అదనంగా మరి రెండురోజులు విశాఖపట్నం రేవులోనే నౌక ఉంటుందని చెప్పినట్టుగా గుర్తు జనార్ధనరావుకి. అందుకే తను సమయానికి అందుకోక పోయినా, మరునాటికయినా తన స్నేహితుడ్ని

కలుసుకుని అభినందించుదామనే అతడు విశాఖపట్నం చేరు కున్నాడు.

మోటార్ బోట్‌లో రేవు ప్లాట్‌ఫారమ్‌నుంచి అతడ్ని నౌక దగ్గరకు చేర్చారు. నౌకలోంచి త్రాటినిచ్చెన వ్రేలాడు తోంది. దానిమీదుగా ఎక్కి డెక్ భాగాన్ని చేరుకున్నాడు జనార్ధనరావు.

కెప్టెన్ రాజేంద్ర అతడ్ని ఎంతో ఉత్సాహంతో రిసీవ్ చేసుకున్నాడు.

"ఏరా ఇడియట్! ఇంత లేటుగానా రావటం?" అని కసిరాడు రాజేంద్ర.

"నీవు వైజాగ్ రేవు వదలిపోక ముందు వచ్చాను. అందుకు సంతోషించు. అయినా వేడుకలో అయితే ఎందరో ప్రముఖులూ, ఉన్నతాధికారులూ, ఉంటారు. వాళ్ల మూలంగా మనం తీరిగ్గా చిన్ననాటి ముచ్చట్లు చర్చించుకోవడానికి ఏం వీలవుతుంది? అందుకే ఒకరోజు ఆలస్యంగా వచ్చాను!" జనార్ధనరావు రాజేంద్రను కౌగలించుకొని అభినందనా లయాక చెప్పాడు.

"ఎలాగైనా 'ఇంటలిజన్స్' వాడివి కదా! ఏవిధంగానైనా చేసిన పనిని సమర్థించుకుంటావ్! రా! లోపలకు పోదాం!"

మిత్రులిద్దరూ నౌక లోపలకు వెళ్లారు. ఉత్సవానికి వచ్చిన అతిధులందరూ నిన్నరాత్రే వెళ్ళిపోయారు. నౌకకు సంబం ధించిన వివిధరకాల ఉద్యోగులూ, రాజేంద్ర బంధువులు కొద్దిమంది మాత్రమే నౌకపై మిగిలి ఉన్నారు.

"రాజూ! ఎవరు వచ్చారో చూడు!" అంటూ రాజేంద్ర తన భార్య రాజేశ్వరిని కేకేశాడు.

"ఓహో!. అన్నయ్యగారే! ఇప్పటికి మేం గుర్తుకు వచ్చా

మన్నమాట! ఇంటిదగ్గర అంతా కులాసాయేనా?" రాజేశ్వరి నమస్కారం చేస్తూ అంది.

"అంతా కులాసాయేనమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటున్నావా? అసలే మావాడు నౌకా నిర్వహణలో భార్య బిడ్డల్ని గూడ మరచిపోగలడు!"

"మా బాగా అన్నా రన్నయ్యా!" పెద్దగా నవ్వింది రాజేశ్వరి, భర్తవంక చూస్తూ.

"చాల్లేరా! నీ పోచికోలు కబుర్లు ఇంతా మానలేదు!" వీపుమీద చరిచాడు రాజేంద్ర.

రాజేంద్ర కుమార్తె సరిత వచ్చింది అక్కడికి.

"ఇదిగో! మా ఏకైక సంతానం సరిత!" రాజేంద్ర కూతురివంక ఆప్యాయంగా చూస్తూ చెప్పాడు.

"హలో అంకుల్! ఎప్పుడు రాక? ఏమిటి?" అంటూ ఆశ్చర్యాన్ని ఒలకబోసింది సరిత.

"అప్పు డెప్పుడో చిన్నపిల్లగా ఉన్నప్పుడు చూశాను. ఇప్పుడు బాగా ఎదిగిపోయావ్!"

"ఆడపిల్లలు చూస్తూండంగానే ఇట్టే ఎదిగిపోతా రన్నయ్యా! దాని పెళ్ళిచేసి మన బాధ్యత తీర్చుకుందామంటే. ఈయనేమో 'ఇంకా అది చిన్నపిల్లేగా! అప్పుడే పెళ్ళేమిటి' అంటారు!" రాజేశ్వరి నిష్ఠూరమాడింది.

"ఇంకా ఎందుకు ఆ గొడవ? అదీ నిశ్చయమైందిగదా!" అంటూ రాజేంద్ర తన మిత్రుడివైపు తిరిగాడు. "మా బంధువుల కుర్రాడే! బొకారాలో మెకానికల్ ఇంజనీర్. రాకేష్ అని! చాకులాంటి కుర్రాడు. రెండు మూడు నెలల్లోనే ముహూర్తాలు కుదుర్చుకుంటున్నాం!"

"అయితే మాకు త్వరలోనే మరో విందు ఉందన్న

మాట!" జనార్దన్ సంతోషంగా అన్నాడు.

"పెళ్ళికి గూడ ఇంత పంక్చువల్‌గా వచ్చేవు? ఊరు కునేది లేదుసుమా! వారం రోజులు ముందరే నీ ఫ్యామిలీతో సహా రావాలి! లేకపోతే పెళ్ళికి గమ్మంచే. బారసాలనాటికి చేరుకుంటావు నీవు!" రాజేంద్ర పరిహాసమాడాడు.

నౌక కళాసీ డ్రింక్స్ తెచ్చి అందరికీ అందించాడు.

సరిత కాబోయే వరుడు రాకేష్ వచ్చాడు అక్కడకు. అతడ్ని గూడ జనార్ధనరావుకు పరిచయం చేశాడు రాజేంద్ర. వినయంగా నమస్కారం చేశాడు రాకేష్. కుర్రవాడు అందంగా ఉన్నాడు. సరితకు సరైన జోడు అనుకున్నాడు జనార్ధనరావు.

"హల్లో రాకేష్! ఇక్కడున్నావా? నీకోసం డెక్ అంతా వెదికి వస్తున్నాను. ఇక్కడ ఆడవాళ్లతో ఏం ముచ్చట్లు చెబుతావోయ్! కాసేపు 'బ్రిడ్జి' ఆడుకుందాంరా!"

సీమటపాకాయలా ప్రేలుతూన్న ఆ వ్యక్తి ఎవరా అని తలెత్తి చూశాడు జనార్ధన్ డ్రింక్ ఖాళీచేసి, గ్లాసుని టేబుల్ మీద పెడుతూ.

అతడు రాజేశ్వరి తమ్ముడు కుమార్. బియ్యే తో చదువు ఆపేశాడు. ఏదో కంపెనీలో ఎకౌంటెంట్‌గా చేస్తు న్నాడు. ఎప్పుడూ ఉత్సాహంగా కనిపిస్తాడు.

రాకేష్‌ని వెంటబెట్టుకుని కుమార్ వెళ్ళిపోయాడు.

జనార్ధనరావు వేడినీళ్ల స్నానంచేసి డ్రెస్ మార్చుకున్నాడు. అతడ్ని వెంటబెట్టుకుని రాజేంద్ర నౌకనంతా చూపించ సాగాడు.

డెక్ మీద రెయిల్స్‌కి ఆనుకుని నిలబడి డాల్ఫిన్స్‌నోస్ కొండనీ, అటు విశాఖపట్నంలో మేడలూ, సినిమాహాళ్ళూ,

ఎరువుల ఫ్యాక్టరీ-ఇవన్నీ బొమ్మరిళ్ళు లాగా కనుపిస్తూ వుంటే వాటివంక చూస్తూ తీరిగ్గా తమ చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుంటున్నారు మిత్రులిద్దరూ.

నౌక కళాసీ ఒకడు ఆదుర్దాగా వాళ్ళకేసి వచ్చాడు.

"అమ్మగారు పిలుస్తున్నారండీ! తమరు అర్జెంటుగా రావాలట!" అని చెప్పాడు.

రాజేంద్ర ఆశ్చర్యంగా చూశాడు. "ఇప్పుడే వస్తాను జనార్ధన్!" అంటూ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ లోపలకు వెళ్ళిపోయాడు.

జేబులోంచి సిగరెట్ ప్యాక్ తీసి సిగరెట్ వెలిగించాడు జనార్ధన్.

మరికొద్ది క్షణాల్లోనే ఇందాకటి కళాసీ వచ్చి "మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు సార్!" అన్నాడు.

జనార్ధన్ సిగరెట్‌ని సముద్రంలోకి విసిరేసి ఏమి జరిగి ఉంటుందా అని ఆలోచిస్తూ రాజేంద్ర నివాసం వేపుగా వెళ్ళాడు.

రాజేశ్వరి సరిత ముఖాలు ఆందోళనగా ఉన్నాయ్! రాజేంద్ర హాట్ తీసి తల నిమురుకుంటూ నిలబడి ఉన్నాడు.

జనార్ధన్ లోపలకు రాగానే, అక్కడున్న నౌకర్లను బయటకు పంపేశాడు రాజేంద్ర.

"ఏం జరిగింది?" రాజేంద్రను ప్రశ్నించాడు జనార్ధన్.

"మా అమ్మాయి వజ్రాలహారం కనబడడం లేదట!" రాజేంద్ర ఆదుర్దాగా అన్నాడు.

"వజ్రాల హారమా? దాని ఖరీదు ఎంత వుంటుంది?"

"పాతిక వేలు. మనువు నిశ్చితార్థం అప్పుడు రాకేష్

బహుమతిగా ఇచ్చిన ప్రేమ కానుక అది! అది ఇతని తల్లిగారిదట! ఆమె చనిపోతూ అది తన కోడలు ధరించా లని కోరింది.''

కేవలం విలువైనదే గాక దాని వెనుక ఇంత అమూల్య మైన కోరిక ఉన్నదన్న మాట! నిన్నవచ్చిన అతిధు లందరూ ఎప్పుడు వెళ్ళిపోయారు?'' జనార్ధన్ ప్రశ్నించడం మొదలుపెట్టాడు.

''వాళ్లందరూ నిన్న రాత్రి తొమ్మిది గంటలకే వెళ్లి పోయారు. బయటివాళ్ళెవరూ నౌకలో రాత్రికి వుండేందుకి అనుమతించలేదు. సరిత యివాళ ఉదయంగూడ దాన్ని ధరిం చానని చెబుతున్నది.''

''అవునండీ! ఉదయంగూడ దాన్ని మెళ్లో పెట్టుకు న్నాను. కాని టిఫిన్ అయాక కాసేపు బెడ్ మీద వాలిపో యాను. రాత్రి పొద్దుపోయేదాకా మేలుకుని ఉండటం వలన నిద్ర మత్తుగా ఉంది. ఒక అరగంట పడుకుని లేచాను. మెళ్లో హారం లేదు. దాన్ని మెడలో పెట్టుకుని, హారాన్ని ఉంచే పెట్టెను టేబుల్ మీద తెరచే ఉంచాను. కాని నేను నిద్రలేచేసరికి బాక్స్ మూసేసి ఉంది; బహుశా హారం బాక్స్ లోనే ఉంచి నేను నిద్రపోయానేమో అనుకున్నాను. తీరా యిప్పుడు స్నానంచేసి టాయిలెట్ అయాక బాక్స్ తెరచి చూస్తే అందులో హారంలేదు,'' కళ్ళవెంబడి నీళ్లు నిండినయ్ సరితకు.

''జనార్ధన్! సమయానికి నీవు ఇక్కడే ఉన్నావ్. ఈ విషయం నలుగురికి తెలిసి అల్లరికాకుండా, హారాన్ని దొరక బుచ్చుకునే బాధ్యత నీమీద ఉంచుతున్నాను.''

జనార్ధనరావు తల విసురుకుని ఒక్కనిముషం ఆలో

చించాడు. "హారాన్ని ఎన్ని గంటలకు చూశావ్! అదే నిద్ర లోకి జారుతున్నప్పుడు టైమ్ ఎంత అయి ఉంటుంది సరితా?"

"సుమారు తొమ్మిదయి ఉండచ్చు!"

"రాజేంద్రా! తొమ్మిది తర్వాత నౌకలోంచి ఎవరెవరు బయటకు వెళ్ళిపోయారో ఆరా తీయించు!"

రాజేంద్ర గబగబ డెక్ మీదకు వెళ్లాడు. జనార్ధన్ గూడ అతడ్ని అనుసరించాడు.

డెక్ మీద కళాసీని విచారించగా, ఎనిమిదిన్నర తర్వాత నుంచీ ఎవరూ దిగి వెళ్ల లేదనీ, పదిగంటల ప్రాంతంలో జనార్ధనరావు లోపలకు వచ్చినట్టు చెప్పాడు కళాసీ.

"ఆల్‌రైట్! త్రాటి నిచ్చెనను పైకి లాగేసెయ్. ఎవరన్నా క్రిందకి వెళ్ళాలనివస్తే వారికి ఒక మాట చెప్పు! సాయంత్రం మరో చిన్నపార్టీ వుందనీ, అంతవరకూ ఎవరూ వెళ్ళటానికి వీల్లేదని రాజేంద్ర ఉత్తరువు లిచ్చారనీ చెప్పు! సరేనా?" జనార్ధన్ కళాసీకేసి చూస్తూ చెప్పాడు.

"అలాగేసార్!" అంటూ కళాసీ అప్పటికప్పుడే క్రిందకు వ్రేలాడుతున్న త్రాటి నిచ్చెనను పైకిలాగి, ఉండగా చుట్టి, ఒక ప్రక్కగా పడేశాడు.

జనార్ధన్ నౌకలో మారుమూల భాగాలను గూడ వెళ్ళి వెదికాడు.

వజ్రాలహారం పోయిందని తెలియంగానే, అందరినీ సోదాచేస్తారు. కనుక నేరస్థుడు హారాన్ని తమవద్ద ఉంచుకోకుండా ఎక్కడో నిగూఢంగా దాచి ఉంటాడనీ, కొంత తడవైన తర్వాత దాన్ని తీసుకుని చల్లగా జారుకుంటాడనీ జనార్ధన్ ఊహించాడు.

"అన్నట్టు మీ కళాసీలు ఎటువంటి వాళ్లు? వాళ్లలో ఎవరన్నా అనుమానించ దగిన వారున్నారా?"

"వాళ్లంతా మంచి నమ్మకస్థులు! కావాలంటే వంద రూపాయల కాగితాన్ని అక్కడ పడేసి చూడు! దాన్ని మళ్లీ ఎవరో ఒక కళాసీ తిరిగి తెచ్చిస్తాడు."

"అలాగా?" అంటూ మరోసారి తల నిమురుకున్నాడు జనార్ధన్.

డెక్ మీద మరోసారి అటూ ఇటూ తిరిగాడు జనార్ధనరావు. నౌక ముందు భాగంలో భారత పతాకం గాలిలో రెప రెప ఎగురుతున్నది. జండా క్రిందనే ఫిరంగి ఒకటి ఉంది.

"ఇది శత్రువుల్ని ఎదుర్కోవటానికా?" అని అడిగాడు జనార్ధన్.

"కాదు. ప్రతిరోజూ సాయంకాలం అయిదు గంటలకు విన్యాసం జరిగేప్పుడు రెండుసార్లు ఫిరంగిని ప్రేలుస్తాం! ఇది అందుకుద్దేశింప బడినదే!"

"ఎన్ని గంటలకు దీన్ని ప్రేలుస్తారు?"

"సరిగ్గా అయిదు గంటలకు?"

ఇద్దరూ డెక్ మీదనుంచి రాజేంద్ర పోర్షన్ కి తిరిగివచ్చారు.

"బాధపడకు సరితా!! నీ హారాన్ని వెదికి నీకందించే బాధ్యత నాది! సాయంత్రంలోగా నీ హారం మళ్ళీ నీ మెడలో ఉంటుంది! సరేనా" జనార్ధనరావు సరితను సముదాయించాడు.

విచారిస్తున్న సరిత కళ్ళు ఆనందంతో మెరిసినయ్.

జనార్ధనరావు క్షణం తీరికలేకుండా, కాలుగాలిన పిల్లిలా నౌక అంతా తిరిగాడు చాలసేపు. ఎండ తీక్షణాన్ని గూడ లెక్కచేయకుండా డెక్ మీద రెయిల్స్ మీదుగావంగి, నీళ్ళల్లోకి చూస్తూ ఒక ప్యాకెట్ సిగరెట్లు కాల్చేశాడు.

మొదట్లో నాకు దయ్యాలంటే నమ్మకం వుండేది కాదు!
మిమ్మల్నెక్కడో చూశానే...

మధ్యాహ్నం భోజనాలయినయ్. వజ్రాలహారం మాయ మవటంవల్ల అందరి ముఖాలు విచారంగా ఉన్నయ్. జనార్దన రావు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"ఓడమీద ఉన్నవా రందరినీ వెదికితేనో!" సరిత అడిగింది.

"ప్చ్! లాభంలేదు. నౌకలో ఇంతధైర్యంగా దొంగ తనం చేసిన వ్యక్తి సామాన్యుడై ఉండడు. నిజంగా గుండెలు తీసిన బంటే అయి ఉండాలి" రాజేంద్ర పళ్లు కొరికాడు.

"అంతేకాదు! హారం పోయిన సంగతి కనుక్కోంగానే అందర్నీ సోదా చేస్తారనీ ఏ దొంగైనా ఊహించగలడు. అందుకే దాన్ని తన చేతిక్రింద లేకుండా మరెక్కడైనా దాచి ఉంటాడని నా అభిప్రాయం!" జనార్దనరావు నిదానంగా అన్నాడు.

"అదీ నిజమే! ఇందువలన మనం అందర్నీ వెదికినా హారం దొరకదు!" రాజేశ్వరి తలాడించింది.

"నా పరిశోధనలో అన్ని ప్రదేశాలు వెదికాను! నౌకమీద స్విమ్మింగ్ పూల్ ఉందికదూ? అందులో గూడ ఒకసారి చూడాలి!" జనార్ధనరావు అనుమానంగా చెప్పాడు.

"నేను వెదుకుతాను!" అంటూ సరిత లేచింది. స్విమ్మింగ్ డ్రెస్ వేసుకుని పూల్‌లో అరగంటసేపు దూకుతూ, ఈదుతూ జలకాలాడింది.

"స్విమ్మింగ్ పూల్ అడుగు అంతా వెదికాను! అక్కడ లేదు అంకుల్!" అంటూ తిరిగి వచ్చింది సరిత.

మధ్యాహ్నం మూడుగంటలు కావస్తున్నది.

జనార్ధనరావు అందర్నీ డెక్‌మీద సమావేశ పరిచాడు.

"సాయంత్రం నా స్నేహితుడు మరో చిన్న పార్టీ ఏర్పాటు చేశాడు. అంతదాకా మన కాలక్షేపానికి ఏదన్నా వినోదం ఏర్పాటు ఉండాలికదా! ఒక కొత్తరకం ఆటను చెబుతాను మీకు. దానిపేరు "నిధివేట" బహుశా ఈ ఆటను గురించి మీరు వినే ఉంటారు. మీకు ఒకదాని వెనుక ఒకటిగా ఆధారాలు ఉంటాయ్. వాటినిబట్టి మీరు అంచెలంచెలుగా పరిశోధించుకుంటూ పోయి దాచి ఉంచిన నిధిని దొరకబుచ్చుకోవాలి. ఈ ఆటలో గెలిచినవారికి మంచి బహుమతి గూడ ఉంటుంది!"

"నిధివేట! భలే! భలే! ఇదేదో కొత్తరకం ఆట!" అని అందరూ ఆసక్తి చూపించారు.

ఈ లోపల రాజేంద్ర లోపల గదులూ, కళాసీల గుడ్డలూ అన్నీ వెదికి వచ్చాడు.

జనార్ధన్ ప్రక్కగా వచ్చి నిలబడి పెదవి విరిచాడు. దాన్నిబట్టి హారం ఎక్కడా దొరకలేదని అర్థం అయింది అతడికి.

"దీనికి సంబంధించిన ఆధారాలన్నీ సామెతల రూపంలో గానీ లేదా చిన్న చిక్కు ప్రశ్నలోగాని ఉంటాయ్!" జనార్ధన రావు మళ్లీ వివరించాడు.

"ఇంతకీ నిధి ఏమిటో చెప్పనేలేదు మీరు!" కుమార్ లేచి అడిగాడు.

"అది రహస్యం! ముందుగా చెప్పగూడదు!" జనార్ధన రావు నవ్వుతూ సమాధానం చెప్పాడు.

సరిత అందరికన్నా ఎక్కువ కుతూహలాన్ని ప్రదర్శించింది. తన విచారాన్ని మరిచిపోవటానికి ఆమె ప్రయత్నిస్తున్నదని పసిగట్టాడు జనార్ధన్.

"ఇంకా ఆలస్యం ఎందుకు? ఆ మొదటి సామెత ఏదో

చెప్పండి!'' అని తొందరచేసింది సరిత.

''నీళ్ళలోని చేప, గట్టుమీద గిలగిలలాడే!'' జనార్ధన్ చెప్పాడు మొదటి చిక్కు ప్రశ్నను.

''ఓస్ ఇంతేగదా! సముద్రంలోని చేప సంగతి! పదండి పోదాం!'' అంటూ కళాసీ ఒకడు రెయిల్స్ మీదుగా సముద్రంలోని నీళ్ళవంక చూశాడు.

సరిత చిరునవ్వు నవ్వింది. నీళ్లు అంటే సముద్రం అంతా వెదకటానికి వీలుపడదుగదా. అంటే నీళ్లతొట్టిగాని అలాంటిదే మరోటిగాని అయి ఉండాలి. ఆ! తెలిసింది! స్విమ్మింగ్ పూల్! అవునా! ''మమ్మీ! రా పోదాం!'' అంటూ సరిత స్విమ్మింగ్ పూల్ వైపు పరుగెత్తింది.

రాజేశ్వరీ, కుమార్, రాకేష్ మరి కొందరు కళాసీలు ఆమె వెనుకనే వెళ్లారు.

''మీ అమ్మాయి మాంచి తెలివైనది రాజేంద్రా'' సరితను మెచ్చుకుంటూ అన్నాడు జనార్ధన్.

''అవును! మా అమ్మాయికి వాళ్ళ అమ్మ అందం, నా తెలివీ వచ్చినయ్!'' గర్వంగా చూస్తూ బదులిచ్చాడు రాజేంద్ర.

స్విమ్మింగ్ పూల్‌లో ప్లాస్టిక్ చేప ఒకటి నీళ్లమీద తేలుతున్నది. సరిత నేరుగా వెళ్లి దాన్ని అందుకున్నది.

దాని పొట్టలో చిన్న చీటి ఉంది. సరిత దాన్ని బయటకు లాగి పెద్దగా చదివింది. ''నీళ్ళలోని చేపకు వెన్న రుచించునా!''

''వెన్న రుచించునా? అంటే కిచెన్ రూమ్‌లో తర్వాతి క్లూ దొరుకుతుందన్నమాట! మమ్మీ! త్వరగా నడు! కిచెన్ మీద దాడిచేయాలి!'' ఉషారుగా పరుగెత్తుతున్న సరితతో వచ్చి కలిశాడు కుమార్.

వంటశాలలో అంతా కలయజూపింది సరిత. కుమార్ గూడ ఆమెనే అనుసరిస్తున్నాడు. తనూ విజయం సాధించాలని అతని ఆరాటం!

సరితకు అక్కడేమీ కనబడలేదు. ఫ్రిజిడైర్ తెరిచింది. అమూల్ వెన్న డబ్బా కనుపించింది. దాన్ని గబాలున అందుకుని, సన్నని వ్రేళ్ల వెన్నలోకి పోనిచ్చి వెదికింది. ఆమె చేతికో చిన్న కాగితం దొరికింది.

"వెన్నదొంగ చివరకు పాలసాగరమున పవ్వళించె!"

"పాలసాగరం; అ! పాలసీసాలు!" అంటూ మరో గదిలోకి పరుగెత్తి మిల్క్ బాటిల్స్ వెనుక వెదికింది.

"ఈ ఆట ఇంత సులువుగా ఉంటుందనుకోలేదు:" అన్నాడు కుమార్.

"పోను పోను ఆ ఆధారాలు కష్టంగా కనుక్కోలేనంతగా ఉంటాయ్!" జనార్ధన్ నవ్వుతూ అన్నాడు.

"పాపం! తన హారం విషయం ఇట్టే మరిచిపోయినట్టుంది!" అన్నాడు రాజేంద్ర తన కుమార్తె ఉత్సాహాన్ని ఆసక్తిగా చూస్తూ.

సీసాల మధ్య మరో కాగితం దొరకబుచ్చుకుంది సరిత.

"ఆకాశంలో ఎగురుతుంది! ఔన్నత్యాన్ని చాటుతుంది! ఏమిటయి ఉంటుందబ్బా?" అంటూ సరిత బుగ్గమీద వ్రేలు వేసుకుని ఆలోచించింది.

"ఏదీ! నేను చూస్తానిటివ్వు!" అంటూ కుమార్ ఆ చీటిని తీసుకుని మరోసారి చదివాడు.

సరిత ఆలోచిస్తున్నది. "ఆకాశంలో ఎగురుతుంది! ఔన్నత్యాన్ని చాటుతుంది!" ఎవరి ఔన్నత్యాన్ని? ఆ ప్రాంతం ప్రజల ఔన్నత్యాన్ని లేదా ఆ దేశ ప్రజల ఔన్నత్యాన్ని! "ఆ!

తెలిసింది దేశ పతాకం!" అంటూ డెక్ మీదకు పరుగెత్తింది.

"అతే! నాకూ బోధ పడలేదు దానర్థం! మనకంటె అమ్మాయే ముందర పసిగట్టిందే!" అంటూ అబ్బుర పడ్డాడు రాజేంద్ర.

జెండా, కట్టి ఉన్న మానుకు చిన్నకాగితం అంటించి ఉంది. సరిత దాన్ని చించి, తన చేతులోకి తీసుకుంది. ఆమె చేతి లోని కాగితం మీద రాసి ఉన్నదాన్ని ఆమెకంటె ముందుగా కుమార్ చదివాడు పెద్దగా, "తన సుఖంకోసం కాల్చి పారేశాడు!"

"ఏమిటో! నా కంతా అయోమయంగా ఉంది!" అని పెదవి విరిచాడు కుమార్.

"అంకుల్! మొత్తానికి మీ మగబుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు! మా ఆడవాళ్లు ముట్టుకోనిది రాయాలా లేకపోతే!" అని నొచ్చుకుంది సరిత.

"అదేమిటో నాకు చెప్పు సరితా! నేను దొరక పుచ్చుకుంటాను దాన్ని!" కుమార్ అమాయకంగా అడిగాడు.

సరిత తన రెండు వ్రేళ్లూ నోటిమీద ఉంచుకుని "ఉఫ్" మని అంది.

"ఓ! సిగరెట్టా?" అంటూ నవ్వేశాడు కుమార్.

డెక్‌మీద ఎక్కడన్నా సిగరెట్ పీకలున్నాయేమో అని వెతికింది సరిత. కాని డెక్ అంతా అద్దంలా శుభ్రంగా ఉంది.

వెదకగా, వెదకగా, ఒక మూల త్రాళ్ల మోకుల క్రిందుగా కనుపించి కనుపించకుండా సగంకాల్చి పారేసిన సిగరెట్ పీక దొరికింది.

కుమార్ దానికి చుట్టి ఉన్న కాగితాన్ని విప్పాడు. ఆ కాగితం వెనుకగా అక్షరాలున్నాయ్. దాన్ని చదివి అలాగే

నిలబడిపోయాడు.

"నీకు అర్థం కాకపోతే మాకన్నా ఇవ్వు!" అంటూ సరిత విసుక్కుంటూ అతడి చేతిలోని కాగితాన్ని లాక్కుంది.

"ఫిరంగి మ్రోతలకు పిచ్చుకలు పారిపోవునా?"

కుమార్ మౌనంగా నిలబడిపోయాడు.

సరిత గబగబ ఫిరంగి దగ్గరకు పరుగెత్తింది.

"ఆగవే అమ్మాయ్! ఫిరంగి ఆ కొసను అందుకోవటానికి ప్రయత్నించేవ్! దాని కొస సముద్రంమీద వరకూ ఉంది. కాలుజారి సముద్రపు నీళ్లలో పడిపోగలవు!" రాజేశ్వరి కూతుర్ని వారించింది.

"మరీ అంత తెలివి తక్కువగా జమకట్టకు నన్ను! ఫిరంగిలో మందుకూరటానికి ఈ చివర మరో అర ఉంటుందని తెలియదూ నీకు!" అంటూ సరిత ఫిరంగి దగ్గరకు పోయి, మందుకూరే క్రిందిభాగాన్ని తెరిచింది.

లోపల దూది కుక్కి ఉంది. ఆ దూదిని బయటకు లాగింది సరిత.

దూదిలో చుట్టబడిన వజ్రాలహారం బయటపడింది. ఎండ మీదపడి అందులోని వజ్రాలు ధగధగ మెరిసినయ్.

"నా వజ్రాల హారం!" అంటూ హారాన్ని చేత్తో పుచ్చుకుని, ఎత్తి అందరకూ చూపుతూ అరిచింది సరిత.

"ఏమిటీ! వజ్రాలహారం దొరికిందా?" రాజేశ్వరి ఆశ్చర్యానికి అంతులేదు.

"వాటిని ఈ ఉదయం ఎవరో దొంగిలించారు. ఎవరికీ తెలియకుండా ఇక్కడ దాచారు!" అందరి ముఖాలవంకా చూస్తూ అన్నాడు జనార్దనరావు.

"దొంగతనమా!" కొందరు నోరు తెరచి జనార్దన్‌వంకే

చూస్తూండిపోయారు.

"అవును ఇక్కడున్న వ్యక్తుల్లో ఒకరు ఈ హారాన్ని కాజేశారు. అయితే హారం పోయిందని తెలియంగానే అందర్నీ సోదా చేస్తారని నేరస్థుడికి బాగా తెలుసు. కనుక తాత్కాలికంగా దాన్ని ఎక్కడో దాచేసి, హడావిడి సద్దుమణిగాక దాన్ని తీసుకుని జారుకోవాలని అతడి పన్నాగం.

"అయితే ఎక్కడ దాచాలి! ఎవరూ కనుక్కోకుండా తను ఇక్కడనుంచి బయటపడి హారాన్ని ఎలా చేజిక్కించుకోవాలి. నిజానికి అంత తేలిక విషయంకాదు.

"హారం పోయిన తర్వాతనుంచి ఎవరూ నౌకలోంచి బయటకు పోలేదని మా ఆరాలో తెలిసింది. అంటే ఇంకా ఆ వజ్రాలహారం నౌకలోనే ఉన్నదన్నమాట" జనార్ధనరావు ఒక్క నిముషం ఆగాడు. అందరి ముఖాలవంకా చూశాడు.

సరిత ఆసక్తిగా వింటోంది తను చెప్పే మాటల్ని. రాజేంద్ర నేరస్థుడు ఇంకా దొరికాడో, లేదో అని ఆతృతగా ఉన్నాడు.

"నేరస్థుడు ఈ గండాన్ని తప్పించుకోవటానికి బ్రహ్మాండమయిన ప్లాన్ ఆలోచించాడు. హారం పోయిందని తెలియంగానే రంగంలోకి పోలీసులు వస్తారు. వాళ్ళు నిర్దాక్షిణ్యంగా అందర్నీ ప్రశ్నిస్తారు. అందర్నీ సోదా చేస్తారు. అందుకని అతడు తను దొంగిలించిన వస్తువుని ఈ ఫిరంగిలో దాచాడు. ఈ ఫిరంగిలో హారాన్ని దాస్తారని సామాన్యంగా ఎవరూ అనుమానించరు.

"నేను నౌకలో ప్రతి అంగుళం మేరా వెదికాను. హారం దొరకలేదు. కనుక ఎవరూ మామూలుగా ఊహించలేని

ప్రదేశాన్ని అతడు ఎన్నుకున్నాడు. సాయంత్రం అయిదు గంటలకు పతాక వందనం జరుగుతుంది. అప్పుడు ఈ ఫిరంగిని రెండుసార్లు ప్రేలుస్తారు. వజ్రాలహారాన్ని దూదిలో చుట్టి మందుకూరే అరలో దాచాడు. ఫిరంగి ప్రేల్చటానికి నిజమైన తూటాలు వాడరు పతాక వందనం సమయంలో. కేవలం మ్రోతవచ్చి, పొగను గ్రక్కే పవుడర్‌ని మాత్రమే ఉపయోగిస్తారని నేరస్థుడికి బాగా తెలిసి ఉండాలి.

"అందువలన ఫిరంగి ప్రేలినప్పుడు వజ్రాలహారం చెక్కు చెదరకుండా, పోయి సముద్రంలో పడుతుంది. దాని చుట్టూ దూది ఉండటంవలన అది వెంటనే మునిగిపోదు నీళ్ళలో.

సరిగా అదేవేళకు అక్కడకు రమ్మని నేరస్థుడు ఎవర్నో బోటులో అక్కడ సిద్ధంగా ఉండమని ఏర్పాటుచేసి ఉంటాడు. అతడు నీళ్ళలో పడిన దూది మూటను భద్రంచేసి, పెద్ద మనిషిలా నౌకలోంచి సురక్షితంగా బయటపడిన ఆ వ్యక్తికి అందజేస్తాడు."

"ఎంత మోసం! ఎంత దగా!" అక్కడ వింటున్న వాళ్ళు గొణుక్కున్నారు.

"అదంతా ఎందుకు? ఈపనిచేసిన వాడెవరో చెప్పేయ్. వాడి తాట వలిపిస్తాను." పండ్లు కొరుకుతూ అడిగాడు రాజేంద్ర.

"తొందరపడకు! నేను వజ్రాలహారం ఫిరంగిలో దాచబడిందని ముందే గ్రహించాను. కాని నేరుగా వెళ్ళి దానిని బయటకు లాగితే నేరస్థుడి అచూకి దొరకదు! అతడ్ని దొరక పుచ్చుకోవటానికే ఈ "ట్రెజర్ హంట్" ఆట సృష్టించాను.

"ఇప్పుడు అయిదు కావచ్చింది. ఫిరంగి ప్రేల్చే వేళకు

ఎవరో ఒక వ్యక్తి అటుగా బోటువేసుకుని వస్తాడు।''

''ఇంకేం। ఇప్పుడే పోలీసులకు మెస్సేజ్ పంపుతాను వెంటనే రమ్మనమని।'' రాజేశ్వరి ఉద్వేగంతో అంది.

''ఆ పనికి మన మనుష్యుల్ని ఎప్పుడో సిద్ధం చేశాను। ఆ మిస్టర్। రాజేంద్రా। టైం అయిదయింది।''

గుంపుగా ఉన్నవారందరూ బారులుగా తీరి నిలబడ్డారు. బ్యాండ్ మ్రోగింది. రాజేంద్ర జాతీయ పతాకం ముందు సెల్యూట్ చేస్తూ నిలబడ్డాడు.

ఇద్దరు కళాసీలు ఫిరంగిలో మందుకూరి, నిప్పంటించారు. ఫిరంగి రెండుసార్లు ప్రేలింది.

ఫిరంగి ప్రేలిన దిక్కుగా, సముద్రంమీద ఒక జాలరి వాడు వల తీసుకుని బోటులో వచ్చాడు.

మరుక్షణం మోటార్ బోటులో ఇద్దరు కళాసీలు అతడ్ని బంధించి నౌక మీదకు తెచ్చారు.

వాడు లబోదిబోమంటూ తనను ఆ పనికి నియమించిన వ్యక్తి రూపురేఖలు వర్ణించి చెప్పాడు.

''కుమార్ దోషి అని నాకు ముందే తెలుసు. 'ట్రేజర్ హంట్' ఆటలో సరిత వెంబడే తిరిగిన కుమార్ చివరి చీటిలో ఫిరంగి ప్రస్తావన రావటంతో, తెల్లముఖం వేసుకుని వెనక్కు జారుకున్నాడు, తన నేరం బయటపడిందని.'' జనార్దనరావు చిరునవ్వుతో చెప్పాడు.

''ఛీ। పశువా। తల్లిలేని వాడివని పెంచి పెద్దజేసినందుకు తిన్న ఇంటి వాసాలే లెక్కపెట్టావా? ఇక ఎన్నడూ నాకు నీముఖం చూపకు।'' కుమార్‌వంక కోపంగా చూస్తూ అరిచాడు రాజేంద్ర.

★

పాఠకుల పరిశోధన పోటీ

—డి. శ్యామలాదేవి

62. శవం చెప్పిన సాక్ష్యం
(బహుమతి రు. 50/-లు నగదు)

హతుడు నరసయ్య రక్తపు మడుగులో పడివున్నాడు. వ్రేలికి ఖరీదైన వజ్రపు టుంగరం మెరుస్తూంది. సైలెన్సు రివాల్వరుగుండు పొట్టలోనుండి దూసుకుపోయింది. బక్కగా, ఎర్రగావున్న హతుని ముఖంలో నుదుటిపై నయాపైసంత మచ్చవుంది.

రక్తంలో ఏవో అక్షరాలు రాసి చెరిపేసినట్లు కనిపిస్తున్నాయి. పరీక్షగా చూస్తే మొదటి అక్షరం "న" లాగ కనబడుతోంది.

నరసయ్య కుడిచేతి చూపుడువేలిని పరీక్షించాడు పోలీసు ఇనస్పెక్టరు నీలకాంత్. చేయి అంతా అక్కడక్కడా రక్తపు మరకలున్నాయి. వేలు కూడా ఎర్రగా వుండటం గమనించాడు. చివరి క్షణాలలో హతుడు ఏదో రాశాడని, దానిని హంతకుడుగాని, మరెవరైనాగాని చెరిపేసి వుండాలని వూహించాడు.

ఫోటోగ్రాఫరు, వేలిముద్రల నిపుణుడు తమ తమ పనులను చెకచెకా చేసుకుపోతున్నారు. దగ్గరలోవున్న బట్టల స్టాండువరకు రక్తపుబొట్లు పడ్డాయి. హతుడి ఒంటిమీద బనీను, లుంగి వుంది. గుండెలను కప్పుతూ కుడినుండి

ఎడమభుజం వరకు వేసుకున్న టవల్‌ను పరీక్షగా చూచాడు నీలకాంత్.

హత్య రాత్రి 12-1 గంటల మధ్య జరిగుంటుందని డాక్టరు చెప్పాడు. రివాల్వరు హతుడిదేనని, అది అతని టేబిలు సొరుగునుండి తీయబడిందని తెలిసింది. హత్యకు కారణం దొంగతనం కాదని హతుని వ్రేలికున్న వజ్రపు టుంగరమే చెప్తుంది.

గదిబైట హాలులో ముగ్గురు కూర్చునివున్నారు. "మొదటి సారిగా శవాన్ని మీలో ఎవరు చూచారు?"

"నేనేనండి. నాపేరు నరేంద్ర. నేను డెయిలీ పేపరు ఇద్దామని తలుపులు తెరిచేసరికి ఈ ఘోరం కనబడింది. మామయ్య ఇలా అకస్మాత్తుగా పోతాడని అనుకోలేదు" అంటూ జేబురుమాలుతో కళ్లొత్తుకున్నాడు.

"మీరేం చేస్తుంటారు?"

"బి. కాం. ఫైనలియర్ చదువుతున్నాను. నాకు ఎవరూ లేరు. చిన్నప్పుడే అమ్మ, నాన్నను ఎరగను. అప్పటినుండి మామయ్యే నన్ను చేరదీసాడు."

"అలాగా...."

"మీరు...."

"నాపేరు నరహరి. బాబాయిని ఎవరు, ఎందు కిలా చంపేరో అర్థంకావటంలేదు. దయచేసి బాబాయిని హత్య చేసిన వాళ్ళను పట్టుకోండి" అంటూ కళ్లవెంట ధారా పాతంగా కారుతున్న కన్నీళ్లను తుడుచుకున్నాడు.

"మీరేం చేస్తుంటారు?"

"బాబాయి ఆస్థి వ్యవహారాలన్నీ చూస్తుంటాను. నాకు అమ్మవుంది, నాన్నపోగానే బాబాయి నన్ను తెచ్చుకున్నాడు. మా అమ్మ తీర్థయాత్రలకు వెళ్లింది."

"మీ బాబాయి వీలునామా రాశాడా?"

"నాకు తెలీదు."

"ఆస్తి అంతా ఎంత వుంటుందంటారు?"

"లక్ష రూపాయ లుండొచ్చు."

"ఆఖరుసారిగా మీ బాబాయిని చూచిం దెవరు?"

ఎవ్వరూ మాట్లాడలేదు ఒక్క_క్షణం. "నేను...."

"మీపేరు?"

"నళిని. పాలు ఇవ్వటానికి గదిలోనికి వెళ్లాను."

"అప్పుడాయన ఎలాగున్నాడు?"

"ఏదో పుస్తకం చదువుతున్నారు. మామూలుగానే వున్నారు." అని ఒక్క_క్షణం ఆగి-

"అనాధశరణాలయం నుండి నన్ను తీసుకొచ్చి చదువు చెప్పిస్తున్నారు. దేవుడులాంటి ఆయనను ఎవరు పొట్టన బెట్టుకున్నారో? ఏమో?"

"నీవొచ్చి ఎంతకాలమైందమ్మాయ్?"

"రెండు నెలలవుతుంది."

"అసలు నిన్ను ఇక్క_డకు తీసుకురావటానికి గల కారణం?" ఆమె కళ్లల్లోకి పరీక్షగా చూస్తూ అన్నాడు.

"తెలీదండి. బహుశా వారికి చదువుకునే వాళ్లయినా లేక చదువు చెప్పించటమన్నా ఇష్టమైవుండొచ్చు. మా హాస్టలు శక్రటరీగారు ఒకరోజు నన్నుపిలిచి.

'వీరిపేరు నరసయ్యగారు. వీరివెంట వెళ్లితే చదువూ, అదీ చెప్పిస్తారు. ఏ కష్టమూ రాకుండా చూచుకుంటారట. వెళ్తావా' అని అడిగారు. సరేనన్నాను."

"అంటే నరసయ్యగారు నిన్ను పెంచుకుంటున్నారన్న మాట." మాట్లాడకుండా తలొంచుకుంది నళిని.

హత్యకు కారణం ఆలోచిస్తూ బైటకు వచ్చాడు ఇన

స్పెక్టరు. అంతలో నరసయ్య తరపు లాయరు గుర్తు కొచ్చాడు. నరహరిని ఫోనుచేసి పిలవమన్నాడు.

ఆ లాయరు ఇనస్పెక్టర్ క్లాస్‌మేట్. చాల క్లోజ్‌గా వుంటారు. లాయరు రాగానే వీలునామా సంగతి అడిగాడు ఇనస్పెక్టరు.

"వీలునామా కాఫీ తయారు చేయించి వుంచమని చెప్పారు నరసయ్యగారు. కాని అనుకోకుండా ఇలా జరిగింది" అన్నాడు విచారం వ్యక్తబరుస్తూ.

"ఎప్పుడు?"

"ఇరవై రోజుల క్రితం."

"ఆ కాపీ తయారు చేయించారా?"

"ఆ....ఇంకా సంతకం మాత్రం చేయలేదు."

"ఈ విషయం ఎవరికైనా తెలుసా?" సూటిగా అడిగాడు ఇనస్పెక్టరు.

"లేదు. నాకూ, వారికీ తప్ప మరెవ్వరికి తెలియదు."

"అయితే ఆస్థి ఎవరికి, ఎలారాశాడు?"

"ఆస్థిలో సగభాగం నళినికి, మిగతా సగం రెండు వాటాలు చేసి నరహరికి, నరేంద్రకు వ్రాయబడింది."

అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం కొట్టొచ్చినట్లు కనబడింది.

* * *

[ఇదీ కథ. దీనిలో శవంచెప్పిన సాక్ష్యం ఏమిటి? నరసయ్య ఎవరిచేత చంపబడ్డాడు? తగిన కారణాలతో మీ జవాబును ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, ఈ నెల 20 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన ఐదుగురు హోం. డె. పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున నగదు బహుమతి పంపబడుతుంది. ఫలితాలు జులై '75 నెల సంచికలో ప్రచు

రీస్తాము. తుదినిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్]

పోటీ నెం. 60 [ఫలితాలు]

హంతకుడు—నాగులు.

1. హతుడి చేతిలో 4 అంకె దొరికింది. నాలుగును సరి చేస్తే నాగులు అవుతుంది.

2. నాగులు తలుపులు తీసుకొని లోపలికి వెళ్లానన్నాడు. తలుపులపై వేలిముద్రలు లేవు.

3, శేషతల్పం క్యాలండరు పాము అంటే నాగులు. అని హతుడు సూచించాడు.

* * *

మాకు వచ్చిన జవాబులలో, యీ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఐదుగురు పరిశోధకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున నగదు బహుమతి యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

(1) శ్రీ జి. నాగరాజు, సీనియర్ స్టెనోగ్రాఫర్, హోం. డె. నెం.—360, ఎన్. పి. డి. పి. లిమిటెడ్, బైకుంటపూర్. సర్‌గుజా జిల్లా (మధ్యప్రదేశ్)

(2) శ్రీ జి. వెంకటప్పారావు. యు. డి. సి., హోం. డె. నెం.—326, ఎస్. ఇ./డి. పి. సి ఆఫీసు, డొంకరాయి—531 110. (3) శ్రీమతి కె. జ్యోతి సరస్వతి, హోం.డె.నెం 131, కేరాఫ్: కె. సూర్యప్రకాశరావు. ఏజెంట్, బ్యాంక్ ఆఫ్ బరోడా, మెయిన్‌రోడ్, కాకినాడ-1. (4) శ్రీమతి ఎమ్. వి, సుబ్బలక్ష్మి, బి. ఏ., బి. ఇడి., హోం. డె. నెం—160, ఇంటినెంబర్ 1-8-472/1, చిక్కడపల్లి, హైదరాబాదు-500 020. (5) శ్రీమతి డి. కళ్యాణిదేవి, హోం. డె. నెం—482, శింగరాయకొండ (ప్రకాశం జిల్లా.)

★

కూలిపోయిన విమానం

కుర్చీలో కూర్చొంటూ మిశ్రాగారి వైపు చూసాను.

నవ్వుతూ నావంక ఆప్యాయంగా చూస్తున్నారాయన.

ఆరడుగుల ఎత్తు, కండలు తిరిగిన శరీరం, చిన్నవైనా తీక్షణంగా చూసే కళ్ళు. దృఢమైన ముక్కు, పెద్దగా వెడల్పైన ముఖంతో తెల్లటి శరీరచాయతో మెరుస్తున్నారు మిశ్రాగారు.

ఆయన పూర్తిపేరు రమేష్ మిశ్రా. నార్త్ ఇండియన్; వయసు అరవై అయినా చెక్కుచెదరని ఉక్కులాంటి మనిషి కావటం వలన ఇరవై సంవత్సరాలుగా యస్. బి. ఐ. ఛీఫ్‌గా ఉంటూ నేరస్తుల పాలిట సింహస్వప్నంగా నిలిచా రాయన.

"వాట్ విజయ్ ...ఏమిటలా చూస్తున్నావ్?" నవ్వుతూ ప్రశ్నించారు.

"ఏమీలేదు బాస్!" తడబడుతూ అన్నాను.

నవ్వారు మిశ్రాగారు.

"ఆల్‌రైట్, అసలు విషయానికి వద్దాం. నీకో మంచి కేసు తగిలింది." అంటూ సిగార్ వెలిగించారు.

"ఏమిటది బాస్?" ఉత్సాహంగా అడిగాను.

"చెబుతాను, అడ్డు ప్రశ్నలు వేయకుండా విను!" అంటూ గట్టిగా సిగార్ పీల్చారు.

"యస్, బాస్" అంటూ కుర్చీలో సర్దుకొని కూర్చొన్నాను.

"సరిగ్గా వారం రోజులక్రితం బొంబాయ్‌నుంచి బయలు దేరిన స్పెషల్ డకోటా ప్లేన్ 'ధార్'లో కూలిపోయిందన్న సంగతి నీకు తెల్సుగా."

"తెలుసు. కాని దానిని గురించి వివరాలు బయటకు రానివ్వలేదు ప్రభుత్వం." అన్నాను.

"అవును దానికి తగిన కారణం ఉంది! ప్రస్తుతం మన దేశ పరిస్థితులు ఎలా ఉన్నాయో నీకు తెల్సు! ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురయింది మనదేశం. దీనికి కారణం స్మగ్లర్స్, బ్లాక్ మార్కెటీర్స్. ఒకళ్లు దేశాన్ని దోచుకు తింటుంటే మరొకళ్ళు ప్రజలను పీడించుకు తింటున్నారు.

ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ పరిస్థితిని అరికట్టలేక పోయింది ప్రభుత్వం. విసిగిపోయి వక్కుమ్మడిగా స్మగ్లర్స్ మీద దాడిచేసింది. అందిన వాడినల్లా మూసేస్తున్నా చీమల పుట్టల్లా పుట్టుకొస్తున్నారు ఈ స్మగ్లర్స్.

ఈ చర్య తీసుకొన్న సమయంలోనే అన్ని పట్టణాలలో కూడా ఇంకమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు చాలామంది బిజినెస్ మాగ్నెట్‌ల మీద ఆకస్మిక దాడులు జరిపి అంతులేని బ్లాక్ మనీని స్వాధీనం చేసుకొన్నారు.

బొంబాయ్‌లో ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న బంగారం విలువ మొత్తం నలభై కోట్లరూపాయలు. ఆ బంగారాన్ని అక్కడనుంచి ఢిల్లీ తరలించటానికి నిశ్చయించుకొని ప్రభుత్వం కావలసిన ఏర్పాట్లు చేసింది.

ఫలితంగా నలభై కోట్ల విలువైన బంగారంతో కూడిన ఆరు చెక్కపెట్టెలతో, ఐదుగురు వ్యక్తులతో శాంతాక్రజ్ విమానాశ్రయాన్ని వదిలింది ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారి స్పెషల్ డకోటా.

రాత్రి పదిగంటలకు బయలుదేరిన ఆ ప్లేన్, రాత్రి రెండు గంటలైనా ఢిల్లీ చేరకపోవటంలో ఎంక్వైరీ ప్రారంభ మైంది. చివరకు తేలిందేమిటంటే ప్లేను బయలుదేరిన తర్వాత గంటకు బోంబే శాంతాక్రజ్ విమానాశ్రయానికి, ప్లేనుకు టెలీ కమ్యూనికేషన్స్ తెగిపోయాయి. ఇక జోధ్ పూర్ ఎయిరోడ్రోంకు దానిసంగతే అంతుపట్టలేదు.

ఆ రాత్రికి ఊరుకొని హెలికాప్టర్స్ బయలుదేరాయి ఉద యాన్నే. మధ్యాహ్నంవాకా పరిశీలించినా ఏమీ ఫలితంలేక పోయింది.

చివరకు ఆ ప్లేన్ దారితప్పి ఎడారిలో ఎక్కడో కూలి పోయిందనే నిశ్చయానికి వచ్చింది ప్రభుత్వం. అసలు విష యాన్ని బయటకు రానివ్వకుండా జాగ్రత్తపడి, ఆ ప్లేన్ ఎక్కడ కూలిపోయిందో తెలుసుకొని వీలయితే ఆ బంగా రాన్ని ఢిల్లీ చేర్చమని డాక్టర్ నరేష్‌గార్ని కోరింది.'' ఆగారు మిశ్రాగారు.

రెండు నిముషాలు అలుపు తీర్చుకొని తిరిగి చెప్పసాగారు:

''డాక్టర్ నరేష్ భారతదేశం థార్ ఎడారిలో జరిపిన అణు పాటవ పరీక్షలో ముఖ్యపాత్ర వహించిన ప్రముఖవ్యక్తి. థార్ ఎడారిలోని, తైల నిక్షేపాలకోసం తెల్సుకోడానికి నియ మించిన భూగర్భ శాస్త్రజ్ఞులకు నాయకుడు. సుమారు యాభై ఏళ్ల వయసువాడు. అతని జీవితంలో ఎక్కువభాగం ఎడారి లోనే గడిచింది. ఎడారి జీవితం అతనికి అలవాటు. అందుకే ప్రభుత్వం అన్వేషించమని ఆయనను కోరింది.

అంతేకాదు, ఆయనకు సహాయంగా థార్ ఎడారిలోకి ఒక ఏజంట్‌ను పంపమని నాకు పైనుంచి ఆర్డర్స్ వచ్చాయి. నా ఏజంట్లందరిలోకీ అన్నివిధాలా సమర్ధుడివి నువ్వు. అందుకే నిన్ను పంపటానికి నిశ్చయించుకొని నిన్నుపిలిపించాను,'' అంటూ పూర్తిచేసారు బాస్.

ఉత్సాహంగా నవ్వాను.

నా కళ్ళముందు ప్రొఫెసర్ ఆంధోనీగారూ, ఆయనతో కల్పి సాగించిన భూగర్భ సాహస యాత్రా కన్పించాయి.

''ఓ. కె. బాస్!'' అన్నాను ఉత్సాహంగా.

"మరో విషయం ఎడారిలో ప్రయాణమంటే మాటలు గాదు. ఏక్షణాన మృత్యువు వరిస్తుందో ఎవరూ చెప్పలేరు. అనుక్షణం ప్రమాదం ఎదురవుతుంది. ప్రతీక్షణం ప్రాణ గండంగా మారుతుంది. బీకేర్ ఫుల్!" అన్నారు.

"యస్. బాస్!"

"ఆల్‌రైట్! ఈవినింగ్ ఫ్లయిట్‌లో బయలుదేరి జోధ్‌పూర్ వెళ్లి డాక్టర్ నరేష్‌గార్ని కల్సుకో. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!" అంటూ ఫైల్లో తల దూర్చారు మిశ్రాగారు.

"థాంక్యూ బాస్" అంటూ బయటకు నడిచాను.

2

"మనం బయలుదేరి సరిగ్గా ఇవాళకు వారంరోజులైంది కదూ!" అన్నాను.

నా చేతిలో స్టీరింగ్ వీల్ తిరుగుతోంది. ఎర్రటి ఇసుక దిబ్బలపైనుంచి భారంగా కదులుతోంది మా ట్రక్కు.

మిలటరీలో ఉపయోగించే ట్రక్కు అది.

"అవును! సుమారు రెండు వందల మైళ్ళు వచ్చి ఉండొచ్చు." అన్నారు నరేష్‌గారు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొంటూ.

ఆయన ప్రక్కన కూర్చొన్న మొగ్లీ మాట్లాడకుండా బయటకు చూస్తున్నాడు. అతను ఎడారి తండా వ్యక్తి. మా ఇద్దరికీ గైడ్‌గా తీసుకొచ్చారతనిని డాక్టర్‌గారు.

"అబ్బా. వేడి చాలా దారుణంగా ఉంది." అన్నాను చెమట తుడుచుకొంటూ.

చిన్నగా నవ్వాడు మొగ్లీ. "ఇప్పుడే తట్టుకోలేకపోతే ముందెలా తట్టుకోగలరు. ప్రస్తుతం మనమింకా ఓమూలనే ఉన్నాం. ఎడారి మధ్య కొచ్చేకొలదీ వేడెక్కువ అవుతుంది." అంటూ వాటర్ బాగ్ తెరచి కొద్దిగా నీరు తాగాడు.

ఎడారిపై పడుతున్న సూర్యుని వేడి కిరణాలకు ఇసుక నిప్పులు చెరుగుతోంది. సూర్యుడు నడినెత్తిన మండు తోంటే ఆకాశం అద్దంలా మెరుస్తూ ఎటుచూసినా నిశ్చలత్వం ఆవరించుకొని ఉంది.

మాటిమాటికీ పరుగులు తీస్తున్న వేడి గాలుల ధాటికి దుమ్మూ ధూళీ అంతులేకుండా ఎగురుతూ ఒకచోట ఇసుక గుట్టల్ని పేర్చుతుంటే, మరొకచోట తరిగిస్తూ తమాషాగా తిరుగుతున్నాయి.

వాచీ చూసుకున్నాను. మధ్యాహ్నం మూడయింది.

కదులుతున్న ట్రక్ ను గాలిలో కలిసిన ఇసుక తాకుతోంటే విచిత్రమైన శబ్దంపుడుతోంది.

ట్రక్కుకు ఇరుప్రక్కలా తారుపూసిన గోనెపట్టాలు తగి లించటంవలన బయట అంత వేడిగా ఉన్నా లోన కొంచెం చల్లగానే వుంది.

ఆలోచిస్తూ ట్రక్కు నడుపుతున్న నేను మాగ్గీ కేకతో ఉలిక్కి పడ్డాను. దూరంగా రెండు నిప్పుకోళ్లు మా ట్రక్కును చూసి పరుగులు తీసాయి.

మెరుపులా ట్రక్కు బయటకు దూకాడు గైడ్. అతని చేతి లోని డబుల్ బారల్ గన్ "ధన్ .... ధన్" మంటూ ప్రేలింది. ఒక బుల్లెట్ మిస్ అయింది. రెండోది తగిలి ఒక నిప్పుకోడి గిలగిలా తన్నుకొంటూ ఇసుకలో కూలిపోయింది.

పరిగెత్తుకొంటూ వెళ్ళి రెండు నిమిషాలలో దాన్ని ఈడ్చు కొంటూ వచ్చాడు. వస్తూ అది ఇసుకలో పెట్టిన గ్రుడ్లు కూడా తీసుకు వచ్చాడు.

మళ్లీ కదిలింది ట్రక్కు.

ఏకధాటిగా గంటసేపు ప్రయాణంచేసాం. వాచ్ చూసు కొన్నాను. గంట అయిదు అయింది.

డాక్టర్ నరేష్‌గారు చెప్పినచోట ట్రక్కు ఆపి క్రిందకు దిగాను.

పశ్చిమాద్రిని చేరుకొంటున్న సూర్యుడు ఎర్రగా మెరుస్తున్నాడు. కాంతిలో వేడితగ్గి వాతావరణం చల్లబడసాగింది.

ట్రక్కు ప్రక్కనే మౌగ్లీ టెంట్ వేస్తున్నాడు. డాక్టర్‌గారు నా వద్దకు వచ్చారు.

"ఈ రాత్రికి మన కేంప్ ఇక్కడే." అంటూ నాభుజంపై చెయ్యి వేశారు.

చుట్టూ పరిశీలించాను.

దూరంగా పెద్దపెద్ద ఇసుక మేటలు ఇసుక గుట్టలు కనుచూపుమేరలో కన్పిస్తున్నాయి. వాటి కవతల ఎక్కడో ఎండమావులు కన్పిస్తూ విభ్రాంతి కల్గిస్తున్నాయి.

గాలిలో వేడి తగ్గి చల్లగా వీస్తూంది. కళ్ళకున్న 'విండ్ షీటర్' గాగుల్స్ తీసి జేబులోకి తోసి, టెంట్‌వైపు కదిలాను. అప్పటికే టెంట్ వేయటం పూర్తయి సామానులు సర్దుతున్నాడు మౌగ్లీ.

డాక్టర్‌గారి ప్రక్కన చతికిలబడ్డాను.

కులాసాగా కబుర్లు చెప్పుకొంటూ భోజనం పూర్తిచేసి నిద్ర కుపక్రమించాము.

3

ఏదో భయంకరమైన అరుపు విన్పిస్తే ఉలిక్కిపడి నిద్ర లేచాను. చుట్టూ చూసాను. డాక్టరుగారు హాయిగా నిద్ర పోతున్నారు. విన్పించిన అరుపుగురించి ఆలోచిస్తూ బయటకు కదిలాను.

చలిగాలి విసురుగా ముఖాన్ని తాకింది. కొద్ది దూరంలో 'మౌగ్లీ' కుర్చీలో కూర్చొనే నిద్రపోతున్నాడు. నిద్రలో కూడా అతని చేయి మెషీన్‌గన్‌ను బలంగా పట్టుకొని ఉంది.

అపరాధ పరిశోధన పోటీ—80 [ఫలితాలు]

మార్చి '75 నెల "అపరాధ పరిశోధన పోటీ_80"కి సరియైన సమాధానాలు:

1. టెలివిజన్.
2. ఆటలు.
3. మంగమ్మా.
4. మంచినీరు.
5. నాయకుల ఉపన్యాసాలు.

పై జవాబుల ప్రకారం నలుగురు మాత్రం ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూన్ '75 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపబడుతుంది.

(1) మిస్. ఆర్. సంపత్ కుమారి, తండ్రి పేరు— ఆర్. సి. సింగ్, పోస్టుమాస్టర్, గుంతకల్ (అనంతపురం జిల్లా.)

(2) శ్రీమతి బి. పుతిలీబాయి, భర్త పేరు—బి. ఎల్లయ్యా, నార్సింగి (మెదక్ జిల్లా.)

(3) శ్రీ కూరపాటి వెంకటేశ్వరరావు, తండ్రి పేరు— కె. రామస్వామి గుప్తా, గాంధీనగరం, విజయవాడ_3.

(4) శ్రీ బి. వెంకటస్వామి, యార్న్ మర్చంట్, నాగర్ కర్నూలు (మహబూబ్ నగర్ జిల్లా.)

ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాను. పొగగుండెల్లోకి వెళ తోంటే వెచ్చగా, హాయిగా ఉంది. వాచి చూసుకొన్నాను. ఐదుగంటలు దాటింది. చుట్టూ వకసారి పరీక్షగా చూసి, ఆకాశంలోకి చూసాను.

తూర్పు వైపున కొంచెం ఎర్రగా సంధ్య కాంతులు ముసురుకొంటున్నాయి. చాలావరకూ నక్షత్రాలు మసక వెలుగులో అదృశ్యమై అక్కడక్కడ కొన్ని మాత్రం వెల వెలబోతూ కన్పిస్తున్నాయి.

మళ్లీ విన్పించిందా అరుపు. చెవులు రిక్కించి వింటున్న నాకు ఆ అరుపులో రెండు గొంతుకలు విన్పించాయి.

'ఒక వేళ తప్పుగా విన్నానేమో. లేకపోతే ఒకే అరుపులో రెండు గొంతుకలు ప్రతిధ్వనించిన ట్లనిపించటమేమిటి?' అనుకొన్నాను. కాని మరుక్షణంలోనే నా సందేహం నివృత్తి అయిపోయింది. జాగ్రత్తగా వింటేనేగాని తెలియటంలేదు.

బహుశా రెండు జంతువులు కొట్టుకొంటున్నాయి కాబోలు. అందుకే ఒక జంతువు అరిచిన వెంటనే దాని నోట్లోంచి శబ్దం రాకమునుపే రెండో జంతువు కూడ అరుస్తోంది. ఫలితంగా మొదటిదాని అరుపు రెండోదాని అరుపులో కల్సిపోయి ఒకే అరుపులా విన్పిస్తోంది.

చుట్టూచూసాను. ఎత్తైన ఇసుక దిబ్బలు మసక వెలుగులో కన్పిస్తోన్నాయి. టెంటులోపలకెళ్ళి మెషన్‌గన్ను తెచ్చుకొని ప్రక్కనున్న ఇసుక దిబ్బల వైపు నడిచాను. అవెక్కితే బహుశా ఆ జంతువులు కన్పించ వచ్చునని నా ఊహ.

నాలుగడుగులు వేశానో, లేదో వెనుక నుంచి పిలుపు విన్పించింది. తిరిగి చూసాను 'మొగ్లి' గన్ సర్దుకొంటూ వస్తున్నాడు.

"పదండి వెళ్దాం" అన్నాడు దగ్గరకొచ్చాక. వాచిచూసు కొన్నాను. ఐదున్నర. ఆరు గంటలకుగాని డాక్టరుగారు నిద్ర లేవరు.

చకచకా నడుస్తున్నాము ఇద్దరము. కొంచెం దూరంనడిచి ఎదురుగా ఉన్నఎత్తైన ఇసుక దిబ్బ ఎక్కసాగాము.

ఆకాశంలో వెలుగు పరచుకొంటుంది సన్నటిగాలి వీస్తుంది గాలితోబాటు వీస్తున్న ఇసుక తుంపరుల నుంచి మాకళ్ళను "విండ్ షీటర్ గాగుల్స్" కాపాడుతున్నాయి. కాళ్ళకున్న "యాంకిల్ బూట్సు" ఇసుకలో వేగంగా నడవటానికి సహాయ పడుతోంటే, వంటి మీద ఉన్న 'ఓవరాల్ కోటు' ఎడారి వాతావరణం నుంచి నన్ను కాపాడుతోంది.

కాళ్ళ మధ్యనుంచి ఎడారి పామేదో జరజర పాకుకొంటు వెళ్ళింది. ఎంత వేగంగా నడిచినా పావుగంట పైనే పట్టింది పైకి చేరుకోవటానికి. ఎదురుగా కన్పించిన దృశ్యముచూసి ఉలిక్కిపడ్డాను.

సుమారు ఇరవై అడుగుల ఎత్తున్న రెండు జంతువులు కలబడి కొట్టుకుంటున్నాయి. చూడటానికే చాలాభయంకరంగా ఉన్నాయవి. పొడుగైన మెడలు రెండూ పెనవేశి తలలతో మోదుకొంటూకాళ్ళతోతన్నుకొంటు ఇసుకలోదొర్లుతున్నాయి.

వాటిలో వకదాన్ని గుర్తించాను. భూగర్భ సాహస యాత్రలో ప్రొఫెసర్ ఆంథోనీగారు చూపించిన ఫాసిల్స్‌లో ఈ జంతువు ఫాసిల్ ఉంది. దానిపేరు "లిజార్డ్ హెడ్" చాలా క్రూర జంతువు.

రెండో జంతువు పేరు ఏమిటో సరిగా తెలియటంలేదు. ఆ జంతువులు రెండూ కలబడి కొట్టుకొంటుంటే ఇసుక దుమారంలా లేస్తోంది.

ఐదు నిమిషాలు గడిచాయి. వాటి పోట్లాటలో ఏ విధమైన మార్పు కన్పించలేదు నాకు. ఏ వక్కటి అలసినట్లు లేదు. పైగా మొదటికంటే దారుణంగా కొట్టుకొంటున్నాయి.

కెమెరా తీసుకు రానందుకు నన్ను నేనే తిట్టుకొన్నాను. ఏంచేద్దామా అని ఆలోచిస్తూ నిల్చున్నాను.

అప్పుడు గుర్తుకొచ్చింది నా జేబులోని లైటర్, దాని లోని పవర్ ఫుల్ మినీ కెమెరా. దానిలో ఒకేసారి నాలుగు రీళ్ళు అమర్చుకోవచ్చు. ఏకధాటిగా నలభై ఫోటోలు తీయ వచ్చు. మిశ్రాగారు వాటివి జర్మనీనుంచి తెప్పించి తన ఏజం ట్లందరికి తలొకటి ఇచ్చారు.

దానితో ఇంకా చాలా పనులు చేయవచ్చు. అవసరమైతే టైం ఫిక్సు చేసి టైంబాంబ్‌గా ప్రేల్చేయ్యవచ్చు. ట్రాన్స్ మీటర్‌గా మార్చి బాస్‌తో మాట్లాడవచ్చు. ఇంకా రకరకా లుగా ఉపయోగించవచ్చు.

ఓవరాల్ కోటు వెనక ఉన్న షర్ట్ జేబులోంచి బయటకు తీసాను లైటర్‌ని. ముందుగా సిగరెట్ వెలిగించుకొని, ఫొటోలు తీయసాగాను. అతి స్వల్పమైన కాంతిలో కూడా స్పష్టంగా ఫోటోలు తీయగలదు అది.

పది నిముషాలు గడిచాయి. ఫోటోలు తీయటం ఆపి లైటర్ జేబులోకి తోసాను. వాటి పోట్లాట మామూలుగా సాగిపోతోంది. చూస్తూంటే ఏదో ఇంగ్లీష్ పిక్చర్ చూస్తు న్నంత థ్రిల్‌గా ఉంది.

అకస్మాత్తుగా ప్రొఫెసర్ ఆంధోనీగారు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి నాకు.

'ఈ డైనోసార్స్ దాని జాతి జంతువులు సాధారణంగా యుద్ధాలు చెయ్యవు. ఒకవేళ ఏ కారణంచేతనయినా వాటిలో వాటికి యుద్ధాలు సంభవిస్తే జంతువులో ఏదో ఒకటి చచ్చే

వరకు ఆగవు. ఇవి పోట్లాటలు మొదలెడితే గంటలే కాదు, రోజులుగూడా గడిచిపోతాయి. వాటి పోరాటాలు చాలా భయంకరంగా ఉండి చూచేవారికి ఏవో రెండు పర్వతాలు కలబడినట్లు కన్పిస్తుంటుంది.'

అలాగే ఉంది వీటి తీరుకూడా అనుకొన్నాను. ఓసారి వాటివంక పరిశీలనగా చూసి వెనక్కి తిరిగాను. ఆకాశంలో వెలుతురు ఎక్కువయింది. సూర్యుడు తూర్పున ఉదయిస్తూ తన నులివెచ్చని కిరణాలను మాపై ప్రసరింప చేస్తున్నాడు'

అప్పుడు విన్పించింది గుండెలవిసేంత కఠోరంగా చావుకేక. అదిరిపడి వెనక్కి తిరిగాను.

ఒక జంతువు నేలపై కూలిపోతోంది. దాని తల రెండుగా విడిపోయి రక్తం ధారగా చిమ్ముతోంది. ఇసుకలోపడి గిల గిలా కొట్టుకొంటూ కొండచిలువలా మెడను మెలికలు తిప్పుతూ కూలిపోయింది. చూస్తుండగానే దానిలో చలనం ఆగిపోయింది.

గెల్చిన జంతువు నేను గుర్తుపట్టిన 'లిజార్డ్ హెడ్ట్.' అది సంతోషంతో ఒకసారి అరిచి, చుట్టూ చూసి మేమున్న ఇసుక దిబ్బవైపు బయలుదేరింది.

ఉలిక్కిపడ్డాను. మౌగ్లి నావైపు కంగారుగా చూసాడు. ఏంచెయ్యాలో తోచలేదు. 'లిజార్డ్ హెడ్ట్' ఇసకదిబ్బ ఎక్క సాగింది. ఓ నిముషం తీవ్రంగా ఆలోచించాను. ఐడియా తట్టింది. కాని చాలా ప్రమాదంతో కూడుకొన్నది. ఐనా తప్పదు. నన్నేకాదు, మిగిలిన ఇద్దరినీ రక్షించాల్సిన బాధ్యత నాపై ఉంది.

మౌగ్లివైపు తిరిగాను.

"నువ్వు ఇక్కడే ఉండి ఆ జంతువు ఇటువైపు వస్తే కాల్చు!" అన్నాను,

"మరి మీరు?" అడిగాడు.

"చూస్తూండు!" అంటూ మెరుపులా ముందుకు దూకి మెషిన్‌గన్‌ను కాలుస్తూ దాని ఎదురుగా పరిగెత్తాను.

పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ పైకి వస్తున్న 'లిజార్డ్ హెడ్' నన్ను చూడగానే స్థంభించి పోయినట్లు ఆగి పోయింది.

మరుక్షణంలోనే గమ్యం మార్చుకొని నా వెనుకపడింది. ఎంత వేగంగా పరిగెడుతున్నా ఇసుకలో ఎక్కువ దూరం పోలేక పోతున్నాను. బాగా దగ్గర కొచ్చేసింది "లిజార్డ్ హెడ్."

చుట్టూ చూశాను. కొంచెం దూరంలో చిన్న ఇసుకదిబ్బ ఉంది. నేనున్నచోట వాలుగా ఉండటంవలన పరిగెట్ట నవసరం లేకుండానే దొర్లిపోసాగాను. ఇసుకదిబ్బ చేరుకోగానే దాని వెనక నక్కి పరుగుదీసి చాటుగా బయటకు చూడసాగాను.

నన్ను తరుముకు వస్తున్న 'లిజార్డ్ హెడ్' ఆగిపోయింది. నేను ఎక్కడా కన్పించక పోవటంతో ఆశ్చర్యంతో చుట్టూ చూస్తోంది.

ట్రిగ్గర్ నొక్కాను. బులెట్స్ దూసుకెళ్ళి దాని శరీరాన్ని తాకి క్రిందుకు రాలిపోయాయి. నివ్వెరపోయాను వకక్షణం. అంతలో గుర్తుకొచ్చింది వాటి పోట్లాట.

వెంటనే తలవైపు గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాను. మెషిన్ గన్ భయానకంగా గర్జించింది. బులెట్స్ దూసుకెళ్ళి తలలో దూరిపోయాయి. బాధగా అరిచింది. మళ్ళీ కాల్చాను. ఈ సారి నోట్లోకి దూసుకుపోయి తలలోంచి బయటకు వచ్చాయి బులెట్స్.

లిజార్డ్ హెడ్ కూలిపోయింది మరోసారి అరిచి. సంతో

షంతో తృప్తిగా నవ్వుకొన్నాను.

మాగ్గీ నేనూ తిరిగి ట్రక్కు దగ్గరకు వెళ్ళేసరికి ఏడు గంట లయింది. మాకోసం ఎదురుచూస్తున్న డాక్టరుగారికి జరిగిం దంతా తెలిపి కాలకృత్యాలు తీర్చుకొని బ్రేక్‌ఫాస్టు పూర్తి చేసాము.

పెట్రోల్‌తో ఇసుకలో మంటచేసి బ్లాక్ కాఫీ తయారు చేసాను.

మరో పావుగంటలో అన్నీ పూర్తి చేసుకొని ట్రక్‌లోకి చేరాము. సూర్యుని కిరణాలకు క్రమంగా వేడెక్కుతున్న ఎడారిలోకి భారంగా కదిలింది ట్రక్కు.

ఈసారి డ్రైవింగ్ సీట్లో డాక్టరుగా రున్నారు.

4

మధ్యాహ్నం రెండు గంటలయింది. దట్టమైన ఇసుక దిబ్బల్లోంచి కదులుతున్నాయి ట్రక్ చక్రాలు. వేడిలో సూర్యునితో పోటీ పడుతోంది థార్ ఎడారి. సూర్యకిరణాలు గాజువంటి ఇసుకలోపడి ప్రతి ఫలిస్తున్నాయి.

ట్రక్కును ఆపారు డాక్టరుగారు. కళ్ళు మూసుకొని ఆలోచిస్తున్న నేను నెమ్మదిగా కళ్ళుతెరిచి ఆయనవైపు చూశాను. డోర్ తెరుచుకొని క్రిందకు దిగాను. వెనక సీట్లో నిద్రపోతున్న మాగ్గీవంక వకసారి చూసి నేనూ క్రిందకు దిగాను.

వేడిగాలి ఆవిరిలా ముఖాన్ని తాకింది. వేడిని భరించలేక 'విండ్ షీటర్ గాగుల్స్' వెనకనున్న నా కళ్ళు రెపరెప లాడాయి. ఇసుకలో కూరుకుపోతున్న కాళ్ళను బలంగా పైకి లాక్కుని ముందుకు నడిచాను.

డాక్టర్ నరేష్‌గారు బైనాక్యులర్స్‌లో చుట్టూ చూస్తు

న్నారు. ఆలోచిస్తూ అన్నివైపులు పరిశీలనగా చూశాను. ఏ జీపీ కన్పించటంలేదు. అక్కడక్కడ కొన్ని రకాల ఎడారి మొక్కలు కన్పిస్తున్నాయి.

ఆలోచిస్తున్న నేను డాక్టరుగారి అరుపుతో వెనక్కితిరిగి ఉలిక్కిపడ్డాను.

రెండడుగుల ఎత్తుందా పాము. ఎడారి పాము కాబట్టి ఇసుక రంగులో తళతళలాడుతూ బుసలుకొడుతోంది. కాటు వేస్తుందేమో అనుకొంటూ రెండడుగులు వెనక్కివేసి జేబు లోంచి రివాల్వర్ తీసాను.

'ధన్'మంది నా చేతిలోని రివాల్వర్. పడగ చెదిరి పోయింది. అడుగు ఎత్తు ఎగిరి క్రిందపడింది.

విషపు బిందువులు నా కళ్ళకున్న 'విండ్ షీటర్ గాగుల్స్' పై చిందాయి. మెరుపులా గాగుల్స్‌తీసి ఇసుకలో పడేశాను. విషం బిందువులు నా ముఖంపైకి కారకుండా.

గాగుల్స్ పైని విషం ఇసుక పూర్తిగా పీల్చుకొనేదాకా ఆగి వాటిని తీసుకొన్నాను. కర్చీఫ్ దూరంగా పడేశాను.

ట్రక్‌లోంచి దిగేముందు ఇసుక కళ్ళలోకి పడకుండా ఉండటం కోసం అవి కళ్ళకు తగిలించుకోవటం మంచి దయింది.

నిట్టూరుస్తూ ట్రక్ దగ్గరకు నడిచాను. ట్రక్ కదిలింది. నడుపుతూ చెప్పారు డాక్టరుగారు ఆ పాము గురించి.

"ఎడారి పాముల్లోకెల్లా చాలా ప్రమాదమయిన పాము ఇది. మనిషిని కరవదు. కాని విషం చిమ్ముతుంది. సర్వ సాధారణంగా అది విషాన్ని కళ్ళల్లోకే చిమ్ముతుంది. ఆ విషం శరీరంపై ఎక్కడ పడినా వెంటనే యాసిడ్‌లా గ్రహించి వేస్తుంది. అంత ప్రమాదమైన విషమది!"

ట్రక్ ఎడమచేతివైపు తిప్పారు. "ఇటెక్కడికి?" ఆశ్చ ర్యంగా అడిగాను.

"దూరంగా ఖర్జూరపు చెట్లు కన్పిస్తున్నాయి. బహుశా వయాసిస్సు ఉండవచ్చు. అక్కడ జీవించే ఎడారి ప్రజలను ప్లేను గురించి అడిగి ఈ రాత్రికి అక్కడ విశ్రాంతి తీసుకొని ఉదయాన్నే బయలుదేరుదాం!" అన్నారు డాక్టరుగారు.

ఎప్పుడు లేచాడో తెలీదుగాని మౌగ్లీ అన్నాడు కంపాస్ చూస్తూ.

"ఇటువైపు 'సనోరా తండా' ఎడారి ప్రజలు నివసిస్తు న్నారు" చెప్పాడు.

గంట గడిచింది.

దూరంగా, గుడారాలు కన్పిస్తున్నాయి. మరో పావు గంటలో అక్కడకు చేరుకొన్నాము.

చాలా పెద్ద వయాసిస్సు అది. సుమారు ఇరవై అడుగు లుంది చుట్టుకొలత.

ట్రక్కు ఆగగానే అప్పటివరకూ విచిత్రంగా చూస్తున్న పదీ పదిహేను మంది చిన్నపిల్లలు అరుచుకొంటూ గుడారాల వైపు పరుగుతీసారు. మౌగ్లీ నవ్వుకొంటూ అటువైపు కది లాడు.

ఒయాసిస్సును విచిత్రంగా చూస్తున్నాను. నా జీవి తంలో మొదటిసారిగా ఒయాసిస్సును చూడటం అదే!

ఐదు నిముషాలు గడిచాయి.

నలుగురైదుగురు పెద్దవాళ్ళతో కలిసి మౌగ్లీ నవ్వు మొహంతో మావైపు వస్తున్నాడు. నేనూ డాక్టరుగారూ ఎదురు వెళ్ళాం. దగ్గరకు రాగానే తలలు వంచి వినయంగా ఆహ్వా నించారు ఎడారి ప్రజలు.

వారితో కల్సి గుడారాల వైపు కదిలాము. సాయంత్రం నాలుగు గంటలౌతుంది. వాళ్ళతో డాక్టర్‌గారు అరబిక్ భాషలో మాట్లాడుతోంటే విసుగుపుట్టి గుడారం బయటకు వచ్చాను.

మాగ్గీ ఎక్కడా కన్పించలేదు. ఖర్జూరపుచెట్లు నిండా పళ్ళతో గాలికి భారంగా తలలూపుతున్నాయి. చెట్ల క్రిందుగా చిన్న పిల్లలు ఆడుకొంటున్నారు. వంటినిండా పూసలతో నగ్నంగా అదోలా ఉన్నారు చూడటానికి.

"విజయ్!" లోనుంచి పిల్చారు డాక్టరుగారు. లోపలికి నడిచాను. తలలు అదోలా వంచి సెలవు తీసుకొని బయటకు వెళ్ళిపోయారు ఎడారి ప్రజలు.

"వాట్ సర్!" అడిగాను ఆయన ప్రక్కనే కూర్చొంటూ. ఆయన ముఖంలో సంతోషం కన్పిస్తోంది.

"మన విమానం ఆచూకీ తెల్సిందోయ్!" అన్నారు. ఆయన ఎంతో ఉత్సాహంగా ఉంటేగాని 'ఓయ్' అనరు.

"చెప్పండి" అన్నాను.

"పదిహేను రోజుల క్రితం ఒకరాత్రి తండాను కాపలా కాస్తున్న పదిమందికి విమానం కూలిపోతూ ఇటునుంచి దక్షిణంగా దూసుకుపోవటం కన్పించిందట. ఆ మర్నాడు అటు వైపు వెళ్దామనుకొన్నారట. కాని ఇక పైనంతా ఎడారిదొంగ లెక్కువని భయపడి వెళ్ళలేదట." అన్నారు.

"ఎడారి దొంగలా!"

"అవును. చాలా క్రూరమైన ఎడారి దొంగలు. చంబల్ లోయలోని బందిపోట్లకంటె రాక్షసులు వీళ్ళు!" అన్నారు.

"ఏం చేద్దాం మరయితే?"

"అదే ఆలోచిస్తున్నాను" అన్నారు.

"ఏమైనా మనం వెళ్ళక తప్పదు! ఇంతదూరం వచ్చి

వీళ్ళకు భయపడి వెనక్కి వెళ్ళటం అనేది జరగని పని. అయినా బయలుదేరేటప్పుడే ప్రాణాలపై ఆశ వొదిలేసుకొని ఇప్పుడు భయపడటంలో అర్థంలేదు" అన్నాను.

"ఆల్ రైట్! ఏదయితే అదవుతుందిగాని ఉదయాన్నే బయలుదేరుదాం" అన్నారు డాక్టరుగారు స్థిరకంఠంతో.

అంతలో మాగ్గీ లోపలికొచ్చాడు. అతని వెనుకే ఇద్దరు ఎడారి వ్యక్తులు రెండు ప్లేటులనిండుగా ఏవో పదార్థాలు తెచ్చారు. అవి తిని, ఒంటె పాలతో తయారుచేసిన 'టీ' త్రాగాం.

వాచీ చూసుకొన్నాను. గంట ఐదయింది. ముగ్గురమూ బయటకు వచ్చాం. వాతావరణం చల్లబడి గాలిలో మార్పు వచ్చింది.

మాగ్గీతో కల్సి దూరంగా కన్పిస్తున్న పొలాలవైపు బయలుదేరాం డాక్టరుగారూ నేనూ.

ఆ రాత్రికి 'కార్కోల్'తో వండిన మాంసం, రొట్టెలతో బాటు చాలా రోజుల తర్వాత తృప్తిగా కడుపునిండా భోజనాలు చేసాం. వెచ్చని ఉన్ని కంబళ్ళలో సుఖంగా నిద్ర పోయాము.

5

ఉదయం ఏడు గంటలయింది. 'సనోరా తండా' నాయకులవద్ద నుంచి సెలవుతీసుకొని ట్రక్ చేరుకున్నాం.

స్టీరింగ్ వీల్ ముందు కూర్చొని స్టార్టు చేసాను. రెండు సార్లు జర్కు ఇచ్చి ముందుకు కదిలింది.

'సనోరాతండా' ఉన్నచోటునుంచి దక్షిణంగా పయనిస్తోంది ట్రక్. దూరమైపోతున్న తండా పరిసరాలు చివరిసారిగా చూసి సిగరెట్ వెలిగించాను. గంటకు పది కిలోమీటర్ల

వేగంతో కదులుతోంది.

మధ్యాహ్నం దాటినా విమానం ఆచూకీ దొరకలేదు. సుమారు నలభై మైళ్ళదూరం వెళ్లాము. ట్రక్కు ఆపాను.

లోపల కూర్చొన్న డాక్టరుగారు ఫుడ్‌పాకెట్ అందించారు. మంచి ఆకలిమీద ఉండటం వలన పది నిమిషాలలో తినటం పూర్తిచేసి వాటర్ బాగ్‌లోంచి నీళ్ళు త్రాగాను.

మరో అరగంటలో తిరిగి బయలుదేరింది ట్రక్.

ఈసారి డ్రైవింగ్ సీట్లో మాగ్గీ ఉన్నాడు. ట్రక్ బాడీలో డాక్టరుగారి ప్రక్కన కుర్చీలో కూర్చొన్నాను. బుట్ట లోంచి ఖర్జూరాలు కొన్నితీసి వక ప్లేటులో వేసుకొని తిన సాగాను.

ట్రక్ నడుస్తుండగా ఏర్పడుతున్న చిన్నచిన్న కుదుపులకు కళ్ళు మూతలు పడుతున్నాయి. మిగిలిన పళ్ళు తినేసి ప్లేట్ ప్రక్కన పెట్టాను. కళ్ళు మూసుకోగానే నిద్ర పట్టింది. హాయిగా నిద్రపోయాను.

పెద్దగా కేక. మెషిన్‌గన్ చప్పుడుకు ఉలిక్కిపడి లేచాను. ట్రక్కు ఆగి వుంది. డాక్టరుగారు నిద్రలో వున్నారు. ఏవో కేకలు, మెషిన్‌గన్ మ్రోగుతున్న శబ్దాలు వినిపిస్తున్నాయి స్పష్టంగా.

గన్ అందుకొని బయటకు పరుగెత్తాను. ఎదురుగా కన్పించిన దృశ్యం చూచి స్టన్ అయ్యాను.

సుమారు రెండు మూడు వందల ఎడారి నక్కల మంద కొంచెం దూరంలో నిల్చుని మాగ్గీ వైపు క్రూరంగా చూస్తు న్నాయి. వాటి ముందు కొన్ని నక్కలు చచ్చి పడున్నాయి.

ట్రిగ్గర్‌పై వ్రేలు బిగించి వాటికేసి జాగ్రత్తగా చూస్తూ ఒకొక్క అడుగే వెనక్కి వేస్తున్నాడు మాగ్గీ.

ఎడారి నక్క లెంత క్రూరమైనవో నాకు తెలుసు. మామూలు నక్కలైతే మనిషిని చూడగానే పారిపోతాయి. కాని ఈ ఎడారి నక్కలు అలాగాదు, మనిషి కన్పిస్తే చాలు ఒక్కసారిగా విరుచుకు పడి బొమిక లేకుండా తినేస్తాయి.

మౌగ్లీని హెచ్చరించి, నెమ్మదిగా ట్రక్‌లోకి రమ్మన్నాను.

మౌగ్లీ దాదాపు ట్రక్కు దగ్గరగా వచ్చేశాడు. అప్పుడు జరిగిపోయింది పొరపాటు. మా అయిడియా ఏమిటో ఆ నక్కలకు అర్థమైంది కాబోలు మెరుపులా ముందుకుదూకాయి. ఒక్కసారిగా మౌగ్లీని చుట్టుముట్టాయి.

నేను ట్రిగ్గర్ నొక్కుతూ అటూ, ఇటూ త్రిప్పసాగాను. మెషిన్‌గన్ గొలుసులా మ్రోగుతోంటే టప టపా కూలి పోతున్నాయి ఎడారి నక్కలు.

సుమారు వంద దాకా కూలిపోయాయి. కొన్ని నక్కలు దూరంగా పారిపోయి గుర్రుగా చూస్తున్నాయి.

మౌగ్లీ ఆర్తనాదం విన్పించి ప్రక్కకు తిరిగాను. కొంచెం దూరంలో పదీ- పన్నెండు నక్కల మధ్య గింజుకొంటూ అరుస్తున్నాడు మౌగ్లీ.

వాటిని షూట్ చేద్దామనుకొన్నాను కాని బులెట్స్ అతడికి తగులుతాయేమోనని భయంవేసి మానుకొన్నాను.

ఆలస్యం చేస్తే మౌగ్లీ దక్కడు. మెషిన్‌గన్ ట్రక్కులో పడేసి జేబులోంచి నైఫ్ లాగాను. బటన్ నొక్కగానే బ్లేడ్ పైకొచ్చింది. ట్రక్కు దిగి ఒక్క ఉదుటన వాటి మీద విరుచుకు పడి చకచకా నాలుగు పోట్లు పొడిచాను. గిలగిలా కొట్టుకొంటూ మూడు కూలిపోయాయి. అందినదానినల్లా పట్టుకొని అటూ ఇటూ విసిరేస్తూ వాటి మధ్య స్పృహతప్పి పడున్న మౌగ్లీని భుజంపై వేసుకొని ట్రక్కు దగ్గరకు పరిగెత్తాను.

అప్పటికి డాక్టరుగారు కూడా లేచి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నారు.

ట్రక్కు బయలుదేరింది.

6

మొదటగా విమానాన్ని చూసినది నేను. దూరంగా అస్పష్టంగా కన్పిస్తున్నాయి శిధిలాలు. ఆనందం పట్టలేక సంతోషంగా ఒక అరుపు అరిచాను జంగ్లీ పిక్చర్‌లో హీరో లాగ.

"ఏమిటి?" డాక్టరుగారు అడిగారు. చెప్పాను ఆయనకు. సంతోషంతో లేచి కూర్చొన్నారు "ఎక్కడ? ఎక్కడ?" అంటూ.

బైనాక్యులర్స్ అందించాను. కిటికీలోంచి చూసారు. దూరంగా ప్లేన్ కూలిపోయిన శిధిలాలు కన్పించాయి ఆయనకు.

పది నిముషాలలో అక్కడకు చేరుకొంది ట్రక్కు.

ట్రక్కులోంచి దిగాము ముగ్గురం. దూరంగా నలువైపులా ఎండమావులు అందంగా కన్పిస్తున్నాయి.

విమానం భాగాలు చెల్లా చెదురుగా పడివుండి కొన్ని నల్లగా మాడిపోయి ఉన్నాయి. విమానం రెక్కలు సగం ఇసుకలో కప్పబడి మిగిలిన సగం పైకి కన్పిస్తున్నాయి.

డకోటా విమానం అది. చాలా చిన్నది. దాని తోకమీద 'ఇండియన్ ఎయిర్ లైన్స్' అన్న పెయింట్ అక్షరాలు సూర్యకాంతిలో మెరుస్తున్నాయి.

విమానం సగంపైనే ఇసుకలో కప్పబడి ఉంది. ట్రక్కులోంచి పారలాంటి పరికరం తీసుకొచ్చి చుట్టూ కప్పిన ఇసుకను తొలగించసాగాను. మోగ్లీ నాకు సహాయం చేసాడు.

మీకు తెలుసా?

PALASA

1. ప్రముఖ జలపాతమైన ఏంజల్, వెనిజులా దేశంలో వున్నది. అక్కడ నీరు 2648 అడుగుల ఎత్తు నుండి క్రింద పడుతుంది.

2. పెద్ద వృక్షము కాలిఫోర్నియాలోని సెక్వోషియా నేషనల్ పార్కులో వున్న ఎఱ్ఱ చందనం చెట్టు. మొదలు చుట్టుకొలత 101 అడుగులు.

3. పెద్ద క్రీడా మందిరము ప్రేగ్‌లోని స్ట్రాహోల్ స్టేడియం. ఇందు 240,000 మంది ప్రేక్షకులకు వసతి కలదు.

4. పొడవైన సొరంగం లండన్‌లోని భూగర్భ రైల్వే సొరంగం. పొడవు $17\frac{1}{2}$ మైళ్ళు.

5. మరకతమణుల ద్వీపము—ఐర్లండ్.

6. ఏకాంతద్వీపము-ట్రిస్టన్‌డి కన్హా (అట్లాంటిక్ మహాసముద్రంలో కలదు.)

—బి. విజయకుమార్.

అరగంట గడిచింది.

నాలుగు శవాలు బయటపడ్డాయి. అడ్డుగా ఉన్న ఇనుప ముక్కలను నెట్టుకొంటూ విమానంలోనికి నడిచాను. ఒక్కసారి గుప్పున కొట్టింది దుర్గంధం. కిటికీ అద్దాలు పగిలి పోవటం వలన వెలుతురు లోపలి కొస్తూంది.

కాలికేదో తగిలింది. ముందుకు పడబోయి నిలదొక్కుకొని క్రిందకు చూసాను.

చెక్కపెట్టెలు. లెక్కపెట్టాను. మొత్తం ఆరు. వాటిపైన ఎక్సైజ్ డిపార్టుమెంటు ముద్రలు కన్పిస్తున్నాయి. లోపల ఉన్నది బంగారమని నాకు తెలుసు. దాటుకొంటూ ముందుకు నడిచాను.

పదినిముషాలు పట్టింది అంతా పరిశీలించటానికి. మరో మూడు శవాలు కన్పించాయి. గుర్తు పట్టటానికి పోలికలు దొరకటంలేదు.

దుర్గంధం భరించలేక బయటకు వచ్చాను. డాక్టరుగారికి జరిగిందంతా చెప్పేసరికి మౌగ్లీ కాబిన్‌లోంచి వచ్చాడు.

రెండు నిముషాలలో డాక్టరుగారు చెప్పిన ప్రకారం బంగారం ఉన్న పెట్టెలను ట్రక్కులో పెట్టాడు మౌగ్లీ.

జేబులోంచి కంపాస్‌తీసి చూశాను. డాక్టరుగారి వైపు తిరిగి. "దక్షిణంగా బికనీర్‌కు మూడువందల మైళ్ళ దూరంలో సట్లేజ్‌కు వందమైళ్ళ దూరంలో ఉన్నాము" అన్నాను.

"సట్లేజ్ సింధు ఉపనది కదూ!"

"అవును. అది దాటితే పంజాబ్‌లోని ముల్తాన్ చేరుకోవచ్చు. అక్కడినుంచి ఢిల్లీ వెళ్ళటం చాలా సులభం" అన్నాను.

రెండు నిముషాలు తీవ్రంగా ఆలోచించి అన్నారు డాక్టరుగారు.

"ఆల్‌రైట్! మన పనెలాగూ పూర్తయింది. ఎంత తొందరగా వెళితే అంత మంచిది. వెంటనే బయలుదేరితే రెండు రోజుల్లో సక్లేజ్ చేరుకోవచ్చు" అంటూ ట్రక్కు వైపు కదిలారు. ట్రక్కు కదిలింది.

రెండు గంటలు గడిచాయి.

ట్రక్కు మలుపు త్రిప్పుతూ 'రియర్ వ్యూ' చూసి ఉలిక్కిపడ్డాను. అస్పష్టంగా ఏదో ఆకారం కన్పించింది. కొంచెం దూరంపోయాక మళ్ళీ కన్పించిందా ఆకారం.

"మైగాడ్ ఎడారి దొంగలు" అరిచారు డాక్టరుగారు. విండోలోంచి బయటకు చూసాను. స్పష్టంగా కన్పించారు ఎడారి దొంగలు. సుమారు పదిమంది వున్నారు. చాలా క్రూరంగా ఉన్నారు.

ఒక చేతిలో 'డబుల్ బారల్ గన్' ఉంది. రెండో చేతితో వంటెలను అదిలిస్తూ అరుస్తున్నారు. గాలికి వాళ్ళ వంటిమీద ఉన్న పూసల దండలు కదులుతున్నాయి.

దూరంగా పెద్దపెద్ద రాతి బండలు కన్పిస్తున్నాయి. డాక్టరుగారిని హెచ్చరించి మెషిన్‌గన్ పట్టుకొని క్రిందకు దూకి రాళ్ళ వెనకకు పరిగెత్తాను.

డాక్టరుగారు ట్రక్‌ను ఒక ఇసుక దిబ్బ వెనుక ఆపారు. మాగ్లీ దిగి ట్రక్ పక్కనే ఇసుకలో నక్కాడు.

దగ్గరగా వచ్చారు ఎడారి దొంగలు. మెషిన్‌గన్ ట్రిగర్‌పై వేలు బిగించాను. నా చేతిలో ఉన్నది లైట్ మెషిన్‌గన్. చాలా పవర్‌ఫుల్ డేంజరస్ వెపన్. దానితో ఒక నిముషంలో 500 రౌండ్లు కాల్చవచ్చు. దాని రేంజ్ 500 గజాలు.

'వ్యూ'లోకి వచ్చారు నలుగురు దొంగలు. ట్రిగర్ లాగుతూ విననకర్రలా త్రిప్పాను. నలుగురూ కూలి

పోయారు. మిగిలినవాళ్ళు కాల్చిన బులెట్స్ నా తలపైనుంచి దూసుకొనిపోయాయి.

అందరి దృష్టి నాపై కేంద్రీకరింపబడింది. అదే సమయంలో ఇసుక గుట్ట వెనకనుంచి మౌగ్లీ చేతిలోని గన్ మొరిగింది. ముగ్గురు కూలిపోయారు. మిగిలిన ముగ్గురూ కంగారుగా వెనక్కితిరిగారు. చటుక్కున లేచి నిలబడి మళ్ళీ కాల్చాను. పారిపోతున్న ముగ్గురూ నేలపైకి రాలిపోయారు.

తృప్తిగా శ్వాస పీల్చాను. ట్రక్ దగ్గరకు నడిచి ముందుకు పోనిచ్చాను. పావుగంట సమయం గడిచింది. దూరంగా ఇసుక ఆకాశంలోకి లేచి గిర్రున తిరుగుతూ మా వైపు ఎగురుతూ వస్తోంది.

"మైగాడ్ ఇసుక తుఫాన్ (సైమూమ్)" అంటూ అరిచాడు మౌగ్లీ.

థార్ ఎడార్‌లో ఏర్పడే ఇసుక తుఫానులకు సైమూమ్ లని పేరు. అవి చాలా ప్రమాదకరమైనవి. దీనిచేత కప్పబడి నది ఏదయినా జీవసమాధి అయిపోతుంది. తిరిగి వాటి అవశేషాలు బయటపడాలంటే ఇంకోసారి అక్కడ సైమూమ్ అనబడే ఇసుక తుఫాన్ ఏర్పడి పేర్చుకొనిపోయిన ఇసుకంతా తరిగిపోవాలి. ఈ విషయాలన్నీ నాకు మొదట్లో చెప్పారు డాక్టరుగారు.

యాక్సిలేటర్ అడుగంటా నొక్కేసాను. మీటర్‌లో ముల్లు నైంటీని తాకుతోంది. ఎక్కుపెట్టి విడిచిన బాణంలా దూకింది ట్రక్కు. ఇసుకలో చక్రాలు జారిపోతుంటే ఏ క్షణంలోనైనా బాలన్స్ తప్పి పడిపోయేలాగుంది.

కాని తప్పదు. ఏ గడియలోనైనా సైమూమ్ మమ్మల్ని కప్పేయవచ్చు. వీలయినంత త్వరలో ఆ ప్రదేశాన్నుంచి

పారిపోవాలి. అందుకే అంత స్పీడ్‌లో పోనిచ్చాను ఎటు పోతున్నామో తెలీటం లేదు.

ఎటుపోయినా పరవాలేదు. ముందు అక్కడినుంచి వెళ్ళి పోవాలి దూరంగా అనే ఉద్దేశ్యంతో స్టీరింగ్ వీల్ ఇష్ట మొచ్చినట్లు త్రిప్పేస్తున్నాను.

అకస్మాత్తుగా గాలి మరోవైపు వీచింది. మావైపునుంచి మరో వైపు దూసుకొని పోయింది ఇసుక తుఫాను. చిన్నగా నిట్టూర్చాను. ఎక్కడా ఆపకుండా రెండు గంటల సేపు అదే వేగంతో పయనించాక ఒకచోట ఆపి బయ టకు దిగాను.

ఎక్కడున్నామో అర్థం కాలేదు నాకు.

7

దూరంగా ఏవో పర్వతశ్రేణులు కన్పిస్తున్నాయి. ట్రక్కు వేగంగా వాటివైపు పయనిస్తోంది, రాను రాను గాలిలో గంధకపు వాసన ఎక్కువవుతోంది. అది ఎక్కడనుంచి వస్తోందో ఎందుకు వస్తోందో అర్థంకాలేదు మాకు.

గాలిలో వేడి అకస్మాత్తుగా పెరిగింది. అప్పటివరకూ లేని గాలి విసుర్లు ఎక్కువయ్యాయి. ట్రక్కులో కూర్చొన్నా వెచ్చని వడగాల్పులు తగులుతూ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

"మైగాడ్! ఈ వేడి భరించలేను" అరిచాను. నీళ్ళతో ముఖం కడుగుకొంటున్నా ఆగలేక పోతున్నాము. క్రమంగా శరీరాలు వేడెక్కుతున్నాయి.

పర్వతాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఏవో ప్రేలుతున్న శబ్దాలు విన్పిస్తున్నాయి, అవేం పర్వతాలో అర్థంకాలేదు

నాకు. 'కొంపదీసి అగ్ని పర్వతాలు కావు కదా' అను కొన్నాను.

ట్రక్కు జర్కు ఇచ్చి పెద్దగా కుదుపుతూ ఆగిపోయింది. ఏం జరిగిందో ఎందుకు పోతూ ఆగిపోయిందో తెలీలేదు. చటుక్కున గీర్ మార్చి ఆక్సిలేటర్ బలంగా నొక్కాను. చక్రాలు గిర్రున తిరిగాయి. కాని ట్రక్కు కదలలేదు.

"విజయ్!" పిల్చారు డాక్టరుగారు. "వాట్ సర్?" అడిగాను ట్రక్కును కదపటానికి ప్రయత్నిస్తూ.

"అటు చూడు!" అన్నారు.

అటు చూసాను. కొంచెం దూరంలో ఏవో శిలలు కన్పిస్తున్నాయి.

"ఏమిటవి? శిలలేనా?" అన్నాను.

"కాదు అబ్సిడియన్స్."

"అంటే?"

"శిలాధారాలు!"

"శిలాధారాలు? అంటే ఆ పర్వతాలు...."

"అవును....అవి అగ్నిపర్వతాలు!" అన్నారు గంభీరంగా.

"వాట్?" అరిచాను. "అదే నిజమైతే చాలా ప్రమాదం, బహుశా కాసేపట్లో ఆ అగ్ని పర్వతం ప్రేలవచ్చు. వాతావరణంచూస్తే అలాగే ఉంది."

"ఔను. ముందిక్కడినుంచి మనం తప్పించుకోవాలి. లేకపోతే అది ప్రేలగానే బయటకు చిమ్మేలావాలో కల్సిపోతాం...." అన్నారు.

"అల్ రైట్! ఈ ట్రక్ విషయం మొగ్లి చూసుకొంటాడు. నేను బయటకువెళ్ళి ఆ శిలాధారాలు కొన్ని పట్టు

కొస్తాను'' అంటూ స్టీరింగ్ వీల్ మొగ్గి కప్పగించి ప్రక్కకు జరిగాను.

తలుపు తెరచి బయటకు దిగబోతూ ఒక చావుకేక వేశాను. మెరుపులాగ నన్ను లోనికి లాగేశారు డాక్టరుగారు. ఐదు నిముషాలకుగాని తేరుకోలేదు.

"వాట్ బాయ్! ఏమిటి జరిగింది?'' కంగారుగా అడుగుతున్నారు డాక్టరుగారు.

"షాక్ కొట్టింది'' అన్నాను.

"షాకా?'' ఆశ్చర్యంగా అడిగారు.

"అవును. ఎలక్ట్రిక్ గాలి తరంగాలు వీస్తున్నాయి కాబోలు. దిగబోతుండగా షాక్ కొట్టింది'' అన్నాను. నా ముఖం నల్లబడిపోయింది.

"అయితే ఇప్పుడెలా?'' అడిగారు. "ట్రక్ కదలటంలేదు. ట్రక్కును వదిలి నడిచిపోదామంటే ఎలక్ట్రిసిటీతో కూడిన గాలులు వీస్తున్నాయి.''

"డాక్టర్ సాబ్'' పిల్చాను.

"ఏమిటి?'' అడిగారు.

"గాలి తరంగాలు ఎప్పుడూ వెంట వెంటనే వీయవని, ఒకదానికి ఇంకోదానికి మధ్య కొంచెం సమయం పడుతుందనీ విన్నాను. నిజమేనా?''

"అవును నిజమే!"

"అయితే ఆ మధ్య పట్టే సమయం నేను ఉపయోగించుకొంటాను'' అన్నాను.

"ఎలా?''

"సింపిల్! ఎలక్ట్రిక్ గాలి తరంగం వీచగానే నేను బయటకు దూకుతాను. ఇంకా తరంగం వీచేలోగా అందినన్ని

శిలాధారాలు పట్టుకొని వచ్చేస్తాను."

"ఇంతకీ అవి తీసుకొచ్చి ఏం ప్రయోజనం? ఈ ట్రక్కు ఇంకో పది నిముషాలలో కదలకపోతే మొత్తం అందరం శిలాధారాలుగా మారిపోతాము" అన్నారు డాక్టరుగారు నిస్పృహగా.

"ట్రక్ సంగతి తర్వాత చూడొచ్చు. ముందు వీటిసంగతి చూద్దాం. మాగ్లీ ఎలాగూ ప్రయత్నిస్తున్నాడుగా! ఏ క్షణాన్నైనా అతని ప్రయత్నం ఫలించవచ్చు" అంటూ ట్రక్కు తలుపు తెరిచాను.

ఓ నిముషం గడిచింది.

ప్రక్కనుంచి జుంయ్ మంటూ గాలి తరంగం దూసుకుపోయింది. అందులో ఎలక్ట్రిసిటీ ఉందో లేదో తెలీదు. మరుక్షణమే బయటకు ఉరికాను. కొంచెం దూరంలో ఉన్న శిలల గుట్టలను చేరుకొని అందినన్ని శిలలను అందుకొని తిరిగి ట్రక్కు వైపు పరుగెత్తాను. లోపలికి ఎక్కుతుండగా మళ్ళీ వీచింది గాలి. ఈసారి గాలిలో ఎలక్ట్రిసిటీ ఉందని నాకు తెల్సింది. ఎలాగంటే ఎలక్ట్రిసిటీ వలన లోపలికి ఎక్కి తలుపు లాగుతున్న నా చేతి మీదుగా వీచిన గాలి మళ్ళీ షాక్ కొట్టింది.

మాగ్లీని తప్పుకోమని డ్రైవింగ్ సీట్లో కూర్చొన్నాను. మనస్ఫూర్తిగా దేముని ప్రార్థించాను, ఈ చివరి ప్రయత్నాన్నా ఫలించేటట్లు చేయమని.

అగ్నిపర్వతం ప్రేలుతోంది. పిడుగులు పడుతున్నంత శబ్దాలవుతున్నాయి. శిఖరంపైరాళ్ళు ఎగిరి చుట్టూ పడుతున్నాయి.

గాలిలోని విద్యుత్ పవర్ మరింత పెరిగి శరీరం కాలుస్తు

న్నంత బాధ పుడుతోంది. శరీరం మీద వెంట్రుకలు, తల వెంట్రుకలు ఎలక్ట్రిసిటీ లోని మాగ్నెట్ పవర్‌కు లేచి నిల బడుతున్నాయి. శరీరాలనుంచి చమటలు కారుతున్నాయి.

ఇంజన్ వైపు ఒకసారి చూసి, క్లచ్ నొక్కి టాప్ గేర్ వేశాను. నా కాలూ, చెయ్యి వేగంగా పని చేశాయి. క్లచ్ వదులుతూ ఆక్సిలేటర్ అడుగంటా నొక్కేసాను. అప్పటికే చక్రాలు ఇసుకను దొలిచెయ్యటం వలన వాటి చోట్లలో చిన్న గోతులు ఏర్పడి ఉండటంవలన చక్రాలు విపరీతమైన వేగంతో గిర్రున తిరిగాయి. అదే సమయంలో షడన్ బ్రేకు వేశాను.

ట్రక్కు విసురుగా గాలిలోకి లేచి ఎగిరి కొంచెం దూరంలో పడింది. మరుక్షణం ఇసుకలో ముందుకు ఉరికింది. నా చేతిలోని స్టీరింగ్‌వీల్ గిరగిరా తిరుగుతోంటే గాలిలోని అయస్కాంత శక్తిని అధిగమించి ఆ పర్వతాలకు దూరంగా సాగిపోయింది. వెనుకగా అగ్నిపర్వతం బ్రద్దలవ్వడం కన్పిస్తోంది. చిన్నగా నిట్టూర్చాను.

వేగంగా దూసుకు వెళ్తున్న వెహికల్‌కు షడన్ బ్రేకు వేస్తే ఆ వెహికల్ గాల్లోకి లేచి ముందుకు దూకుతుంది. ఆ పనే చేసాను. దేముని దయ మా మీద ఉండటం వలన ఫలించింది.

రెండు రోజులు ఏకధాటిగా ప్రయాణించాక దూరంగా ఏవో రాళ్ళ గుట్టల్లాంటి కొండలు కన్పించాయి. కంపాస్ తీసి చూడగానే నా ముఖం ఆనందంతో ప్రఫుల్లమైంది.

"ఈ కొండ చెరియలు ఇండియన్ డెజర్ట్ సరిహద్దులు. అవి దాటితే థార్‌ను దాటినట్లే. అవతలివైపే సట్లేజ్ నది" అరిచాను సంతోషంగా.

★

ఈ నెల జోక్స్

—గుంటూరి సుబ్బరాజు

హోటల్ ప్రొప్రయిటర్స్‌తో కష్టమర్:- నిన్న హోటల్లో పార్సెల్ చేయించుకొని వెళ్ళిన ఫ్రైడ్ ఫిష్ బాగా కాలిపోయి తినటానికి అసహ్యంగా తయారయ్యింది.

హో. ప్రొ:- ఈ విషయం చాలా ఆశ్చర్యంగా వుంది సార్! ఇటువంటి కంప్లైంట్స్ మాకు ఇదివరకు ఎప్పుడూ రాలేదు. మేము మీరు పుట్టక ముందునుండీ చేపలను వేయిస్తున్నాము.

కష్టమర్:- కావచ్చును కాని వాటిని సప్లై చెయ్యటం ఇప్పుడా?

* * *

పెళ్ళి జరిగిన వెంటనే మావగారు కోడలిని ప్రక్కకి పిలిచి ఇలా అంటున్నాడు:

"సుజాతా! నీవు నా కొడుకు రఘుని పెళ్ళి చేసుకొని చాలా అదృష్టవంతురాలవయ్యావు. ఎందుకంటే వాడి తల్లి చనిపోయే ముందు కోరిన కోరిక ప్రకారం వాడి భార్య పేర 10 లక్షల రూపాయలు వ్రాసాను. నా అనంతరం ఆ రొఖ్ఖం నీకు అందుతుంది."

"అంటే, మీరు చచ్చేదాకా ఆ రొఖ్ఖం నా చేతికి రాదన్న మాట! ప్చ్!" నిట్టూర్చిందా కోడలుపిల్ల.

* * *

తండ్రితో కూతురు:-డాడీ, నువ్వు సతీష్‌ని ఎరుగుదువా! అతను నేనూ ప్రేమించుకొన్నాము. నేను తల్లిని కాబో తున్నాను కూడ.

తండ్రి అదిరిపడి, "ఎవడా సతీష్? వాడ్ని ముక్కలు క్రింద నరికేస్తాను. ఎక్కడ వాడు?" అంటూ కోపంగా సతీష్ ఇంటికి వెళ్ళాడు.

సతీష్:- (తాపీగా) తొందర పడకండి. నేను తప్పించు కోవాలనుకోవటం లేదు. ఈ విషయంలో న్యాయం చెయ్య దల్చుకున్నాను. మీ కూతురికి మొగబిడ్డ కల్గితే 40 వేలు ఆడ బిడ్డ కల్గితే 50 వేలు ఇవ్వాలనుకుంటున్నాను.

తండ్రి:- (కొంచెంసేపు నిశ్శబ్దం) ఒకవేళ మృత శిశువు కల్గితే. నీవు తప్పక ఇంకో చాన్స్ ఇస్తానని మాటి వ్వాలి ఏమంటావ్?

* * *

సత్తిబాబు హోటల్లో తాపీగా భోజనం ముగించాడు. సర్వర్ వచ్చి బిల్లు అందించాడు.

సత్తిబాబు జేబులు తడుముకొని "అరెరె! పర్సు మరిచి పొయ్యానే? సరే బిల్లు రేపిచ్చేస్తాను లేవయ్యా!"

"అలాగే సర్. కాని మీ పేరు చెప్పండి. ఇక్కడ గోడ

మీద వ్రాస్తాను గుర్తుకోసం?''

సత్తిబాబు (ఖంగారుగా):- అలా చేస్తే నా పేరు అందరి నోళ్ళలోనూ పడుతుంది. వద్దయ్యా!

సర్వరు:- ఫర్వాలేదు. ఎవరికీ తెలియదు సార్! ఎందుకంటే మేము మీ చొక్కా కూడా విప్పించి మీ పేరు వ్రాసిన చోట తగిలిస్తాం కదా!

* * *

ఒక లాయరు, తన క్లయింట్ జడ్జీగారికి ఒక కేసుడు విస్కీ బాటిల్స్ పంపాడని తెల్సుకొని ఖంగారు పడుతూ ''ఏం పని చేసావయ్యా. జడ్జీగారు రేపు జడ్జిమెంట్ చదవబోతున్నారు కదా! ఆయన అసలే అవినీతిని సహించడు ఇక నీ కేసు గోవిందా!''

క్లయింట్:- ఖంగారు పడకండి ప్లీడరుగారూ. నేను విస్కీ బాటిల్సు నా ప్రతి కక్షిపేరు మీదుగా పంపాను. అది కూడ బాగా తక్కువ రకానిదీ, మరియూ ఓల్డు స్టాకూను.

* * *

హాస్పిటల్లో ఒకావిడ ప్రసవించింది. ఆవిడ డాక్టర్ని పిల్చి. తన లాయర్ని పిలిపించమంది.

"ఏమిటి మేడమ్? మావల్ల ఏదైనా పొరబాటు జరిగిందా?" అన్నాడు డాక్టర్ కంగారుపడుతూ.

"లేదండి హాస్పిటల్‌లో ఏమీ పొరపాటులేదు. నేను నా భర్తకు విడాకులు ఇద్దామనుకుంటున్నాను."

డాక్టర్ అదిరిపడి "ఏమిటి మేడమ్ మీరనేది. మీరు సుఖంగా ప్రసవించిన ఈ శుభ సమయంలో విడాకులిస్తారా? అసలు ఏమి కారణం?"

"ఈ అనాకారి బిడ్డను చూపినప్పటినుండి నాకు వళ్ళు మండిపోతుంది. ఇదంతా ఆ చవటవల్లనే. వెంటనే, లాయర్ని పిలిపించండి" అందా మహాఇల్లాలు.

* * *

డాక్టర్‌తో ఒకావిడ:- అదేమిటి డాక్టరుగారూ! మా అబ్బాయికి చిడుం నయం జేసినందుకు ఏకంగా 50 రూ॥లు బిల్లు వేసారు?

డాక్టరు:- అలా అంటారేవిటమ్మా. ఈ కేసుకోసం రోజూ వరుసగా నేను 30 రోజులు రావల్సివచ్చింది మీ ఇంటికి.

ఆవిడ:- అవుననుకోండి. నేను కాదనటంలేదు కాని వాడు ఈ జబ్బును బడిలో ఎంతో మందికి అంటించి మీకు మంచి లాభం కలుగజేసాడు కదా! మీరు ఆ విషయం మరువకండి మరి?

* * *

బోనులో నిలుచున్న కుర్రాడు లాయరు అడిగిన అన్ని ప్రశ్నలకు తడుముకోకుండా జవాబులు అనర్గళంగా చెప్పటం విన్న ప్రతిపక్ష లాయరుకు ఆ కుర్రాడికి సమాధానాలన్నీ ముందే నూరిపోసారేమోనని అనుమానం వచ్చి ఆ విషయమై తెల్సుకోమని జడ్జీగార్ని కోరాడు.

జడ్జి కుర్రాడితో:- అబ్బాయి. నీకు సమాధానాలన్నీ ఎవరన్నా చెప్పియున్నారా?

కుర్రవాడు:- అవున్ సర్!

జడ్జి:- ఎవరు చెప్పారు?

కుర్రవాడు:- మా తండ్రిగారు సర్.

జడ్జి:- ఏమని చెప్పారు?

కుర్రవాడు:- కోర్టులో లాయర్లు అవకతవక ప్రశ్నలన్నీ వేస్తారు. కాని నీవు భయపడక నిజాన్ని మాత్రమే నిస్సం దేహంగా చెప్పు. అని చెప్పారు సార్!

అంతే! ప్రతిపక్ష లాయరు తెల్లమొహం వేసాడు.

*   *   *

ఒక దోషిని ఎలక్ట్రిక్ చైర్‌మీద కూర్చోబెట్టి శిక్ష అమలు చెయ్యబోయే టైములో అతను స్పెషల్ పర్మిషన్‌మీద తన లాయర్‌తో మాట్లాడడానికి అనుమతి పొందాడు.

"వీళ్ళు నన్ను ఎలక్ట్రిక్ చైర్‌మీద కూర్చోమంటు న్నారు. మీరు నా లాయర్ గనుక ఏమైనా సలహా చెప్పండి!"

లాయర్ ఒక్కక్షణం ఆలోచించి. "మీరు మాత్రం కూర్చోకండి. వాళ్ళు కూర్చో బెట్టేంతవరకూ" అన్నాడు. ★

హమేషా హంగామా

ఆడ జేబు దొంగ

రచన: జి. మోహన్

నేను విజయవాడ లక్ష్మి టాకీస్ సెంటర్లో సిటీ బస్ ఎక్కాను. బస్ చాల రష్‌గావుంది. నా వెనుక ఒక అమ్మాయి నుంచొని వుంది. బస్ బయలుదేరింది. బస్ 'స్లో' చేసినప్పుడల్లా ఆ అమ్మాయి అవయవాలన్నీ నాకు తగుల్తున్నాయి.

కాజువల్‌గా వెనక్కి తిరిగి చూచాను.

కాలేజి స్టూడెంటులా వుంది. అందగత్తెల్లో జమెయ్యొచ్చు. రోజ్ కలర్ ఫారెన్ నైలక్స్ ఎటాచ్‌డు బోర్డర్ సారీ కట్టింది. అదే రంగు లోనెక్ జాకెటు వేసింది. జా బోన్ క్రిందుగా పెసర బద్దంత పుట్టుమచ్చ వుంది.

నేను వెనక్కు చూడగానే మొఖం ప్రక్కకు తిప్పింది. నేను దిగే బస్‌స్టాప్ వచ్చేలోగా మూడు నాలుగుసార్లు నామీద పడిపోయినంత పనిచేసింది.

లీలా మహల్ సెంటర్లో నేను బస్ దిగాను. యథాలాపంగా జేబులో చెయ్యి పెట్టాను. అంతే నా గుండెలు గుభిల్లుమన్నాయి. నా పర్సు పోయింది!

కండక్టరు టికెటు కొట్టాక చిల్లర పర్సులో వేసికొని జేబులో పెట్టాను. నాముందు ఎవరూ లేదు. నా అనుమానం ఆ అమ్మాయిమీదకు పోయింది.

చూడడానికి చాల క్లాస్‌గా వుంది. ఆ అమ్మాయి అలాటి పని చేస్తుందా అని కొంచెంసేపు అనిపించింది.

ఆ అమ్మాయి కాబోతే ఆ పర్సు కాజెయ్యటానికి ఇంకె వరికి ఆస్కారం లేదు. నా పర్సులో అంతా కల్సి సుమారు 40 రూపాయలుదాక వున్నాయి. చేసేదేం లేక గప్ చుప్‌గా వూరుకొన్నాను.

* * *

రెండవరోజు అదే బస్ స్టాపులో బస్‌కోసం వెయిటు చేస్తున్నాను. సందేహంలేదు. ఆ అమ్మాయే సినిమా హాలు గోడమీద పోష్టర్లు చూస్తూంది.

చేతిలో రెండు పుస్తకాలు పట్టుకుంది. బ్లూ సారీ మేచింగ్ జాకెటు వేసింది. కళ్ళకు గాగుల్స్ వున్నాయి.

నో డౌట్ అదే అమ్మాయి.

జా బోన్ క్రింద పుట్టుమచ్చకూడ వుంది.

అది కాలేజీస్‌కి ఆఫీసులకి వెళ్లే టైము. బస్‌స్టాప్ చాల రద్దీగా వుంది.

బస్ రాగానే నేను ఎక్కి సీటులో కూర్చున్నాను. సీట్సన్నీ ఫిలప్ అయ్యాక ఆ అమ్మాయి ఎక్కి మగవాళ్ళ వెనుగ్గా నుంచుంది. బస్ బయలుదేరింది!

ఆ అమ్మాయి అటూ యిటూ చూచి ముందు నుంచున్న అబ్బాయి పాంటు జేబులోకి చెయ్యిపెట్టి అతిచాకచక్యంగా పర్సులాగి జాకెటులో వేసింది.

సూపర్ బజారు దగ్గర ఆ అబ్బాయి దిగిపోయాడు. పాపం నాలాగే పర్సు పోగొట్టుకున్న దౌర్భాగ్యుడు.

తర్వాత ఆ అమ్మాయి ముందు ఒక 40 సంవత్సరాల సేటు నుంచున్నాడు. మాట మాటకి కోటు జేబుపై చెయ్యి

పెట్టి వత్తి చూచుకుంటున్నాడు. బహుశా పర్సు చాల బరువుగా వుండి వుంటుంది.

బస్ 'ఆర్. టి. సి.' బస్ స్టాండు దగ్గర ఆగేటప్పటికి జనం రద్దీ ఎక్కువైంది. ఆ త్రోపుడికి సేటు పడబోయి పైనున్న రాడ్ పట్టుకున్నాడు.

ఆ అమ్మాయి అతని జేబులో చెయ్యి పెట్టింది. అంతే. సేట్ గభాల్న చెయ్యి పట్టుకున్నాడు.

ఆ అమ్మాయి లాగి చెంపమీద కొట్టి "చెయ్యిపుచ్చుకు గిల్లుతున్నాడు" అని నానాఅల్లరి చేసింది.

పాపం అంతా సేటుని తన్నడానికి తయారయ్యారు. సేట్ చేసేదిలేక సిగ్గుతో ముఖం వంచుకున్నాడు.

ఆ అమ్మాయి సాహసానికి నేను ఆశ్చర్యపోయాను. మామూలుగా అయితే ఆ అమ్మాయిని ఎవరూ పట్టలేరు. బహుశా పట్టుకున్నా అభాసు పాలవుతారు. అంతే వెంటనే నాకో ఆలోచన వచ్చింది. మర్నాడు ఆ అమ్మాయి కనబడితే పట్టడానికి బ్రహ్మాండమైన ప్లాన్ తయారుచేసి నా బుఱ్ఱలో వుంచాను.

* * *

నా ప్లాన్ ప్రకారం మర్నాడు అదే బస్ స్టాపుకొచ్చాను. రెండు మూడు బస్‌లు వచ్చి వెళ్ళిపోయాయి. కాని ఆ అమ్మాయి ఎక్కడా కన్పించలేదు ... టైమ్ పావు తక్కువ పదైంది. ఆ అమ్మాయికోసం నేను చుట్టూ కనిపించినంత దూరం చూస్తున్నాను.

అదే అమ్మాయి 'అప్సరా' టాకీస్ సందులోనించి నెమ్మదిగా నడిచి వస్తూంది. నా కళ్ళల్లో ఆనందం వెల్లివిరిసింది. నా ప్లాన్ ప్రకారం ఆ అమ్మాయి బుట్టలో పడాలి.

నా జేబులు వకసారి తడిమి చూచుకున్నాను. పర్సు

జాగర్తగా వుంది. 3 నెం. బస్ వచ్చి ఆగింది. నేను ఒక ప్రక్కగా నుంచున్నాను. అంతా ఎక్కాక ఆ అమ్మాయి ముందుకువచ్చి బస్ ఎక్కాను. బస్ బయలుదేరబోతుండగా ఆ అమ్మాయి ఎక్కింది.

సరిగ్గా మొదటిరోజులాగే నా వెనుగ్గా వుంది.

ఆ అమ్మాయి ఎత్తు పల్లాలన్నీ నాకు తగుల్తున్నాయి. నెమ్మదిగా నా జేబులోకి చెయ్యిపెట్టి పర్సు లాగింది. వెంటనే జాకెట్ లోకి వెళ్ళిపోయుంటుంది.

నా ఆనందానికి అంతులేదు. నా ప్లాన్ సక్సెస్. నేను వెనక్కి తిరిగాను. ఆ అమ్మాయి ఇబ్బందిగా అటు ఇటు కదిలింది.

నేను పర్సుకు రాసిన "దురదగుంటాకు" పనిచెయ్యడం మొదలుపెట్టింది. ఆ అమ్మాయి మొఖంలో రంగులు మారాయి. ఇబ్బందిగా ఛాతీమీద గోక్కుంటూ అటూ ఇటూ చూస్తూంది.

ఆ అమ్మాయి బాధ చూస్తుంటే నాకు వచ్చే నవ్వొస్తూంది. వెంటనే కండక్టరుకి నా పర్సు పోయిందని రిపోర్టుచేసా. కండక్టరు బస్ ఆపించి ఎవరూ దిగకుండా రెండు డోర్సుకి ఇద్దరు మనుషుల్ని కాపలా వుంచాడు.

వెనుకనే సివిల్ డ్రస్‌లోవున్న నా ఫ్రెండ్ పోలీసు ఇనస్పెక్టరుకి సైగచేసా.

అతనువచ్చి ఆ అమ్మాయి జాకెట్‌లోని పర్సును బయటకు రప్పించాడు. పాపం ఆ ఆడ జేబుదొంగకు దురద లెక్కువయ్యాయి.

ఆ అమ్మాయి పడే ఇబ్బంది చూచి బస్‌లో జనం పగలబడి నవ్వారు. అవమానంతో తల దించుకుని ఇనస్పెక్టరు వెంట బయటికి నడిచింది.

★

శనిగ్రహం?

రచన : మర్రి సూర్యనారాయణ

శనేశ్వరరావు గొప్ప డిటెక్టివ్ నవలా రచయిత. ఎన్నో కథలు వ్రాశాడు. అంతకు మించిన నవలలు రచించాడు.

మామూలుగా కొందరు రచయితల రచనలకు విశ్వాసం వుండదు. కానీ శనేశ్వరరావు రచించిన రచనలన్నీ విశ్వాసం గలవి. అందుకే అతడి రచనలన్నీ అన్ని పత్రికల కార్యాలయాలనూ దర్శించి మళ్ళీ భద్రంగా అతడి దగ్గరికే వచ్చి చేరేయి.

అతడెన్నో డిటెక్టివ్ నవల్సు చదివాడు. 'నిరాశ' అనేది రచయితలకు వుండకూడదనే విషయాన్ని బాగా జీర్ణించుకున్నాడు. అందుచేతే ఎన్ని పత్రికలు అతడి రచనలను తిరగ్గొట్టినా పట్టువదలని విక్రమార్కునిలా రచనలు సాగిస్తూనే వున్నాడు. ఇప్పటివరకూ ఒక్క కథ కూడా అచ్చవలేదు.

ఒకనాడు శనేశ్వరరావు ఇంట్లో అతడు, అతని శిష్యుడు కూర్చుని వున్నారు.

"ఇక లాభంలేదు గురూ. నీకు నీ రచనలకు శనిగ్రహం పట్టుకుంది. శుభ్రంగా ఈ కథలు కాకరకాయలు వ్రాయటం మానేసి ఏదైనా వృత్తిచేసుకుంటే నయం" చిన్న సలహా పారేశాడు శిష్యుడు.

"నో, నో. అందుకు నే నొప్పుకోను. ఈనాడు రోజుకు నాలుగు నవల్లు వ్రాసే వారందరూ ఎలా వృద్ధిలోకి వచ్చారనుకున్నావ్. రచయితలకు ఓపిక అవసరం" టేబుల్పై కాళ్ళు బారచాపుతూ అన్నాడు శనేశ్వరరావు.

"అవుననుకో, కాని ఇలా ఎంత కాలం?"

"ఎంతోకాలం అక్కరలేదు. వచ్చేసింది. దగ్గరకు వచ్చే

పింది. త్వరలోనే మన అఖండ ప్రతిభ ఈ ప్రజలంతా గుర్తిస్తారు. శనేశ్వర్రావు కీర్తి చంద్రలోకం దాకా ప్రాకి పోతుంది. అప్పుడు చూడు మరి మన తడాఖా'' జబ్బలు చరచుకొంటూ దర్పంగా అన్నాడు.

''నీతో వాదించలేను కానీ కాపిని టీ నీళ్లు త్రాగొస్తాను. పది పైసలుంటే నా మొహానపడెయ్యి'' అంటూ లేవ బోయాడు శిష్యుడు.

'ధడధడ' మంటూ బయట తలుపు చప్పుడైంది.

డిటెక్టివ్ రచయిత చెవులు రిక్కించాడు. క్షణం తర్వాత అతని ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

''ఒరే శిష్యా! అదుగో చూశావా అదృష్టం మనల్ని వెతుక్కుంటూ వచ్చింది. నా నవలల్ని కొనెయ్యడానికి ఏ పినీ నిర్మాతో, పత్రికా ఎడిటరో వచ్చివుంటాడు. నా మాట అక్షరాలా జరిగి తీరుతుంది. ఊ. ఇంకా అలా మొఖం వేళ్ళాడేసుకు చూస్తావేం వెళ్లు. తియ్యి తలుపు'' అంటూ శిష్యుడికి ఆర్డరు జారీచేసి టేబుల్‌పై నున్న ఫైలుని తీసుకొని గబగబా పేజీలు త్రిప్పేపి బరబరా ఏదో బరికెయ్య సాగాడు సీరియస్‌గా.

శిష్యుడు తలుపు తోయగానే ఒక ఆజానుబాహుడు లోపలికి వచ్చాడు. శనేశ్వర్రావు గబగబా అతన్ని పరిశీలించసాగాడు.

ఆరడుగుల పొడవు బుర్రమీసాలు ఖరీదైన పంచెపై తెల్లని లాల్చీ. దానిపై కండువా వ్రేళ్ళకు 4 వుంగరాలు.

అవును. నే ననుకున్నట్టు ఈయన ఫిలిం ప్రొడ్యూసరే. అనుమానం లేదు. తస్సదియ్యా ఇప్పటికి నన్ను గుర్తించా రన్నమాట. సంతోషంతో తలమునకలవుతూ ఆ వ్యక్తికి ఎదురుగావున్న కుర్చీ చూపించాడు.

''డిటెక్టివ్ రచయిత శనేశ్వర్రావంటే మీరేకదూ!''

ఆ వచ్చిన వ్యక్తి కూర్చుంటూ అడిగాడు.

"ఆ....ఆ....నేనే....కాని....నా రచనలన్నీ నిర్మాతలు కొనేశారు. నాదగ్గర నవల్లేమీలేవు. ఇప్పుడే ఓ బ్రహ్మాండ మైన నవల వ్రాస్తున్నాను" డంబాలు కొట్టేస్తూ శిష్యుడివైపు చూపి 2 కాఫీలు పట్రమ్మన్నాడు. కాఫీలయ్యాక తాఫీగా అడిగాడు శనేశ్వర్ —

"ఇంతకూ మీరు వచ్చినపని...."

మధ్యలోనే అందుకున్నాడా వ్యక్తి. "మీరు నవలలు, కథలు బాగా వ్రాస్తారని తెలుసు. కాని మీ రచనలకు న్యాయం కలగడంలేదని తెలిసింది. అందుకే మీ రచనలకు న్యాయం కలుగజేద్దామని వచ్చాను."

"అలాగా ...ఇంతకీ తమ రెవరో చెప్పనేలేదు" బుర్ర గోక్కుంటూ అడిగాడు శనేశ్వర్రావ్.

"నేను...."

"ఆ....మీరు ఫిలిం ప్రొడ్యూసరు అయివుంటారు. నేను ముందే వూహించాను లెండి." ఆ వ్యక్తి చెప్పకుండానే అందుకున్నాడు శనేశ్వర్రావ్.

"ఫిలిం ప్రొడ్యూసరా? కాదు" అన్నాడా వ్యక్తి.

తెల్లబోయాడు శనేశ్వరరావు.

"అయితే మీరు పత్రికా సంపాదకులా?"

"కాదు, కాదు."

ఈసారి మరీ ఆశ్చర్యపోయాడు మన రచయిత.

"అయితే మీరు కవి పోషకులా?" అనుమానంగా చూస్తూ అడిగాడు.

"కాదయ్యా బాబూ, నీ రచనలు ఎలా అమ్ముతావో చెప్పు. త్వరగాపోవాలి. నా కవతల బోలెడుపనులున్నాయి" విసుక్కుంటూ కండువాతో ముఖం తుడుచుకుంటూ అన్నాడా

వ్యక్తి.

"పోనీలెండి మీ రెవరయితే నా కెందుకు. నా నవల్లు ఖరీదు చెబుతాను వినండి. ఒక్కొక్కటి పాతికవేలు" నిక్కచ్చిగా చెప్పాడు శనేశ్వర్రావ్.

"చంపావు పోవయ్యా. నీ కథలన్నీ తిరిగొస్తున్నాయి. పోనీలే నీ రచనలకు న్యాయం కలుగజేద్దామనివస్తే ఇద టయ్యా నీవు చెప్పేది. చాల్లే వస్తా" అంటూ విసురుగా లేవబోయాడు ఆ వ్యక్తి.

శనేశ్వర్రావుకి మతిపోయినట్టయింది. రాకరాక ఇన్నా ళ్ళకి తన నవల్సుకోసం ఎవరోవస్తే దొరికిందే తడవుగా తను ఎక్కువ ఖరీదు చెప్పేశాడు. దానితో ఆయనకు కోపం వచ్చినట్టుంది. లాభంలేదు. ఈ ఛాన్సుపోతే అదృష్టంపోయి నట్టే. కనీసం పదివేలకైనా ఇచ్చెయ్యాలి. గట్టిగా నిశ్చ యించుకున్నాడు శనేశ్వరం.

"సారీ సార్, మీకు కోపం తెప్పించాను. క్షమించండి. పోనీ ఎలా పుచ్చుకుంటారో చెప్పండి" ప్రాధేయపూర్వ కంగా అన్నాడు శనేశ్వర్.

"ఇదుగో శనేశ్వర్రావూ. నేను మాటంటే మాటే. ఇదుగో విను. కేజీ రెండ్రూపాయలు. అలాగయితే చెప్పు. ఇదుగో అడ్వాన్సు. ఆ కాగితాలన్నీ కట్టకట్టి మీ శిష్యుడి నెత్తిమీదపెట్టి మా వెంకటేశ్వరా కిరాణాషాపుకి పంపిం చెయ్యి" అంటూ అయిదురూపాయల నోటు బల్లపై విసిరి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడా వ్యక్తి.

శనేశ్వరం అప్పటికే స్పృహ తప్పిపోయాడు.

"నే చెప్పలేదు గురూ! నీకూ, నీ రచనలకూ శనిగ్రహం పట్టుకుంది. ఏంచేస్తాం" అంటూ కుర్చీలో జారగిలపడ్డాడు శిష్యుడు.

★

సప్లిమెంట్ పోటీ-6 [ఫలితాలు]

మార్చి '75 నెల "సప్లిమెంట్ పోటీ_6" కు సరియైన జవాబు:

33	35	34	32	31

పై విధంగా సరియైన జవాబు ఒకే ఒక్కరు వ్రాశారు. వారికి జూన్ '75 నెలనుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:—

శ్రీమతి కొల్లా అరుణ,
హోం. డె. నెం—61,
కేరాఫ్—కె. వి. ఎస్. అప్పారావ్, ఎమ్.ఇ.,
(రీడర్, ఆంధ్రా యూనివర్సిటీ)
21_35_10, బురుజు పేట,
విశాఖపట్టణం—530001.

ఏ.వీ. మోహన్రావ్

అతివ సాహసం

PALASA.

రోహిణి ఎండలు రోళ్లు పగల గొడుతున్నాయి. పగలు సంగతటుంచి రాత్రిళ్ళు కూడా కరెంటు వుండటంలేదు. గదుల్లో ఫాన్లు అలంకారాలుగా మిగిలాయి.

ఉనుకు తీద్దామని ప్రయత్నించింది కనకమ్మ. కానీ లాభం లేకపోయింది. ఆమెది కాస్త స్థూలకాయం. ముఖ్యమైన అవయవాలు అన్నీ కాస్త లావుగానే వుంటాయి. అలాగని వికారంగా వుండదు. ఆ లావు ఆమెకు నిండుతనాన్ని. అందాన్ని తెచ్చి పెట్టింది. మనిషి మంచి ఎరుపుగా, ఎత్తుగా వుంటుంది. వయస్సు నలభై దాటినా చూచేందుకు ముప్పయి సంవత్సరాలు ప్రౌఢలా వుంటుంది. ఆమె భర్త భక్తవత్సలం పెద్ద ఆఫీసరు. నెలకు పాతికరోజులు కాంపులు పోతూవుంటాడు. సంతానం మొత్తం ఒక్క కూతురే। పేరు కుముద. కాలేజీలో చదువుతూంది.

భక్తవత్సలంకు శాస్త్రీయ సంగీతమంటే ఇష్టం. పెళ్ళయిన కొత్తల్లో కనకమ్మకు సంగీతం చెప్పించాలని చూశాడు. సరయిన మాస్టారు దొరకక మానేసాడు. కనీసం కూతురు నన్నా మంచి విద్వాంసురాలిగా చేద్దామని కర్ణాటక సంగీతంలో ఆ జిల్లాలో ఘనాపాటిగా చెలామణీ అవుతున్న శ్రీనివాసరావును నియోగించాడు. నెలకు వంద రూపాయల జీతం, పండగలకు, పబ్బాలకు ఇంట్లోనే భోజనం మొదలైన అన్ని సౌకర్యాలు సమకూర్చాడు.

శ్రీనివాసరావు ఐదారు గొప్ప ఇళ్ళల్లో సంగీతం చెపుతాడు. ఆ వూళ్లో రాబడి బాగుండటంతో రాజకుమారుడిలా ఎప్పుడూ పట్టుబట్టల్లో వుంటాడు. వాసన నూనెలు పూస్తాడు. మనిషి మంచి స్ఫురద్రూపి కావడంతో అందరూ అతన్ని అందగాడనే అంటారు.

కనకమ్మ దిండు క్రింద దాచిన సెక్స్ మాగ్జయిన్ తీసి కాసేపు బొమ్మలు చూపింది. ఆ తర్వాత ఒక కథ చదువు దామని మొదలెట్టింది. రెండు పేరాలు చదివేసరికి వొళ్లు వేడిక్కింది. నరాలు తిమ్మిరెక్కాయి. భక్తవత్సలం వెంబడుంటే ఎంత బాగుండు ననుకుంది. ఆయన వెళ్ళింది ముందు రోజు మాత్రమే. రావటానికింకో వారంరోజులు పడుతుందని చెప్పివెళ్ళాడు.

వొంటిమీదున్న జాకెట్ చెమటకు తడిసి కసకస మని పించింది. విప్పి దూరంగా విసిరేసింది. పైటకొంగు క్రిందకు లాగి, ఆ పుస్తకంతోనే విసరుకోసాగింది.

మెట్లపైనుండి ఎవరో మనిషి పైకి వస్తున్న చెప్పుల శబ్దం వినిపించింది. ఎవరయివుంటారని ఆలోచించసాగింది. అంతలోనే శబ్దం బాగా దగ్గరయింది. తక్కున మంచంపై నుండి లేచి పైటకొంగు నిండా కప్పుకుని నిలుచుంది.

గుమ్మంలో శ్రీనివాసరావు ప్రత్యక్షమయినాడు.

"మీరా?" అడిగింది ఆశ్చర్యపోతూ.

"నేనేనమ్మా!" అంటూ వచ్చి స్టూలు పైన కూర్చు న్నాడు.

"ఏమిటిలా వచ్చారు?"

"కాస్త పైకంకావాలి. అర్జంటుగా ఇంటికి పంపాలి."

"వారు ఊళ్లో లేరే!" అంది.

"మీదగ్గర లేదా?" అడిగాడు శ్రీనివాసరావు నిరుత్సాహ పడిపోతూ.

"బ్యాంకులో వుంది. సాయంత్రం గాని తెచ్చేందుకు వీలులేదు."

"పోనీలెండి. రేపుదయం అమ్మాయికి పాఠం చెప్పేం దుకు వస్తాగా? అప్పుడు ఇవ్వండి." అన్నాడు.

"మీరు ఎనిమిదింటికి రాగలిగితే ఇస్తాను. రైల్వే స్టేషనులో పదింటిదాకా మనియార్డర్లు తీసుకుంటారుగా?" అంది అతన్ని అపాదమస్తకం పరిశీలనగా చూస్తూ.

"రేపయినా ఫరవాలేదమ్మా! అనవసరంగా నా గురించి శ్రమ పడకండి" అన్నాడు లేస్తూ.

"శ్రమేంలేదు. రాత్రికివచ్చి తీసుకెళ్ళండి. రేపుదయం నేను వేరే పనిమీద ఒక చోటకి వెళ్ళాలి." అంది కనకమ్మ మనస్సులోనే ఏదో ఆలోచించుకుని ఒక నిర్ణయానికొచ్చి.

"మీరు అంతఇదిగా చెప్తూంటే రావటానికి నాకుఇబ్బంది లేదు. ఎవరూ ఇంట్లో లేనప్పుడు ఎంత తెలిసినవాణ్ణయినా. మగవాణ్ణిగదా. రావడం అంత బాగుండదేమోనని అనుమానిస్తున్నాను. అంతే!" అన్నాడు శ్రీనివాసరావు.

"ఎవరో ఏదో అనుకుంటారని మన అవసరాలు ఆపుకుంటామా? ఆశలు చంపుకుంటామా? ఆనందాలు వదులుకుంటామా? మీరు రండి." అంది కనకమ్మ కళ్ళు నేలకేసిత్రిప్పి.

శ్రీనివాసరావుకు గుర్రమెక్కినట్లుంది. తన పాచిక పారినందుకు సంతోషమేసింది.

"అలాగే వస్తాను." అంటూ దిగి వెళ్ళిపోయాడు.

కనకమ్మ మాస్టార్ని కనుపించినంత దూరం కసిగా చూసింది. భక్తవత్సలంతో అతన్ని పోల్చి చూసింది. భర్త మీద ఇతనే ఎన్నో రెట్లు మెరుగనిపించాడు. తీరని దాహం, ఆరని కామం, తీర్చుకునేందుకు తను అనుసరించ దలచుకున్న మార్గం అత్యంత సుకరంగా తోచింది.

పని మనిషి రాగానే పనులన్నీ చకచక చేయించుకుని పంపించి వేసింది. కాలేజీనుండి కుముద వచ్చింది. డబ్బిచ్చి సినిమాకు పంపింది ఆమెను. తలకు స్నానం చేసి పట్టుచీర

కట్టుకుంది తలనిండా మల్లెపూలు తురుముకుంది. శ్రీనివాస రావు రాక కోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఎనిమిది కొట్టగానే వచ్చాడు శ్రీనివాసరావు. అతని కన్నా ముందు అతను పూసుకున్న సెంటు వాసనల్ని మోసు కొచ్చింది గాలి.

గుమ్మంలోనే ఎదురయిన కనకమ్మను చూసి "నా కోసం సిద్ధంగా వున్నట్లున్నారే." అన్నాడు.

"ఆఁ! రండి. డబ్బిస్తాను." అంటూ మేడ మెట్లు ఎక్కింది. ఆమె వెనుక శ్రీనివాసరావు ఎక్కాడు.

ఇద్దరు గదిలోకి చేరారు.

వంద రూపాయల కాగితం చేత్తో ముందుకు చాచింది అందుకోమని. అప్పుడే ఆమె పట్టుపైట, రొమ్ములపైని పట్టు తప్పించుకొని క్రిందకు జారిపోయింది. మాస్టారు, నోటును పట్టుకోకుండా చెయ్యిని పట్టుకుని, తనవేపు ఆమెను గుంజు కున్నాడు. ఆమె నోటిని తన నోటితో మూసేశాడు. గది తలుపులు మూసుకున్నాయి.

తొమ్మిదిన్నరకు ఆయాసంతో క్రిందకు దిగివెళ్ళిపోయాడు. మాస్టారు మత్తు వొదిలించుకున్న కనకమ్మ మగతగా కళ్లు ముసుకుని పడుకుంది మంచం మీదే.

సినిమానుంచివచ్చిన కుముద తిన్నగా బెడ్ రూంకొచ్చింది నిద్రపోతున్న తల్లిని చూచి విస్తుపోయింది. నాన్నగారు ఊళ్లోలేనప్పుడు అలంకరణను గురించి అంతగా పట్టించుకునే అలవాటులేని తల్లి, పనిగట్టుకొని పట్టుచీర కట్టుకోవడం మల్లెపూలు పెట్టుకోవడం, వింతగా తోచింది కుముదకు.

తల్లి, కూతుళ్ళు భోజనాలు ముగించి పడుకున్నారు. అర్ధరాత్రి దాకా ఏదోకటి చదువుతూ పడుకునే కనకమ్మకు ఆరోజు నిద్ర ముంచుకొచ్చింది. మంచంపైన శరీరం వాల్చ

గానే మత్తుగా నిద్ర పట్టేసింది.

కుముద కాసేపు కాలేజీ పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంది. మధ్య మధ్య తల్లికేసి చూడసాగింది.

ఆ తర్వాత నెలరోజులు మామూలుగా గడచిపోయాయి. శ్రీనివాసరావు ఉదయం పూట కుముదకు సంగీతం పాఠాలు, మధ్యాహ్నంలో కనకమ్మకు ప్రేమ పాఠాలు చెప్పుకుంటూ పోతూనేవున్నాడు. భక్తవత్సలం ఆ నెలరోజుల్లోనూ ఐదారు రోజులు మాత్రమే ఇంట్లోవున్నాడు క్యాంప్‌కు పోకుండా. భార్య నీరసంగా, బద్ధకంగా వుండడం గమనించాడు.

కనకమ్మను ఒంట్లో ఎలాగుందని అడిగాడు. ఆమె బాగానేవుందని చెప్పడంతో ఆ విషయం అంతటితో వదిలేశాడు భక్తవత్సలం. ఆ మరుసటి దినం రాత్రి మామూలుగా కాంప్‌కు వెళ్ళిపోయాడు.

మరుసటి దినం మధ్యాహ్నం శ్రీనివాసరావు యథాప్రకారం వచ్చాడు.

కనకమ్మ వెళ్ళి కాఫీ తీసుకొచ్చింది.

త్రాగి గ్లాసు కిటికీలో పెట్టాడు శ్రీనివాసరావు.

"మీ రింకా పదేపదే ఇక్కడకు రావద్దు!" అంది కనకమ్మ.

"ఏం? ఎందుకని?"

"మావారికి అనుమానంగా వుంది. ఆయన ఆవులిస్తే ప్రేవులు లెఖ పెట్టగల సమర్థుడు. మన రహస్యం తెలిసిందంటే ఏం చేస్తాడోనన్న భయంగావుంది.'' అంది కనకమ్మ.

"పెళ్లాం అవసరాలు తెలుసుకొని తీర్చలేని దద్దమ్మ రహస్యం తెలుసుకున్నా చేసేదేమీవుండదు. అతన్ని గురించి నువ్వు భయపడకు. అటువంటి పరిస్థితివస్తే మనిద్దరం ఎక్కడైన వెళ్ళిపోదాం!'' అన్నాడు శ్రీనివాసరావు.

"వెళ్ళిపోవటమూ? ఈ వయసులో, ఇన్నేళ్ళు కాపరం చేశాక వార్ని వదలిరావటానికి నేనేం బజారు రకాన్ననుకున్నావా?" కోపంగా అడిగింది కనకమ్మ.

"చాటుమాటుగా అవసరాలు తీర్చుకుంటే లేని తప్పు, ధైర్యంగా నాతో వస్తేమాత్రం వుంటుందా?" అడిగాడు శ్రీనివాసరావు.

"నోర్మూయ్యి. ఏదో పొరపాటుగా ఆవేశంలో కాలు జారినందుకు నన్ను నీ పుంపుడుగత్తెగా భావించి మాట్లాడకు. ఇకమీద నువ్వు అమ్మాయికి పాఠాలు చెప్పేందుకు తప్ప ఇక్కడకు రావడానికి వీలులేదు. జాగ్రత్త పిచ్చి పిచ్చి వేషాలు వేశావంటే తగినశాస్తి చేయిస్తాను." అంది కనకమ్మ.

శ్రీనివాసరావుకు కోపం ముంచు కొచ్చింది. తమాయించుకొన్నాడు. తగిన ప్రతీకారం చెయ్యాలనుకున్నాడు. అక్కడింక వుండి ప్రయోజనంలేదని లేచి మెట్లుదిగి క్రిందకు వెళ్ళిపోయాడు.

రెండ్రోజులకు భక్తవత్సలం కాంప్‌నుంచి వచ్చాడు.

భర్తతోచెప్పి కనకమ్మ పుట్టింటికి వెళ్ళొస్తానంది. ఆయన అనుమతించాడు. ఒంటరిగానే వెళ్ళిపోయింది.

శ్రీనివాసరావు ప్రొద్దున్నే కుముదకు పాఠాలు చెప్పడానికి ఉదయం వచ్చేవాడు. ఆ టయిమ్‌కు ఇంట్లో పనిమనిషి తప్ప మరెవ్వరూ వుండరు.

కనకమ్మ తలుపులు బడాయించాక అతని దృష్టి కుముదపై పడింది. ఆమె అప్పుడే వికసించిన పుష్పంలా తాజాగా, అందంగా, కనుపించేది అతని కన్నులకు. ఎలాగైనా ఆమెను అనుభవించాలన్న తపన పుట్టింది. అలా తను సాధించిన

ఘనకార్యం కనకమ్మకు తెలిసేటట్లు చేసి, అది సాకుగా, మళ్లా ఆమెను తన ప్రక్కలోకి లాక్కోవాలని ప్లాన్ వేశాడు.

పాఠాలుచెప్తు మధ్యమధ్య ప్రేమ వ్యవహారాలు, సెక్స్ కథలు, చెప్పడం మొదలెట్టాడు. కుముద అచేతనంగా కూచుని, ఏ విధమైన ఉత్సాహ నిరుత్సాహాలు చూపించ కుండా వినసాగింది.

సెక్సు నవల ఒకటితెచ్చి చదవమని ఇచ్చాడు. కుముద కాలేజిలో పుస్తకాలమధ్యపెట్టుకుని, పాఠాలు కూడా వదిలేసి చదివింది. ఆమెకు ఒళ్లు వేడెక్కిపోయింది. ఆ ఆవేశంలో మగాడు ఎవరయిన చొరవతీసుకుని, ఏంచేసినా అభ్యంతరం చెప్పకుండా లొంగిపోయే స్థితిలో వుంది.

తిన్నగా ఇంటికొచ్చింది. గంట మూడయింది. తలుపులు దగ్గరగా మూసివున్నాయి. త్రోసుకొని లోనికివెళ్ళింది. మెట్లు ముందు మాస్టార్ చెప్పులు కనుపించాయి. ఆ వేళప్పుడు అతను తన ఇంటి కెందుకొచ్చి వుంటాడని ఆలోచిస్తూ, చప్పుడు కాకుండా అడుగులో అడుగువేసుకుంటూ పైకి వెళ్ళింది.

తల్లి గదిలోంచి మాటలు వినవస్తున్నాయి. తలుపు వారగా నిలుచుని వినసాగింది. మాస్టారు గొంతు పెద్దదిచేసు కొని అరుస్తున్నాడు. కనకమ్మ మెల్లగానే అయినా కటువుగా సమాధానాలు చెపుతూంది. చెవులు రెక్కించి వినసాగింది.

"కనకమ్మా! ఏరుదాటాక తెప్ప కాల్చడం మంచిదిగాదు, అవసరం వున్నన్నరోజులూ నన్ను వాడుకున్నావ్. ఇప్పుడు దగ్గరకు రావద్దంటున్నావ్. ఇందుకు ప్రాయశ్చిత్తం చేస్తాను" అన్నాడు మాస్టారు.

"నీమొహం. మావారు రాగానే ఉద్యోగంలోంచి పీకించి

పారేస్తాను.'' అంది కనకమ్మ.

''ఈలోగా నీ కూతురు కుముదను అనుభవించక పోతే నాపేరు శ్రీనివాసరావుగాదు!'' అన్నాడు కోపంగా,

''దాని జోలికి వెళ్ళకు. పెళ్ళికావలసిన పిల్ల పసిది.''

''అయితే నాకు లొంగిపో. నాఅవసరాలు తీర్చు.''

''లాభం లేదు. తెలియక తప్పుజేశాను. ఇంక నా జోలికి రావద్దు. వెళ్ళిపో!''అంది కనకమ్మ.

కుముదకు జరిగిన సంగతి అర్ధమయింది. అక్కడ్నుంచి మెల్లిగా తప్పుకుంది. తన గదికి వెళ్ళిపోయింది. మాస్టారు మెట్లు దిగివెళ్ళడం కిటికీలోంచి చూసింది.

తల్లి మీద కోపం, అసహ్యం పుట్టాయి. తండ్రిని మోసం జేసినందుకు ఆమెను నిలువునా చంపినా పాపంలేదనిపించింది అంతలోనే ఆమె పడుతున్న ఆవేదన, తప్పుచేసినందుకు పడుతున్న పశ్చాత్తాపం గుర్తు తెచ్చుకొంది.

మాస్టారు తన్ను పాడుచేస్తానని శపథం పట్టాడు. విన్నాక నవ్వొచ్చింది. అతని మాటలు, ప్రవర్తన, సెక్సు పుస్తకాలు ఇవ్వడం, మొదలైన వాని వెనుకవున్న విషయమేంటో అవగత మయ్యాక తను ఏం చెయ్యవలసిందీ నిర్ణయించుకొంది.

మరుసటిదినం మధ్యాహ్నం కాలేజి వదిలాక, పుస్తకాలు తీసుకొని తిన్నగా, మాస్టారి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళింది.

ఫాన్ పెట్టుకుని, సెక్సు బొమ్మల పుస్తకం తదేకంగా చూస్తున్న శ్రీనివాసరావు లేచొచ్చి తలుపు తీసి ఎదురుగా కనుపించిన కుముదను చూశాడు. ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

''నువ్వా?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''ఆఁ! ఏం రాకూడదా!'' అడిగింది కుముద.

''ఇలా అర్ధంతరంగా వస్తారనుకోలేదు'' అన్నాడు.

"ఎప్పటికయినా రప్పించుకోవాలనేగా మీ ఉద్దేశ్యం. మీ మనసులో ఏముందో తెలుసుకున్నాక, ఆలస్యం చెయ్యడం అనవసర మనిపించింది. కాలం, వృధాచేసి సమస్యలు పెంచు కోవడం కన్నా వెంటనే కోరిక తీర్చుకోవడం మంచి దనిపించింది, వచ్చేశాను." అంటూ కూర్చుంది కుర్చీలో.

"చదువుకొన్న వాళ్ళు ఏదొచ్చిన ఆగరు" అన్నాడు లేస్తూ.

"చదువు రానివాళ్ళు ఆగుతారా?"

"వాళ్ళకు విషయాలు ఒక పట్టాన అర్ధంకావు." అంటూ ఆమె దగ్గరకంటా వెళ్లాడు.

"మాస్టారూ...." గోముగా తలపైకెత్తి చూపింది.

"ఏమిటి....?" అడిగాడు.

"దాహంగా వుంది, కాఫీలాంటి దేమయినా వుందా?"

"వుంది. ఇప్పుడే కలుపు కొస్తాను. నెస్‌కాఫీ" చెప్పి లోనికి వెళ్ళాడు.

కుముద హేండ్ బ్యాగ్‌లోంచి లావుపాటి వీణతీగతీసి చేత్తో పట్టుకుంది. ఆమెకు భయంగానూ, ఉద్రేకంగానూ వుంది. తండ్రిగారికి ముందు రోజు రాత్రి ఫోన్‌చేసి అర్జంటుగా రమ్మని చెప్పింది కాంప్‌నుంచి. రాగానేవచ్చి కాలేజీలో కలుసుకొమ్మంది. తను బయలుదేరిందాకా ఆయన రాలేదు. మాస్టారు గారింటికి రమ్మన్నాననీ, తను వెళ్తాన్నాననీ ఫ్రెండ్స్‌తో చెప్పి, వచ్చేసింది. వస్తూ వస్తూ పోలీస్ స్టేషనుకెళ్ళి కంప్లయింటు కూడా రాసి ఇచ్చింది.

ఎటువంటి పరిస్థితుల్లో నయినా, తన్ను తాను రక్షించు కోగలననే ధైర్యం ఆమెకు వుంది.

కాఫీ కప్పులు తెచ్చి టీపాయ్‌పైన పెట్టి కూర్చున్నాడు

మాస్టారు. కప్పు తీసుకుంది చేతికి కుముద.

"నువ్వు చాలా అందంగా వుంటావ్!" అన్నాడు మాస్టారు.

"అందరూ ఆ మాటే అంటారు."

"నిన్ను చూసింది మొదలు, మనస్సు ఆగేదిలేదు. ఇలాంటి అవకాశం వస్తుందని నే ననుకోలేదు. ఇంత సుల భంగా నువ్వు ఒప్పుకుంటావని ఊహించలేకపోయాను."

"నేను ఒప్పుకున్నానా? దేనికి?"

"నాకు ఆనందం అందివ్వడానికి."

"ఎవరన్నారు?"

"మరెందు కొచ్చావ్?"

"నీకు కాస్త బుద్ధిచెప్పి, గడ్డిపెట్టిపోదామని, వచ్చాను." అంది కుముద కాఫీ త్రాగుతూనే.

మాస్టారు ఆమాట వినగానే కప్పు క్రిందపెట్టేశాడు.

"ఇలా ఒంటరిగా నా యింటికొచ్చి బుద్ధిచెప్పిపోవాలను కోవడంలోనే నీ తెలివితేటలు అర్ధమవుతున్నాయి. మీ అమ్మలానే నీకూ కాస్త గర్వం వున్నట్లుంది. ఇక్కడ నిన్నేంచేసినా అడ్డొచ్చే వాడెవ్వరూ లేదు" అన్నాడు మాస్టారు.

"ఎవరో ఎందుకు? నన్ను నేను రక్షించుకోగలను." అంది కుముద ధైర్యంగా.

"ప్రయత్నించు" అంటూ ఆమెపై కురికాడు. పైట కొంగుపట్టుకున్నాడు. ఆమె పెనుగులాడింది. అతను వదల కుండా లాగాడు. అదికాస్తా ఊడిపోయింది. ఆమె రెండు చేతులూ రొమ్ముల కడ్డంగా పెట్టుకుంది. ఘట్టిగా అలాగే పొదవి పట్టుకుని మంచంపైకి త్రోశాడు. పైకురికాడు.

ఆమె వెల్లికింతలా మంచానికిబల్లిలా అంటుకుపోయి పడు కుంది.

ఆమెపైనుండిలేచి, చేతుల్తో పరికిణీకుచ్చెళ్లు పైకిత్తేం దుకు ప్రయత్నించాడు. కాలితో చాచి మొహంపైన తన్నింది. దూరంగాపడ్డాడు. అంతలోనే తమాయించుకొని పైకిలేచి మళ్ళీ కుముదపై కురికాడు.

తలుపులు తెరుచుకొని లోనికొచ్చాడు భక్తవత్సలం. అతని వెనుకనే పోలీసులు కూడా జొరపడ్డారు.

చేతికర్రతో బలంగా తలపైన మోదాడు మాస్టార్ని భక్త వత్సలం. దెబ్బకు దిమ్మ తిరిగింది అతనికి. క్రింద కూలి బడ్డాడు.

ఇన్‌స్పెక్టర్‌వెళ్ళి బేడీలు తగిలించాడు. మాటాపలుకూ లేకుండా స్పృహతప్పి పడివున్నాడు మాస్టారు. అతన్ని అలాగే మోసుకెళ్ళి వాన్ ఎక్కించారు.

భక్తవత్సలం కూతుర్ని దగ్గరకుతీసుకుని "ఏమిటమ్మా ఇదంతా" అడిగాడు.

"ఏం లేదు నాన్నా! ఇతను చాలామందిని పాఠాలు చెప్తూనే పాడుచేశాడు. నన్నూ ఇంటికి రమ్మని రోజూ అడుగుతూ వుండేవాడు. ఇంట్లో కూడా వెకిలివేషాలు వేసే వాడు. సరయిన బుద్ధి చెపుదామని ఇలా పథకం వేశాను. పోలీసులకు ముందే రిపోర్టిచ్చివచ్చాను." అంది కుముద.

ఇద్దరూ కార్లో ఇంటికొచ్చారు.

మాస్టారు ఎంత దుర్మార్గుడయిందీ చెప్పి, భర్త కుముద చేసిన సాహసం గురించి వివరిస్తుంటే కనకమ్మ మౌనంగా వింటూ నిలుచుండిపోయింది.

★

(బహుమతి రు. 50/- లు నగదు)

1

ఆనంద్ ఒక లేడిని షూట్ చేశాడు. అది ప్రమీల తోట వరకూ పరిగెత్తుకుంటూ వచ్చి, ఆ తోటలో ప్రాణాలు వదిలింది.

దాన్ని తీసుకోవటానికి ఆనంద్ తోటలో ప్రవేశించ బోగా అభ్యంతరం చెప్పింది ప్రమీల. కాని, ఆనంద్ వినక తోటలో ప్రవేశించి లేడిని తీసుకుని మరొక్క క్షణంకూడా అక్కడ వుండక వచ్చిన దోవనే వెళ్ళి పోయాడు.

ప్రమీల ఆనంద్ పై క్రిమినల్ ట్రెస్ పాస్ నేరం ఆరోపించింది.

తను వద్దంటున్నా వినక తన తోటలో ప్రవేశించాడని, ప్రమీల వాదించింది.

లేడి కోసమే తోటలో ప్రవేశించానని, అంతకుమించి

మరేం చేయలేదనీ అది నేరం కాదనీ వాదించాడు ఆనంద్.

న్యాయనిర్ణేతగా మీరేం చెప్తారు ?

2

నలుగురు బందిపోటులు జమీందారు భూపతి ఇంటికి తుపాకులు వేసుకుని వెళ్ళారు. భూపతి ఇంటిలో లేడు. ఆ నలుగురిలో విక్రమ్ అనే వ్యక్తి భూపతిని వెతకటానికి బయలుదేరాడు. ఇంతలో మిగతా ముగ్గురికి భూపతి కుటుంబ సభ్యులతో లడాయి పడింది. ముగ్గురూ కలిసి భూపతి కొడుకును చంపేశారు.

ఇంతలో పోలీసులు వచ్చారు. ఉభయ వర్గాలకు జరిగిన పోరాటంలో బందిపోట్లు గాయపడి పోలీసులకు చిక్కారు. అప్పుడే వచ్చిన విక్రమ్‌నుకూడా కస్టడీలోకి తీసుకుంది పోలీస్.

భూపతి కొడుకు హత్య కేసులో నలుగురినీ ముద్దాయిలుగా వ్యవహరిస్తూ, వారిపై కేసుపెట్టింది పోలీస్ డిపార్ట్‌మెంట్.

తను లేనప్పుడు జరిగిన హత్యకు తను బాధ్యత వహించనని విక్రమ్ వాదించాడు.

మరి మీరేమంటారు ?

3

ఆంధ్రా ఎజిటేషన్ సమయంలో కడపలో శాంతి పరిరక్షణ బాధ్యత మిలటరీకి అప్పగించారు.

ఒకరోజు ఆ కాంప్ వద్దకు కొందరు ప్రత్యేకాంధ్ర వాదులు వచ్చి నినాదాలు చేశారు. అంతే కాని మరేమీ అల్లర్లు చేయలేదు.

వారిని వెళ్ళిపొమ్మని లాన్స్ నాయక్ చెప్పాడు. కాని

వారు వినలేదు. ఫైర్ చేయమని ఆజ్ఞాపించాడు లాన్స్ నాయక్. వెంటనే జవాను జంబులింగం గుళ్ళవర్షం కురిపించాడు.

ఇద్దరు చనిపోగా మిగిలినవారు పారిపోయారు.

తరువాత ప్రభుత్వం కమిటీని నియమించింది. జవాను జంబులింగం ముద్దాయిగా నిలబెట్టబడ్డాడు. అతడిపై హత్యా నేరం ఆరోపించబడింది.

"నేను నాపై అధికారి ఆజ్ఞను పాలించాను. అది నా విధి. నేను నిర్దోషిని" అన్నాడు జంబులింగం.

మరి 'లా' ఏమంటుంది?

* * *

[పై మూడు కేసులకు మీరేమని తీర్పు ఇస్తారో, వివరంగా ఒక పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి. యీ నెల 20 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. సరియైన తీర్పు చెప్పిన హో౦. డె. పాఠకుల పేర్లు జులై '75 నెల సంచికలో ప్రకటిస్తూ. అత్యుత్తమ తీర్పు నిచ్చిన పాఠక న్యాయనిర్ణేతకు రు. 50/- లు నగదు బహుమతి పంపగలము. తుదినిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

మార్చి '75 నెల మీా తీర్పు?

(1) మదన్ మోహన్ ఫైన్ కట్టాలి.

శిక్ష విధించిన 6 సంవత్సరాల లోపుగాని, లేదా శిక్షా కాలం పూర్తయేలోపున గాని, జరిమానా విధించవచ్చునని ఐ. పి. సి. సెక్షన్ 70 తెల్పుతుంది. కావున మదన్ మోహన్ జరిమానా చెల్లించటమో, లేకుంటే మరో రెండేళ్ళు జైలు శిక్ష అనుభవించటమో చేయ్యాలి,

(2) కృష్ణప్రియ మీద కేసు నిలువదు.

ఇక్కడ శ్రీలత మంచి కోరి ఆమెను డిసిప్లిన్‌లో పెట్టాలని ఆమెను కృష్ణప్రియ శిక్ష విధించింది. అది నేరంకాదని ఐ. పి. సి. సెక్షన్ 88 చెప్తూతుంది.

(3) ఎవిడెన్స్‌గా అంగీకరించ బడదు।

ఇండియన్ ఎవిడెన్స్ ఆక్టు, సెక్షన్ 32 (1) ప్రకారం జగ్గూకు, ఇనస్పెక్టర్‌కు జరిగిన సంభాషణ ఎవిడెన్స్‌గా అంగీకరించబడదు.

—పై విధంగా అత్యుత్తమ తీర్పు విచ్చిన పాఠక న్యాయనిర్ణేత శ్రీ యం. శంకరరెడ్డి, హోం. డె. నెం. 94, కేరాఫ్ రమాదేవి ఎజెన్సీస్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జిల్లా, గారికి బహుమతి పైకం రు. 50 లు యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

సరియైన తీర్పు చెప్పిన యితర పాఠకులు.

1. జి. కె లైలా, రాజమండ్రి. 2. కళాలక్ష్మి, విజయనగర్ కాలనీ. 3. పి. ఎస్. ఆర్. మూర్తి, కాకినాడ. 4. కొల్లా అరుణ, విశాఖపట్టణం. 5 మద్రి సూర్యనారాయణ, పుల్లేటికుర్రు. 6. హవంతీ రఘువిమల్ ప్రసాద్, బోర్గాం. 7. బి. శౌరయ్య, మలక్ పేట. 8. డాక్టర్ ఎం. ధర్మదానం, హైద్రాబాదు. 9. పీసపాటి నవనీతం, కటక్. 10. వై. ఇ. ఆనందకుమార్, సికింద్రాబాదు. 11. బి. సరాశ్రీ, రుద్రంపూర్. 12. పి. ప్రభాకర్‌రావు, రామాజిపల్లి. 13. కోనే హరిబాబు, చంద్రాయణ గుట్ట. 14. జె. కృష్ణరావు, అశ్వారావుపేట. 15. హెచ్. వి. ఎస్. సుబ్రహ్మణ్యం, నౌళాల్లి,

★

నిజంగా దేవత

కె. రవీంద్రప్రసాద్

అది అరుణా నర్సింగ్ హోం. డాక్టరు సుశీలాదేవి అని బోర్డు ఉంటుంది. అది ఆ ఊళ్లోకెల్ల అతి పెద్ద నర్సింగ్ హోం. అక్కడికి సామాన్యులు రారు. కార్లల్లో స్కూటర్ల మీద. టాక్సీల మీద వస్తుంటారు. తమను పరిశీలింప జేసుకోటానికి.

నిజానికి అరుణా నర్సింగ్ హోం చాలా అందంగా ఉంటుంది. మూడు అంతస్థుల మేడ అది. ప్రతి అంతస్తుకూ 15 రూము లున్నాయి. మూడు అంతస్తులకూ 45 రూము లున్నాయి. ప్రతిరూముకీ, ఎటాచ్‌డ్, బాత్‌రూం ఎన్‌లావెట్రీ ఉంటుంది. అధునాతనంగా ఉంటుంది హాస్పటల్. ఫుల్ ఎక్విప్‌మెంటు వున్నదా ఆసుపత్రిలో.

నర్సింగ్ హోంకు తగ్గట్టు డాక్టర్ సుశీలాదేవి చాలా అందంగా ఉంటుంది. ఎర్రగా ఉంటుంది. పళ్ళు తెల్లగా ఉంటాయి. వళ్ళు మిళమిళ మెరుస్తుంటుంది. అంత ఎత్తూ కాదు. అంత పొట్టీ కాదు. చూడగానే అందగత్తె! అవ్వింం చేట్లు ఉంటుంది. దానికి తోడు రోజుకో చీర కడ్తుంది. చీరలు సామాన్యమైనవి కట్టదు. వొక్కో చీర కనీసం 500 రూపాయలు ఉండొచ్చు. ఎప్పుడు ఆ నర్సింగ్ హోం కిటకిట లాడుతూనే ఉంటుంది. 45 రూములు ఎప్పుడూ ఎంగేజ్ అయ్యే ఉంటాయి.

డాక్టర్ సుశీల మార్నింగ్ ఎనిమిది నుండి పన్నెండు వరకూ, సాయింత్రం ఐదు నుండి ఎనిమిది వరకే హాస్పిటల్‌లో ఉంటుంది. మిగతా టైముల్లో ఇల్లు లేదా ఎప్పుడైనా క్లబ్. ఆపరేషన్లు ఉన్న రోజు హాస్పటల్లో రెండు మూడింటిదాకా కూడా ఉంటుంది.

ఆ ఊర్లో 'ఆ నర్సింగ్ హోం'కు చాలా పేరుంది. ఎటువంటి స్త్రీ కేసునయినా చాలా చక్కగా ట్రీట్ చేయగల్గ

దని డాక్టర్ సుశీలకు పేరు ఉన్నది.

మొదట సుశీలాదేవి చాలా చిన్న ఇల్లు తీసుకొని అందులో ప్రాక్టీసు పెట్టింది. క్రమ క్రమంగా అనతి కాలంలో ప్రాక్టీసు అంచ లంచెలుగా పెరిగి పెద్ద బిల్డింగ్‌లోకి మార్చింది. ఆ బిల్డింగ్ కొనేసి, తనే మూడు అంతస్తులూ కట్టించింది. దీనికి కారణం ప్రతి కేసూ సొంత కేసులా చూసుకొని, పేషంటులకు తృప్తి, వారితో వచ్చినవారికి ఆనందం. వారి వారికి సంతృప్తి కలగటంతో యాభై రూపాయలు ఇచ్చే వారు ఐదొందలూ, ఐదొందలూ ఇచ్చేవారు ఐదువేలు ఇవ్వటంతో సుశీలాదేవి అనతి కాలంలో పెద్ద డాక్టరై పోయింది.

ఆ ఊర్లో ప్రతి రిక్షావాడికి, ప్రతి మనిషికీ ఆ హాస్పటల్ అంటే వెల్ నోఁన్‌డ్. 'సుశీలా హాస్పటల్' అని కూడా అంటుంటారు. అక్కడ ఉదయం ఎనిమిది నుండి పన్నెండు గంటల దాకా రక రకాల ఆడవాళ్ళు వస్తుంటారు. అందరూ పెళ్లికి వచ్చినట్లు చక్కగా అలంకరించుకొని శోభనపు గదుల్లోకి పోయే పెళ్లికూతుర్లల్లాగా డాక్టర్ గదిలోకి పోతుంటారు, వారిని చూస్తే వారికి ఏం జబ్బుందో తెలియదు.

డాక్టరు సుశీల ఆ రోజు నీలం నైలక్సుచీర - అదే మ్యాచ్‌తో - పైనస్కెట్, తెల్లటి పెర్లీన్ కోటువేసుకొని హుందాగా నర్సింగ్ హోం ముందు కారు దిగింది.

డాక్టరు రాగానే అందరూ లేచి నిలబడ్డారు. నమస్కారం, గుడ్ మార్నింగ్ ఇలా అందరూ చేతులు జోడించారు. డాక్టరు సుశీల నవ్వుతూ అందరికీ నమస్కరిస్తూ వడివడిగా తన గదిలోకి వెళ్ళిపోయింది ముందు నర్సు కాంపౌండర్లూ నడుస్తూ దారి చూపిస్తుండగా,

డాక్టరు గదిలోకి వెళ్ళిన తర్వాత అందరూ కూర్చున్నారు ఏవేవో మెల్ల మెల్లగా మాట్లాడుకొంటూ. వో అయిదు నిమిషాల తర్వాత వొకొక్కరినే వరుసగా రమ్మంటున్నారు. అని స్వింగ్‌డోర్ దగ్గర కాంపౌండరు నిలబడి అన్నాడు.

వరుసగా అందరూ నిలబడ్డారు క్యూరియాసిటీతో. వొక్కొక్కరు లోపలకు వెళ్తున్నారు.

లోపల.

డాక్టరు సుశీల గది అది. చాలా అందంగా, అధునాతనంగా ఉంది. చుట్టూ మెడికల్‌కు సంబంధించిన మనిషి శరీరావయవాలు. కండరాలు, బొమికలు, కన్ను, ముక్కు, నోరు, గొంతుక, స్త్రీ అవయవాలు. ఇంకా ఎన్నో పటాలు నీటుగా చట్రం కట్టించబడియున్నాయి. డాక్టరు సుశీల వీలింగ్ ఛెయిర్‌లో కూర్చుని ఉన్నది. ముందు పెద్దటేబులు దానిమీద గ్లాసు, గ్లాసులోపల ఏవేవో మెడికల్ ఎడ్వర్‌టైజుమెంట్లూ, మందులపేర్లూ ఉన్నాయి. గ్లాసుపైన ఫోన్, దేటెడ్ స్టాండు, పెన్‌స్టాండు, మెమోబుక్సు. ఇంకా ఇతర జనరల్స్. ప్రక్క కర్టెనులోపల ఎగ్జామిన్ టేబుల్, ఆ టేబుల్ ఎక్కటానికి చిన్న స్టూలూ. మూల వాటరూ, సబ్బు, తువ్వాలు, పైనఫ్యానూ వున్నాయి.

లోపలకు రాగానే పేషంటుకు ఏదో ప్రశాంతంగా, భయం భయంగా ఉంటుంది.

ఆ వచ్చినామె వయస్సు 45 సంవత్సరాలు.

"నమస్కారమమ్మా!"

"నమస్కారం కూర్చోండి." కూర్చున్నాక-

"ఏమిటీ మీ సుస్తీ."

"ఒకటే నీరసం, దడ, భయం తల్లీ! ఏ పనీ చేయలేను. ముట్లు మూడునెలల కొకసారి కానీ కావటం లేదు,

ముట్టు అప్పుడు మైల చాలా ఎక్కువగా...."

"పదండి. ఆ టేబిల్ మీద పడుకోండి. నేనువచ్చి పరీక్ష చేస్తాను...." అని డాక్టర్ అంది.

నర్సు సహాయంతో చిన్నబల్ల ఎక్కి ఆమె ఆ టేబిల్ మీదపడుకొంది. స్టెత్‌తో గుండెలూ, నాడీ, బ్లడ్ ప్రషర్ మిషన్‌తో బ్లడ్‌ప్రషరూ చూసింది. చివరికి గ్లౌవ్సువేసుకొని యోనిలో యూట్రెస్ పొజిషన్ చూసింది.

ఇదంతా చేస్తుంటే ఆ పేషంటు భయం భయంగా దిగులుగా డాక్టరు మోహంలోకి చూడసాగింది.

డాక్టరు అంతా పరీక్షించి గ్లౌవ్స్‌తీసేసి చేతులు సబ్బుతో కడుక్కొని, తుడుచుకొని సుతారంగా ముని వెంట్రుకలు సరిజేసుకొని "మీతో ఎవరు వచ్చారు?" అని అడిగింది.

"మావారు" అంది.

"పిలవండి" అంది.

ఆయన గాభరాపడుతూ వచ్చాడు. ఆయనకు యాభై సంవత్సరా లుండవచ్చు, ఎమ్ ఎల్. ఎ. డ్రస్సులో ఉన్నాడు. బాగా డబ్బున్నవాళ్ళలాగా ఉన్నారు.

"కూర్చోండి" అంది.

నమస్కారమంటూ కూర్చున్నాడు.

"ఒక వారం హాస్పటల్‌లో ఉండాలండి యూట్రెస్‌లో ఏదైనా పుండుగాని ఉందేమోనని అనుమానం. లేకపోతే అంతగా డిశ్చార్జి కావటానికి వీలుండదు. ఏది ఏమైనా గాభరాపడాల్సిన పనిలేదు. ఇవ్వాళే చేర్చండి. మందులు వ్రాసిఇస్తాను" అంటూ మందులు వ్రాసి ఇవ్వసాగింది.

ఆయన "తప్పక చేర్చుకుంటారా? ఇంటినుండి రోజూ వచ్చి చూపించుకో గూడదా. ఇది ఇంటిదగ్గర లేకపోతే అన్నిటికి ఇబ్బందే, పిల్లలు జెల్లలూ" అంటున్నాడు.

"హోమ్ డెలివరీ"

"హోమ్ డెలివరీ" సభ్యులకు నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5/- లకే వి. పి. ద్వారా పంపబడతాయి. నేడే మీరూ సభ్యులుగా చేరండి.

1. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 3/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందజేయబడుతుంది.

2. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5/- లకే ప్రతినెలా వి. పి. పి. ద్వారా పంపబడతాయి. మీ ఇంటిదగ్గరనే పోస్ట్‌మెన్‌కు రు. 5-20 పై.లు (మనియార్డరు రుసుముతో సహా) చెల్లించి, కాపీలు పొందవచ్చును. కాపీలు మీకు త్వరితంగాను, గ్యారంటీగాను చేరుతాయి. పోస్టులో పోయే సమస్య ఎంతమాత్రం లేదు.

3. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్‌గా పంపబడతాయి. ఎప్పుడైనా వి.పి. త్రిప్పితే మాత్రం మీ సభ్యత్వంరద్దవుతుంది. మీ చిరునామాలు మారినప్పుడల్లా ముందుగా తెలుపవచ్చును.

4. సభ్యులకు ఏవైనా పాత కాపీలు కావలిస్తే వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపుతాము. ఎక్కువ కాపీలు కావలసిన వారికి కొంత కన్సెషన్‌కూడా లభిస్తుంది.

5. అన్ని పోటీలలో పాల్గొనటానికి హోం. డె. సభ్యులకు మాత్రమే అర్హత వుంటుంది. సభ్యుల పేర్లు వీలునిబట్టి "అపన" లో ప్రచురిస్తాము. ఇప్పటికే వందలాది పాఠకులు సభ్యులుగా చేరారు. మీరూ చేరండి.

"తప్పదు. జేర్చాలి" అంటూ "నెక్స్ట్" అంది.

"మరి అలాగే" అంటూ లేచాడు. "మేనేజర్‌ను కన్సల్ట్ కండి, ఏరూం ఖాళీయో చెప్తాడు" అంది నర్సు.

"అలాగే అలాగే" అంటూ వెళ్ళిపోయాడు.

అతని వెంటే ఆమె నడిచింది.

* * *

నెక్స్ట్ కేసు: —

ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి.

"మార్నింగ్ డాక్టర్."

"మార్నింగ్ కూర్చోండి."

"మా డాడీ మీతో మాట్లాడాలట."

"ఏ విషయంలో."

"నా విషయంలో."

"ఇంతకీ నీకు ట్రబులేమిటి?" డాక్టరుకు తెలుసు ట్రబులేమిటో అయినా ఆ అమ్మాయి ద్వారానే చెప్పించాలని.

ఆ అమ్మాయి సిగ్గుబిడియం లేకుండా "నా కిప్పుడు థర్డు మంత్" అంది.

డాక్టరుకు నవ్వు వచ్చింది ఆ అమ్మాయి తెగించిన తనం చూస్తుంటే.

అయినా నవ్వు ఆపుకొని.... "అయితే!"....అంది.

"ఎబార్షన్ కావాలి."

"ఎబార్షన్ చేయించుకునే ఉద్దేశ్యముంటే కడుపెందుకు తెచ్చుకున్నావ్?"

"ఆ బ్రూట్ పెళ్ళి చేసుకోనన్నాడు."

"పెళ్ళిచేసుకోక ముందే కాలు ఎందుకు జారావ్?"

ఆ అమ్మాయి కాసేపు మౌనంగా ఉండి.... "ఆ టైము అటువంటిది" అంది.

"ఏ క్రైము...." అంది నవ్వుతూ.

"కాలు జారిన క్రైము...." అని తలొంచుకొంది.... ఆ అమ్మాయి.

"నీకు నువ్వే ఎబార్షన్ చేయించుకోవాలనుకొంటున్నావా? మీ డాడీ ప్రోద్బలమా?"

"నాకు నేనే."

"ఎందుకని?"

"ఆ బ్రూట్ నా శరీరంలో పెరగటానికి వీలులేదు. ఎన్ని కబుర్లు చెప్పాడు ఎన్ని వేషాలు వేశాడు. చివరికి నన్ను....నన్ను....ఆ మాటంటాడా?"

"ఏమన్నాడు...."

"నీలాంటి....బంగారు చిలకను .... పట్టుకొంటే ఎదురు డబ్బిచ్చి మొగాళ్ళతో కులుకుతుంటారు. అందుకే నిన్ను పట్టుకొన్నాను. వల్లో పడ్డావ్. నీ వనుకున్నట్టు నేను హీరోను కాదు. నాకు చిల్లి పైసా ఆస్తి లేదు. నేను తొడిగిన ఈ బెల్ట్. ఈ వాచీలు, ఈ షర్టులు. ఈ ఉంగరాలు అన్నీనూ ఫ్రెండువి. నీలాంటివాళ్ళు అరడుగుల ఎత్తు, బలమైన ఛాతీ ఉంది – అందంగా కబుర్లు చెప్తే చాలు ఐసయిపోయి అంతా ఇచ్చేస్తారు...." అన్నాడు.

"....వాడంత....రోగా...."

"ఆ రోజెంత ఏడ్చానో తెలియదు. ఈ ఆడవాళ్ళు ఎందుకింత క్షణికంగా తప్పటడుగులు వేస్తారో తెలియదు. నాన్నగార్కి చెప్పాను. ఆయన ఉగ్రుడై పోయి, మీ చదువులు, మీ స్వాతంత్ర్యం. మీ స్వేచ్ఛా చివరికి మీకు నేర్పేది ఇటు వంటి బుద్ధులే... అన్నారు. నా మూలంగా స్త్రీ జాతినంతా ఆయన అదే దృష్టితో చూశారు. నాకు చాలా భయం,

విసుగు, జీవితంపై విరక్తి, కలిగాయి. నాన్నగారితో చెప్పాను చస్తానని. అమ్మ ఏడ్చింది .... చివరికి....రాత్రి నిర్ణయించుకొని మీ దగ్గర వచ్చాం...." అన్నది.

డాక్టరు "అవును అటువంటి వెధవలూ ఉంటారు...." అని "మీ నాన్నగార్ని పిలువ్" అంది.

ఆయన వచ్చారు. ఆయన రిటైర్డు జడ్జి. నమస్కారమన్నాడు....నమస్కారమని కూర్చోమని చెప్పింది.

"అమ్మాయి అంతా చెప్పి ఉంటుంది. ఇంక నేను చెప్పవలసినదేం లేదు. మీరే దాని భవిష్యత్‌ను నిలబెట్టాలి." అన్నాడు భారంగా.

"అలాగే....కాస్త కాంప్లికేటెడ్ కావచ్చు.....నాల్గు జరుగుతుందని అంటున్నారు. అయినా ట్రై చేస్తాను. కానీ ఇది చాలా తప్పు ఈ పని మేం చేయకూడదు.... కానీ...."

"అలా అనకండి డాక్టర్ .... ఎబార్షన్లు కూడా చట్టబద్ధకంగా చేయమని చట్టం వచ్చింది. కానీ ఇటువంటి కేసులు కావనుకోండి. మీరెంత అడిగినా ఇస్తాను...." అంటూ జేబులోంచి రెండు వేలు తీశాడు.

"ఇది ఉంచండి. అన్నీ సక్రమంగా జరిగిన తర్వాత మరో రెండువేలు ఇస్తాను...." అంటూ దణ్ణం పెట్టాడు.

"అలాగే....పెద్దవారు. ఇటువంటివి నేను హాస్పటల్లో చేయను. దీనికి తగిన ఎక్విప్‌మెంటు ఇంటి దగ్గర ఉన్నది. రేపు ఉదయం ఇంటికి రండి" అనేసి.... నెక్స్ట్ అంది.

"వస్తా" అని చెప్పి ఇద్దరూ బయటకు వెళ్ళిపోయారు.

తర్వాత కేసు! పెళ్ళి కాని అమ్మాయి రక్తం లేక

పాలిపోయి, తెల్లగా ఉంది. హాస్పటల్లో చేరాలనీ, అవసర మైతే రక్తం ఎక్కించవలసి వుంటుందనీ చెప్పి పంపింది.

వరుసగా - జ్వరమనీ, టైఫాయిడనీ, ఇంకా న్యుమోనియా అనీ,, బ్రోంకైటీస్ అనీ ఇటువంటి వెన్నో రూంలో చేర్చింది.

రూములన్నీ ఫిల్లయిన తర్వాత మిగతావారికి ప్రక్క ప్రిస్కిప్షనుగా ఫీజు తీసుకొని పంపేసింది.

తర్వాత రౌండ్సుకు బయలుదేరింది. పదకొండు గంటల కల్లా రౌండ్సు పూర్తిచేసింది. 45 గదులూ చూసింది.

పదకొండున్నరకు ఆపరేషన్ థియేటర్లోకి అడుగు పెట్టింది. ఆరోజు రెండు ట్యూబెక్టమీలూ, ఒక డి. ఎమ్. సి. ఆపరేషను. రెండింటికల్లా ఇంటికి బయలుదేరింది, కారులో అలసి.

డ్రైవరు అమ్మగారి పరిస్థితి చూసి స్పీడు పెంచాడు.

2

రాజారావు ఎమ్. కామ్. కాలేజీలో హెడ్ ఆఫ్ ది కామర్సుగా ఉంటున్నాడు. అతను ఇంటికి ఐదు ఐదున్నర కల్లా వచ్చేస్తాడు. కానీ అప్పుడే సుశీల హాస్పటల్‌కు వెళ్తుంది. తిరిగి ఎనిమిదిన్నర తొమ్మిదింటికిగాని రాదు. ఈ లోపల రాజారావు ఇద్దరు పిల్లలతో సర్దాగా కాస్సేపు ఆడుకొని క్లబ్బుకుపోయి తనూ తొమ్మిది, తొమ్మిదిన్నరకుగాని రాడు. రాడని కాదు. అలా అలవాటు చేసుకొన్నాడు.

ఇద్దరుపిల్లలు. పెద్దదానికి పదేళ్ళు. చిన్నదానికి ఆరేళ్ళు. ఇంకా పిల్లలు కలగలేదు.

రాజారావుకు సుశీలంటే బాగా ప్రేమ. కానీ సుశీల విచ్చలవిడితనం అతనికి నచ్చదు. సుశీల భర్తతో బెడ్‌మీద చాలా విచ్చలవిడిగా ప్రవర్తిస్తుంటుంది. వొక్కోసారి సుశీల

యొక్క తరహాచూస్తుంటె చాలా భయం వేస్తుంటుంది రాజారావుకు.

పెళ్ళయిన మొదటి రోజునుండి గూడా సుశీల చాలా ఎడ్వాన్సుగా ఉన్నది. మెడికల్ విజ్ఞానం అటువంటిది కాబోలు అనుకున్నాడు రాజారావు. నిజానికి రాజారావు బాగానే ఉంటాడు. నల్లగాఉన్నా బలమైన చేతులు, మనిషి దిట్టంగానే ఉంటాడు. కానీ సుశీలకు భర్త కావలసినవాడు కాదు.

మొదటిరాత్రి ఎప్పుడూ గుర్తు కొస్తూనేఉంటుంది రాజా రావుకు.

తను గదిలో కూర్చుని సిగరెట్టు కాల్చుకొంటున్నాడు. అమ్మలక్కలు గదిలోకి నెట్టకుండానే తానే తెల్లటి జరీ చీరలో, ఎర్రగా మెరసిపోతూ రంభలాగదిలోకి అడుగు పెట్టి బయట చోద్యం చేస్తున్నవాళ్ళను నాలికతో వెక్కిరించి గబుక్కున తలుపులువేసి గడియపెట్టేసింది. తను ఆశ్చర్యంగా చూస్తున్నాడు తనవైపు తిరిగి "గబుక్కున మీరు ఆలైటు తీసెయ్యండి" అంది. తను యాంత్రికంగా ఆమె చెప్పినట్లు లైటు తీసేశాను.

తన దగ్గరకువచ్చి తనను ఆనుకొని నిలబడి "ఈ ఆడ వాళ్లకు మరోపని ఉండదు. ఆడ మొగ గదిలో ఏంచేస్తారో వాళ్ళకు తెలుసు. అయినా వాళ్ళు అలా చేస్తున్నారో లేదో నని చూడాలని వీళ్ళ ఉబలాటం. ఆడ, మొగ అన్న తర్వాత అలా చేయకుండా ఉంటారా! అందుకే వాళ్ళకు కనబడ కుండా లైటు తీయమన్నాను." అంది.

తనేం అంటానికి పాలుపోలేదు. చాలా సోషల్, చాలా ఫార్వర్డ్ లేడీ అనుకొన్నాడు. అనుకోకుండా తనచుట్టూ చేతులు బిగించాడు తను. అంతే లతలా అల్లుకుపోయింది. పెదవులు అందిచ్చింది. గట్టిగా కౌగలించుకొంది. అంతే!

అలాగే ఇద్దరం ఎంతసేపు ఉన్నామో తెలియదు. స్పృహ వచ్చి చూస్తే ఇద్దరం నగ్నంగా బెడ్ మీద ఉన్నాం. కళ్ళు తెరచి ఇద్దరూ ఫక్కున నవ్వుకొన్నాం. తనను తనపైకి లాక్కుంది గట్టిగా. ఆ వక్షోజాలకాంతి తనను ఉద్రిక్తుడను చేయగా తిరిగి కలబడ్డాడు తను.

అయితే సుశీలలో "కామం" ఎక్కువేమోనని రాజా రావుకు చాలాసార్లు అన్పించింది.

మరొకరోజు:—

ఇంజక్షన్లు, ఏవో పిల్సు తెచ్చింది.

"ఎందుకు" అన్నాడు.

"బలానికి" అన్నది.

"బలంగానే ఉన్నానుగా" అన్నాడు తను నవ్వి.

"ఆ బలం కాదు" అంది.

"మీరు ఇంపొటెంట్ గా ఉన్నారు. ఈ ఇంజక్షన్లు, ఈ పిల్సు తీసుకుంటె ప్రపంచంలో ఏ ఆడదాన్నయినా మీరు ఛాలెంజ్ చేయవచ్చు" అని అంటూ ఇంజక్షన్ చేసింది.

తను ఆశ్చర్యపోయాడు.

భారతదేశంలో ఓ భార్య భర్తలో నపుంసకత్వపు లక్షణాలున్నాయని, స్వయంగా ఇంజక్షన్లు, పిల్సు ఇచ్చి, సెక్సులో పరఫెక్టుగా చేయాలని చూస్తూందంటే అది స్త్రీ జాతి ఎంత ముందడుగు వేసిందో తెలుసుకోవచ్చు.

కానీ తమ ఇద్దరి మధ్యా ఎంతో అగాధముందని రాజా రావుకు తెలుసు.

అవును మరి.

రాజారావు నెలకు వెయ్యి లోపలే జీతం తేగలడు. అదే సుశీల రోజుకు వెయ్యి సంపాదించే రోజులు గూడ ఉన్నాయి. లక్షలు సంపాదించింది కొలది సంవత్సరాలలోనే.

అక్కడే రాజారావుకు చాలా చిన్నతనంగా ఉంటుంది.

తను లక్షలు సంపాదించలేదు. తనకు ఆ తెలివితేటలు లేవు. అలా సంపాదించే చదువూ చదవలేదు. వొకవేళ ఈ చదువుకు ఆ లక్షలు సంపాదించాలంటే ఇంకా తెలివి ఉండాలి. ఇవేమీ తన దగ్గరలేవు. అందుకే రాజారావు సుశీల ఎంతచెప్తే అంత. ఏది చెయ్యమంటే అది చేస్తాడు. ఇలా చెయ్యమంటే ఇలా చేస్తాడు.

వొకరోజు:—

"సుశీ! మనకు ఇంత ఉందిగదా! ఎందుకు ఇంకా పేషంట్ల దగ్గర అలా డబ్బు గుంజుతావ్?" అన్నాడు.

"చాల్చాల్లెండి. మీకు తెలియదు. ఈ రోజుల్లో డబ్బు ఉంటేనే మర్యాదా, గౌరవమును, నన్ను చూడండి. నేను మహిళామండలిలో ప్రెసిడెంటును, క్లబ్బుల్లో ప్రెసిడెంటును, కల్చరల్ ఆర్గనైజేషన్‌కు ప్రెసిడెంటును, నేను డాక్టర్లకు ప్రెసిడెంటును. ఇంకా బోలెడు. జడ్జి అయ్యేది వాడి తాత అయ్యేది చేతులెత్తి నమస్కరించాల్సిందే. జీవితమంటే, ఏమిటీ? అనుభవించాలి. అంతా అనుభవించాలి, అనుభవించి, ఆనందించి, హాయిగా కన్ను మూయాలి!" అని అంది ఉద్వేగంగా.

"అవును. అన్నీ అనుభవిస్తున్నాం కదా. ఇంకా ఏం అనుభవిస్తాం." అన్నాడు అమాయకంగా.

"మీకు తెలియదు. అన్ని బ్యాంకుల్లోనూ లక్షల ఎకౌంట్లు వుండాలి. ఈ జీవితాన్ని ఇంకా ఇంకా అనుభవించాలి."

"అనుభవించటమంటే."

"మీకు తెలియదు."

అలా ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

* * *

"సార్! ఇప్పుడు మీకు క్లాసు ఉంది సార్!" అన్నాడు స్టాఫ్ మెంబర్ ప్రసాదరావు.

"ఓ. కె. వస్తాను- ఏదో ఆలోచనలతో టైము తెలియ లేదు." అని రాజారావు పుస్తకాలు, చాక్ పీసులు, డస్టర్ తీసుకొని క్లాసుకు బయలుదేరాడు.

స్టాపు అంతా ఎవరి పనుల్లో వారున్నారు.

3

ఇంటికి వచ్చింది సుశీల. వంటమనిషి డైనింగ్ టేబిల్ మీద అన్నీ అమర్చింది.

సుశీల బాత్ రూంకిపోయి, మొఖం అదీ కడుక్కొని డైనింగు టేబిలుదగ్గరకు వచ్చింది.

ఉదయం పిల్లలూ, ఆయన భోంచేసి, కాలేజీకి ఆయన, పిల్లలు కాన్వెంటుకుపోతారు. తను ఏడున్నరకల్లా హాస్పట లుకు వెళ్ళిపోతుంది. తర్వాత ఇప్పుడూ రావటం. తను ఇప్పుడు భోంచేసి, కాస్సేపు రెస్టు తీసుకొని తిరిగి ఐదు గంటలకల్లా హాస్పటలుకు పోవాలి. కేసులు, డబ్బు. ఇదే తన ధ్యాస. తర్వాత సుఖాలు.

ఏవేవో ఆలోచనలు ముసురుతున్నాయి సుశీలకు. రోజూ ఇలా ఆ ఆలోచనలన్నీ రావటం మామూలే. వాటిని ఎలా తరమాలన్నా తనకు సాధ్యం కావటంలేదు.

ప్రభాకర్ మాటి మాటికి గుర్తు కొస్తుంటాడు. నిజంగా ప్రభాకర్ ఎంత నైస్‌మ్యాన్. అతన్ని పెళ్ళిచేసుకొన్న స్త్రీ స్వర్గంలో నివసిస్తుంది. అంత ఆనందపెడ్తాడు.

తను ధర్డు ఎమ్. బి. బి. ఎస్. చదివేటప్పుడు, తనకి పరి చయమయ్యాడు. అతను అప్పుడు ఫైనలు చదువుతున్నాడు. చాలా అందంగా బాగుంటాడు. ఆడవాళ్ళకు ఆకర్షణమయ్యేలా ఉంటాడు వో హిందీ హీరో లాగానో, వో స్పోర్ట్సుమెన్

లాగానో ఉంటాడు.

తనను పరిచయం చేసింది సులోచన. మొగవాళ్లు ఎలా బూతుకబుర్లు, ఆడవాళ్ళ కబుర్లు, తమ అనుభవాలు ఎలా చెప్పుకొంటారో అలాగే ఆడవాళ్లు తమ అనుభవాలు, తమ బూతు ఎక్స్‌పీరియన్సులు అలాగే చెప్పుకొంటారు. సులోచన చెప్పింది తనకూ, అతనికి తొడ సంబంధం ఉందని. తను ఆశ్చర్యపోయింది. గుచ్చి గుచ్చి అడిగింది ఏ విధంగా అని.

అప్పుడు చెప్పింది. అతను తన వొక్కదాన్నే కాదనీ, చాలామందితో అటువంటి సంబంధాలు ఉన్నాయనీ, అయితే బయటపడే రకం కాదనీ.

మొగవాళ్ళకు మల్లెనే తనూ చటుక్కున "వొక్కసారి అతని టేస్టుచూడాలి" అంది.

అంతే! సులోచన ఎగిరి గంతేసి "నువ్వు అమ్మమ్మవు అనుకొన్నాను. వెరీగుడ్. ఇవ్వాళే మీకు ఎంగేజిమెంట్ అరేంజ్ చేస్తాను." అనేసి అటుగా వస్తున రమేష్‌ను "హలో రమేష్!" అని విష్‌చేస్తూ అతనితో కలసి వెళ్లిపోయింది.

తను వంటరిగా మిగిలిపోయి, ఎలా అరెంజ్ చేస్తుందా? అని ఆలోచిస్తూ ఉండిపోయింది. సాయంత్రం అవర్స్ అవగానే సులోచనవచ్చి "పిక్చర్‌కు రమ్మనమన్నాడు ఇద్దర్నీ!" అని చెప్పి థియేటర్ పేరుచెప్పి వెళ్ళిపోయింది.

తనకు ఇంట్లో చిన్నప్పటినుండీ స్వతంత్రం ఎక్కువ ఉన్నది. తను వొక్కగా నొక్క కూతురు. తనకో అన్న. వాడు పెళ్ళిచేసుకొని ఎక్కడో రూర్కెలాలో ఇంజనీరుగా ఉంటున్నాడు. ఆస్తి ఎక్కువ లేకపోయినా హాయిగా జీవించటానికి తగిన వసతులన్నీ ఉన్నాయి తనకు చిన్నప్పటి

నుండీనూ.

సాయంత్రం తెల్లచీర, తెల్లజాకెట్టు, మల్లెపూలు పెట్టుకొని పింపులుగా తయారయ్యి సినిమాకు బయలుదేరి వెళ్ళింది. హాలుదగ్గరకు అప్పటికే సులోచన వచ్చిఉన్నది. ఇద్దరూపోయి హాల్లో కూర్చున్నారు. సినిమా బిగిన్ అవుతుండగా ప్రభాకర్‌వచ్చి తన ప్రక్క కూర్చున్నాడు 'హాలో!' అంటూ.

తను హాలో అంది. కానీ ఏదో భయం. అతను ఏం చేస్తాడో ఎలా ఉంటుందో ఆ ఎక్స్‌పీరియన్స్ అని. షులోచన తను మీదకు వాలి అతనితో కబుర్లు చెప్తోంది. అతని చెయ్యి తనకు తగులుతూంది. తనకు ఏదో మైకంలాగా ఉంది. సినిమా సీరియస్‌గా ఉన్నసమయంలో చటుక్కున తన తొడలదగ్గర 'స్వీట్‌హార్ట్' బొమ్మగా రాశాడు. తనవళ్లు గగుర్పొడిచింది. అతని వంక క్రీగంటగా చూసింది. నవ్వి దగ్గరకు జరిగి చెంపను ముద్దుపెట్టుకొన్నాడు. అబ్బ! ఆ ఆనందం ఎట్టిదని? ఎలా వర్ణించగలదు తను. సులోచన పిక్చరు చూస్తూఉంది. తను అతనివైపుకు వదిగి కూర్చుంది. తనను అనుకొని కూర్చున్నాడు.

పిక్చరు మధ్యలో అన్నాడు. 'నేను కారు రడీచేసి ఉంచుతాను. హారన్ వినబడగానే వచ్చెయ్యండి' అని. సరే అన్నాము. ముగ్గురం కాఫీలు త్రాగి అతని రూంకు వచ్చాం. అతని రూం చాలా ఆర్టిస్టిక్‌గా ఉంది. ముఖ్యంగా డబులు యూ ఫోమ్ బెడ్, బెడ్ ప్రక్క నగ్నచిత్రాలు అతనెంత రసికుడో తెలియజెప్తున్నాయి.

'కూర్చోండి' అని తమముందే ప్యాంటు మార్చుకొన్నాడు. అలా అతను ప్యాంటు మార్చుకొని లుంగీ కట్టుకుంటున్నప్పుడు తనకు అలాగే చూడాలనిపించింది. సులోచన

గబుక్కున "నే నేందుకూ పానకంలో పుడకలా. వస్తాను" అనేసి తనేం చెప్తున్నా వినకుండా వెళ్ళిపోయింది.

తలుపు గడియవేసి వచ్చారు. తన గుండెలు దడదడ లాడుతున్నాయి.

తర్వాత అతను సెక్సులో చెప్పిన పాఠాలు అనేకం.

'సెక్సు అంటూ తెలుసుకోవాలంటే ప్రతి ఆడదీ ముందు ప్రభాకర్‌ను కలుసుకోవాలి' అని తనో ప్రకటన వేయాలని కూడ అనుకునేది అప్పట్లో.

ఆ తర్వాతే— సులోచనా, తనూ, ప్రభాకర్ ముగ్గురం స్వేచ్ఛగా ఆ గదిలో- ఆ డబుల్ బెడ్ మీద సెక్సులోని మజాలు అనుభవించారు.

తద్భిన్నమే తనకు కడుపురావటం.

అప్పుడు తను ఫోర్తు ఇయర్. ఇంట్లో ఎవ్వరికీ చెప్ప కుండా, స్నేహితురాలి పెళ్లికని చెప్పి, ప్రభాకర్‌కు తెలిసిన డాక్టర్ చేత ఎబార్షన్ చేయించుకొన్నది. కానీ ప్రభాకర్ పొందు మాత్రం విడవలేదు. ప్రభాకర్‌ను చూడందే, తాకందే ఉండలేదు అని అన్పించేది.

ప్రభాకర్ సర్జన్ చేసి, ఫారిన్ స్టేట్స్‌కు పోయాడు పై చదువులంటూ.

ప్రభాకర్ వెళ్ళిన తర్వాత అంతా ఒంటరితనం. చదువు ఇష్టముండేదికాదు. ఆ సమయంలో తను ఎంత పిచ్చిగా వ్యవహరించిందో తనకే తెలియదు.

ఫైనలియర్‌కు వచ్చినప్పుడు నాన్న పెళ్ళి అన్నారు. "తొందరేం!" అన్నది. "కాదు. సంప్రదాయం" అన్నారు. "సరే. మీ ఇష్టం" అన్నది తను. చాలా సంబంధాలు చూశారు. అందులో డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, లెక్చరర్లు చాలామంది ఉన్నారు. నాన్నగార్కి 'రాజారావ్' సంబంధం

బొగా వచ్చింది. వాళ్ళ సాంప్రదాయం, అవీ ఇవీ బాగున్నా యట. అదీకాక కుర్రోడు ఈ కాలపు కుర్రోడు కాదనీ. తనకు మెడికోస్ చేసుకోవటం ఇష్టంలేదు. ఇంజనీర్లంటె మొదటినుంచీ ఇష్టంలేదు. ఇక లాయర్లు, వాళ్ళూ వాళ్ళ నల్లకోట్లంటే తనకు మహాచిరాకు. సరేనని రాజారావ్‌ను వొప్పేసుకొంది.

తన పాలిసీ అదికాదు. జీవితం ఎత్తింది ఎందుకూ? సుఖపడటానికి. నీకు అందినంత సుఖం పూర్తిగా అనుభ వించు. అంతేకానీ శీలమనీ, సంఘ కట్టుబాట్లనీ, ఇవనీ, అవనీ ఆలోచిస్తూ కూర్చుంటె వయస్సు పెరుగుతుందీ, మనస్సూ తగ్గుతుంది. చివరికి ఏడుస్తూ కూర్చోవాల్సిందే. తను చిన్నప్పటినుండి వచ్చిన అవకాశం జారవిడుచుకో కుండా అంతా జుర్రుకుంటూ వస్తూనే ఉంది. కానీ రాజా రావ్ సెక్సుగా తననేమంత సుఖపెట్టం లేదేమోనని తనకు అప్పుడప్పుడూ అనిపిస్తూ వుంటుంది.

రాజారావ్‌లో సహజంగా ఇన్స్పిరేషన్ తక్కువ. తనకు ఇన్స్పిరేషన్ ఎక్కువ. తనే రాజారావును ఉద్రిక్తుడను చేసి తన ఉద్రిక్తతను తీర్చుకోవాలి. రెండు పనులూ తనే చేయాలంటె మొదట్లో సరదాగా వున్నా రానురాను బోరుగా వుంది. ఇద్దరి పిల్లల్ని కంది. కానీ, తాను ఇంకా ఏదో సుఖం పొందాలని వుంది. ప్రభాకర్ వుంటె బావుండు. అతను అక్కడే ఫిక్సు అయ్యాట్ట. అతని భార్య అమెరికన్. ఆమె పంట పండింది.

రాజారావును చూస్తే తనకు నీగ్రో గుర్తుకొస్తాడు. కానీ నీగ్రో వాడికున్నంత 'బలం' రాజారావులో లేదు.

తన కోరికలన్నీ తీరాయి. అంతులేని ధనం సంపా దించాలనుకొన్నది. సంపాదించింది. పేరు ప్రతిష్టలు సంపా

దించాలనుకొన్నది. సంపాదించింది. లక్షలు లక్షలు మూల్గు తున్నాయి. పెద్ద హాస్పటల్, రెండు కార్లు, పెద్ద ఇల్లు, ఫ్రిజ్.... చీరలు.... నగలు.... వోహ్! అన్నీ సంపా దించింది.

కానీ సెక్సుగా ఇంకా ఇంకా పొందాలని ఉంది. తన వయస్సు ముప్పై అయిదే! అయితే అప్పుడే తను ముసల్ది కావాలా. రాజారావులో ఏమీ ఇన్స్పిరేషన్ వుండటంలేదు ఈమధ్య. తనను చూసీ, తన సంసారం చూసీ బంధువులూ, తల్లితండ్రులూ, అన్నయ్య వదినలూ ఎంతగా సంతోష పడతారో.... కానీ తనకో....

* * *

"ఇంకా స్త అన్నం వడ్డించమంటారా?" అడిగింది వంట మనిషి.

పళ్లెంలోకి చూసింది. పెరుగు అన్నం తింటంగూడ అయింది. ఆలోచనలతో అలా కెలుకుతూనే వుండిపోయింది పళ్ళాన్ని.

'అక్కర్లేదని' లేచి చేతులు కడుక్కొని బెడ్ రూంలోకి వెళ్ళిపోయింది రెస్టుకోసం.

4

కాస్సేపు డబల్ కాట్ యూఫోమ్ బెడ్ మీద పడుకొంది ఆలోచనలతో, హాస్పటల్ వర్క్ తో అలసిపోయిందేమో నిద్రపట్టేసింది. అలా ఎంతసేపు నిద్రపోయిందో ఏమో! నిద్ర లేచేసరికి నాల్గయ్యింది.

లేచి అద్దంముందు నుంచున్నది. తనను చూస్తే తనకే ఈమధ్య చాలా అందంగా వున్నట్లు కన్పడుతూంది. తనకు ఈమధ్య బాగా కలర్ వచ్చింది, కొద్దిగా వొళ్ళు చేసింది. అను

చెప్తా వినండి?

1. మన భారతదేశానికి చెందిన యోగి హరిదాస్ 40రోజులు భూమిలో పాతిపెట్టబడ్డాడట. కాని ఆయన బ్రతికే ఉన్నాడు. ఇదంతా మహారాజా రంజిత్ సింగ్ సమక్షంలో జరిగిందట. ఇది లాహోర్‌లో 1887 లో జరిగింది.

2. ఇటలీకి చెందిన "జియోవాన్నీ గేలాంటీ" అనే బాలుడు పగలు చూడలేడట. అతనికి రాత్రిమాత్రమే కళ్ళు కనబడతాయట.

3. ప్రపంచంలోకెల్ల చిన్న చర్చి అమెరికాలోని కేంటకీ రాష్ట్రంలోని లోషియాలో ఉంది. ఇందులో ముగ్గురే కూర్చోవచ్చు.

4. మొరాకోరాజుగా పాలించిన ములై ఇస్మాయిల్‌కు 888 మంది సంతానం. వారిలో 540 మంది మగపిల్లలు, 348 మంది ఆడపిల్లలు.

5. ఫ్రెడ్ పట్జిల్ అనే నెబ్రాస్కా దేశస్థుడు అరిస్తే 3 మైళ్ళు వినపడుతుందిట.

6. సముద్రంమీద ఉన్నప్పుడు ఉరుము వినిపించదు.

7. 1972_73 సంవత్సరంలో భారత ప్రభుత్వం దేశరక్షణమీద చేసిన ఖర్చు 1514 కోట్ల రూపాయలు. ఇందు 922 కోట్లు సైన్యంమీద, 68 కోట్లు నౌకాబలం మీద, 271 కోట్లు విమానం మీద ఖర్చుచేసారు.

—కె. నారాయణకుమార్.

కోకుండా ఆలోచన వచ్చి కాలేజీకి ఫోనుచేసింది.

ఓ ఐదు నిమిషాలకు రాజారావ్ ఫోను అందుకొన్నాడు. "నేను సుశీలను. మీరు అర్జంటుగా ఇంటికి రావాలి" అంది.

రాజారావు నవ్వుకొన్నాడు. సుశీల తనకు కోరిక వున్నప్పుడు అలా పిలవటం అలవాటే. అందుకే అతనికి ఇప్పుడు ఏ క్లాసులూ లేవు. 'సరే, వస్తానని' చెప్పి ఫోన్ పెట్టేశాడు.

సుశీల నవ్వుకొంటూ, రాజారావ్‌కోసం అలాగే యూఫోమ్ బెడ్‌మీద పడుకొని వుంది. పదిహేను నిమిషాల్లో కారేసుకు వచ్చాడు రాజారావు

మేడమీద బెడ్‌రూంలో వుంటుందని తెలుసు. అందుకే సరాసరి రూంలోకి వెళ్ళాడు. అర్ధనగ్నంగా పడుకొని వున్నది. ఆ క్షణంలో సుశీలను అలా చూసేసరికి ఆవేశం వచ్చింది. గబుక్కున ముందుకురికి సుశీలను కౌగలించుకొన్నాడు.

సుశీల అతన్ని గట్టిగా కౌగలించుకొని "ఇంతసేపా!" అంది.

"మరి రావద్దూ...." అంటూ ముద్దులతో ముంచెత్త సాగాడు.

ఆ సాయంకాల సమయాన ఇద్దరూ మదన రాజ్యంలో విహరించసాగారు విచ్చల విడిగా.

సుశీల ప్రక్కనే అలసి పడుకొన్న రాజారావుకు ముద్దిచ్చి, బాత్‌రూంకు వెళ్ళింది.

స్నానంచేసి వచ్చి, టాయిలెట్ కాసాగింది.

5

డాక్టర్ సుశీల తన కన్సల్టింగ్‌రూంలో కూర్చుని వున్నది. బయట ఏదో గొడవగా వున్నది. ఏమిటా గొడవనుకొంటూ ఏదో మెడికల్ జర్నల్ చూడసాగింది.

హఠాత్తుగా ఓ యువకుడు కాంపౌండరునూ నర్సునూ నెట్టుకొని, స్ప్రింగ్‌డోర్సును విసురుగా లోపలికి నెట్టి వచ్చాడు.

"డాక్టర్. ప్లీజ్! మా అమ్మను రక్షించండి. చూడండి, ఎలా బిర్రబిగుసుకుపోతుందో. వాతం కమ్ముతూంది డాక్టర్. ప్లీజ్. మీ ఫీజు తర్వాత ఇచ్చుకొంటాను. ఇప్పుడు ఏమీ ఇచ్చుకోలేను. మీరు పెద్ద డాక్టర్లనీ పేరు ప్రతిష్ఠలు గల వారనీ విన్నాను. మాలాంటి బీదవారినీ మీరు ఆదుకోవాలి డాక్టర్. ప్లీజ్!" అంటున్నాడతను.

డాక్టరు సుశీల అతన్నే చూస్తోంది. ఇరవై అయిదు, ఇరవై ఆరు సంవత్సరా లుండొచ్చు. ఎర్రగా వున్నాడు. కండలు తిరిగి వున్నాడు. మనిషిని చూడగానే ప్రభాకర్ గుర్తుకొచ్చాడు సుశీలకు.

డాక్టరు సుశీల హాస్పటల్‌లో ఆచారం ముందుగా ఫీజు బయట మేనేజర్‌కు చెల్లించి, అతనిచ్చిన రసీదు తీసుకొని, డోర్సు దగ్గరున్న కాంపౌండరుకు ఆ రసీదు ఇస్తే కానీ డాక్టరు దర్శనంకాదు. అలా ఫీజు చెల్లించగలిగినవారే ఆ హాస్పటల్‌కు వస్తుంటారు. లేదా అరిచి, గీ పెట్టినా డాక్టరు సుశీల చూడదు. అలా ఎన్నో బీదకేసులు రిజెక్టు చేసింది. తను చదువుకొంది డబ్బుకోసం. ఆశయాలకోసం కాదు. ఆశయాలకోసం చదువుకున్నవారు బోలెడుమంది చెట్ల దగ్గరా, పుట్లదగ్గరా క్లినిక్‌లు నడుపుకొంటున్నారు. వాళ్ళ దగ్గరకు పొమ్మంటుంది.

"మీరెవరు?" అంది సుశీల అతన్నే చూస్తూ.

"హరిజనులం?" వినయంగా అన్నాడు.

"మీ కులం కాదు అడిగింది. మీరేం చేస్తుంటారు...."

"నేను ఆర్టీసీలో డ్రైవర్ని. మా అమ్మకు వాతం కమ్ము

కొచ్చింది. ఇవి నెలాఖరు దినాలు. జీతాలు లేవు. ఈ సమయంలో మీరు ఆదుకోవాలి....''

''సరె. లోపలకు చేర్చండి.'' అంది.

కాంపౌండరూ, నర్సులూ అంతా ఆశ్చర్యపోయారు. డాక్టరు సుశీల ఏమిటీ? ఫీజు తీసుకోకుండా ఓ పేషంటును చూడటమా?

లోపలకు తెచ్చారు. ఆ యువకుడే ఎత్తుకొని తెచ్చాడు. ఓ రూం ఖాళీచేసి, అందులో చేర్చారు. అన్నీ పరీక్షచేసి.... చకచకా ఇంజక్షన్లు టాబ్‌లెట్సు రాసి ఇచ్చింది.

''డబ్బుల్లేవు.'' అన్నాడు దీనంగా. ఆ మొఖం చూస్తుంటె ప్రభాకర్ గుర్తుకొస్తున్నాడు.

''నేను ఇమ్మన్నానని ఆ షాపులో తీసుకురండి'' అని చెప్పి, నర్సుకూ. కాంపౌండరుకూ ఆ ఇంజక్షన్లు అవీ ఎలా వాడాలో చెప్పి లోపలకు వెళ్ళింది.

వీలింగ్ చెయిర్‌లో కూర్చుని పైన ఫ్యానును చూస్తూ ఆలోచిస్తూంది. ''అచ్చు! ప్రభాకర్‌లా వున్నాడు. బావున్నాడు. ఎలాగయినా ఈ కేసును సక్సస్ చేయాలి'' అంటూ టెటానస్‌కు సంబంధించిన పుస్తకాలు వెతకసాగింది.

* * *

మర్నాడు అదే రూంలోకి అతను వచ్చాడు. ''మీ అమ్మగారు కోలుకున్నట్లే'' అన్నది.

అతను కృతజ్ఞతతో చేతులు జోడించాడు. అతనే అన్నాడు ''మీరు విన్న సమయానికి ఆదుకోకపోయినట్లయితే మా అమ్మను నేను దక్కించుకోలేక పోయేవాడ్ని. మీరు నిజంగా దేవతలు'' అన్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళు కనపడ్డాయి.

టాపిక్ మార్చాలని ''మీ పేరు!'' అంది.

''ప్రభాకరరావు'' అన్నాడు.

ఒక్కసారి ఆశ్చర్యపోయింది. ఇతని పేరూ ప్రభాకర్! నిజంగా దేవుడెంత చిత్రమైన మనిషి. మనిషిని పోలిన మనుష్యులున్నట్లే. పేర్లూ ఆ మనుష్యులకే వింతగా సరి పోవటం ప్రపంచంలోని 8వ వింత.

''కూర్చోండి'' అంది.

అంతవరకూ నిలబడివున్న ప్రభాకరరావు కూర్చున్నాడు. అతనివంకే చూస్తుంది. అచ్చు ప్రభాకర్‌లా ఉన్నాడు. అదే రంగు, అదే క్రాపు, అదే పెదవులు, అదే ముక్కు, అవే కళ్ళు. అచ్చు ప్రభాకర్. కొంపదీసి ప్రభాకర్ అమెరికానుండి వచ్చి నన్ను గమత్తు చేయటానికి ఇలా వేషం వేసుకురాలేదు కదా.... అని అనుకొని, తన వెర్రి ఆలోచనకు నవ్వుకొంది.

"ఒకవారం హాస్పటల్లో వుంచండి. పూర్తిగా కోలు కొంటుంది. తర్వాత ఇంటికి తీసుకుపోవచ్చు'' అంది.

"అలాగే డాక్టరుగారూ. కానీ మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను. ప్రతినెలా జీతాలు రాగానే మీ ఫీజు, మందుల ఖర్చు అంతా వాయిదాల ప్రకారం తీర్చుకుంటాను. నన్ను నమ్మండి'' అని ప్రాధేయపడ్డాడు.

అంతవరకూ ఆలోచిస్తున్న సుశీల ''రేపొకసారి మా ఇంటికి రండి'' అంది.

ఎందుకు అని అడగకుండా, ''అలాగే.'' అని చెప్పి వచ్చేశాడు.

సుశీల వెనకనుండి ''మధ్యాహ్నం రెండు, మూడూ ఆ ప్రాంతాల్లో'' అంది.

అతను తల ఊపి వెళ్ళిపోయాడు.

ఎందుకు తనను పిలుస్తుందో తలబ్రద్దలు కొట్టుకొన్నా

అర్థంకాలేదు. చివరికి ఏదైతే అది అవుతుందని వెళ్ళటానికే నిశ్చయించుకొన్నాడు.

6

బిక్కు బిక్కుమంటూ వరండాలో నుంచున్నాడు ప్రభాకర్. అమ్మగారు పైన వున్నారు. పైకి వెళ్ళండి అని చెప్పాడు పనిమనిషి.

'అలాగే'నంటూ పైకి వెళ్లాడు. ఎటుపోవాలో తెలియక అక్కడే నిలబడ్డాడు.

అతని రాకచూసి బెడ్ రూంలోనుంచి బయటకు వచ్చింది సుశీల.

"లోపలకు రా" అంటూ లోపలికి వెళ్ళింది.

ఏకవచనానికి ఆశ్చర్యపోయాడు. గదిలోకి అడుగు పెట్టాడు. అది బెడ్ రూం.

అంతా అర్థమయ్యింది ప్రభాకర్‌కు. అర్థంచేసుకోలేని చిన్నపిల్లవాడేమీ కాదు.

"నేను రమ్మన్న కారణం - అర్థమయ్యిందా" అంది నవ్వుతూ.

తల వంచుకున్నాడు.

"తల వంచుకొంటే లాభంలేదు. నీవంటే నా కిష్టంగా వుంది. మరి నీ కిష్టమేనా?" అంది దగ్గరకు వచ్చి.

ఆ డేరింగ్‌నెస్ చూసి అచ్చెరవు చెందాడు ప్రభాకర్. అతను యువకుడు. కోరికలేం తీరలేదు. దేవర వరమిస్తానంటే కాదనే భక్తుడెవరు?

తల ఊపాడు.

పెనవేసుకుపోయింది. ఇద్దరూ ఆ బెడ్‌పై విజృంభించారు. ప్రభాకర్‌ను గుర్తు తెచ్చాడనుకొంది. తృప్తిగా కళ్ళు మూసుకొంది. ప్రక్కన వాలిపోయాడు ప్రభాకర్.

చౌలోకాలానికి ఆనందంగా, వుషారుగా లేచింది సుశీల.

"రోజూ రావాలి నువ్వు!" అంది.

"నాడ్యూటీ!" అన్నాడు.

"ఉద్యోగానికి రిజైన్ ఇచ్చెయ్" అంది.

"మరి తిండో" అన్నాడు.

"నేను ఉద్యోగమిస్తాను" అంది.

"ఎక్కడ."

"నా హాస్పటల్లో అసిస్టెంటు మేనేజర్‌గా ఉండు. నెలకు ఐదొందలు జీతం" అంది.

ఆనందంలో "థాంక్సు!" అంటూ కౌగలించుకొని, పైకెత్తి గిరిగిరా త్రిప్పాడు.

సుశీలకు అదే కావలసింది. ఆప్యాయంగా అతన్ని కౌగలించుకొంది.

7

ప్రభాకర్ కార్యక్రమం రోజూ వంటి గంటకు అమృత గార్ని ఇంటిదగ్గర దింపి, ఓ గంట మదన సామ్రాజ్యంలో ఆనందింపజేసి తిరిగి హాస్పటల్‌కు పోవటం. ఇంకేం పనేం లేదు. అంతాపని మేనేజరే చూసుకొంటాడు.

అయితే! ప్రభాకర్‌కు ఇన్‌ఫ్లుయన్స్ పెరగసాగింది. డాక్టరుగారితో నీవుచెప్తె ఈ పని అవుతుంది బాబూ! నాకు జీతం పెంచమనిచెప్పు బాబూ! మాకు గది ఇప్పిచ్చు బాబూ! మాకేసు త్వరగా నయం అయ్యేట్టు చూడుబాబూ! ఇలా ఎన్నెన్నో. అది చాలా గర్వంగా ఉంది ప్రభాకర్‌కు.

"ప్రభాకర్ నీ ముగ్గురి సిస్టర్స్ పెళ్ళిళ్ళు చేసేయ్. నీకు ఇంకే వర్రీ లుండవ్." అంది ఓ రోజు సుశీల.

"ఎలా!" అన్నాడు.

"ఏం" అంది.

"డబ్బు" అన్నాడు.

వెంటనే పదివేలకు చెక్కు రాసిచ్చింది.

ఆ రోజు ప్రభాకర్‌ను తట్టుకోవటం కష్టమయ్యింది సుశీలకు.

* * *

ప్రభాకర్ ముగ్గురు సిస్టర్స్‌కూ మూడువేలు చొ॥ కట్న మిచ్చి తమ తాహతు గలవారికి పెళ్ళిళ్లు చేసేశాడు. ముగ్గురు సిస్టర్స్ ఆనందంతో అత్తగారిళ్ళకు వెళ్ళిపోయారు.

కొడుకు ప్రయోజకత్వానికి తల్లి ఎంతో మురిసిపోయింది. గవర్నమెంటువారు కొడుకు ఎంత బాగా పని చేయబోతే అంత డబ్బు బహూమతిగా ఇస్తారూ! అని అనుకొంది.

కొడుకు ఉద్యోగం ఆ తల్లికి తెలియదు ఇంకా.

బర్డన్స్ అన్నీ తీరేసరికి, ప్రభాకర్‌లో నూతన ఆనందం, ఉత్తేజం బయలుదేరాయి.

సుశీలమీద అలిగేవాడు. అలకతీర్చేది. కోపగించుకునే వాడు, కోపం తీర్చేది. ఇలా ఎన్నెన్నో రోజుకో ప్రక్రియ రోజుకో ఆనందం. రోజులు గడిచి పోతున్నాయి.

సుశీల జీవితమంటే ఇలా ఉండాలి అనుకొంది. ఇప్ప టికి సరియైన మనిషి దొరికాడనుకొంది. చాలామంది సంసార స్త్రీలు భర్త లోటుపాట్లు కప్పిపుచ్చి, తాము పతి వ్రతలై - వెధవ కబుర్లు చెప్తూ ఆనందించే వాళ్లను చూచి ఈర్ష్యా అసూయలతో కుళ్ళిపోతుంటారు అని అనుకొంది.

ప్రభాకర్ సుశీలను "సుశీ!" అంటాడు ఏకాంతంలో, హాస్పటల్లో "మేడంగారూ!" అంటాడు.

హాస్పటల్‌ల్లో కూడ చాలా చనువుగా ఉంటాడు. పర్స నల్ అసిస్టెంటుగా అయ్యాడు.

ఇది కొంత మందికి కన్ను ఎఱ్ఱగావున్నా చేసేది ఏమీలేక ఊరుకొన్నారు.

8

రాజారావుకు ఈ మధ్య మధ్యాహ్నం పూట ఫోన్ కాల్సు సుశీలనుండేం రావటంలేదు. ఆ రోజు విద్యార్థులంతా ఏదో స్ట్రయికు చేయటంతో మధ్యాహ్నంనుంచి కాలేజీ మూసేశారు. లెక్చరర్సు గూడా ఏంచేయటానికి తోచక అంతా ఇళ్ళకు బయలుదేరారు.

రాజారావు ఇంటికివచ్చాడు. కారు వున్నది వాకిట్లో. సుశీల వచ్చి ఉన్నదని గబగబా మేడమెట్లు ఎక్కసాగాడు. ఏవో మాటలు విన్పించాయి బెడ్ రూంలోంచి. క్షణకాలం విస్తుపోయాడు. గబగబా పైకి నడిచి గదిలోనుంచి ఏం విన్పడతయ్యో అని వినసాగాడు. ఒక మొగగొంతు మరో ఆడగొంతు. ఆ ఆడగొంతు సుశీలది. క్యూరియాసిటీ ఎక్కువై ఓరగా వేసిఉన్న కిటికీలోంచి చూడసాగాడు. అంతే! ఒక్కసారి అతని గుండె గుభేలుమన్నది.

క్రొత్తగాచేరిన సుశీల అసిస్టెంటు మేనేజరు ప్రభాకర్, సుశీల దిగంబరంగా.... ఒకరు నొకరు.

సుశీల అంటున్నది "నిజంగా ప్రభాకర్ నీవు టైగర్‌వి. ఏం మజా చూపిస్తున్నావ్. ఇంత చిన్నవయస్సుకే బలే టెక్నికులు నేర్చుకున్నావే" అంటున్నది.

ప్రభాకర్ నవ్వి "నీ కంటేనా సుశీ" అంటున్నాడు.

రాజారావుకు స్పృహతప్పేట్లు ఉంది. తను వచ్చినట్లు తెలియగూడదు. గబగబా క్రిందికివచ్చేసి, బయటకు వెళ్ళిపోయాడు. ఇంకా నయం తను కారులో రాలేదు. కారు ప్రొద్దున ఓ ఫ్రెండు అడిగితే ఇచ్చేశాడు. తను రిక్షాలో వచ్చాడు. కారు శబ్దం విన్నట్లయితే సుశీల జాగ్రత్తపడేది,

ఈ రంకు ఎంతకాలంనుంచి జరుగుతూందో.

తన చెవులకు కొన్ని విమర్శలు రావటం విన్నాడు. అసిస్టెంటు మేనేజర్‌తో చెప్తే డాక్టరుగారివలన పనులు అవుతాయనీ, అతను ఆమెకు పర్సనల్ అసిస్టెంటువంటి వాడనీ; వాళ్ళకీ వాళ్ళకీ ఏం సంబంధాలున్నాయనో, ఇలాంటివి తను విన్నాడు.

కానీ తనకు సుశీల మీద ఎంతో నమ్మకమున్నది. ఆ నమ్మకాన్ని ఇలా వమ్ము చేస్తుందని తను అనుకోలేదు. ఇద్దరు బిడ్డలతల్లి, ఇంకా కామమా; ఇలా ఎంతకాలం నుంచి జరుగుతూంది? ఇతనేనా? ఇంకా ఎవరయినా ఉన్నారా?

ఆడది ఎంతటి నయవంచకురాలు. భర్తా, పిల్లలు ఉండి, పెద్ద చదువు చదివి, సంఘసంస్కర్తిణిఐ గూడ ఓ నీచమైన పనిచేస్తూందా? కేవలం శరీరతృష్ణ తీర్చుకోవటానికి ఎటువంటి పనయినా చేస్తుందా? దీని సంగతేమిటో తేల్చేయాలి? ఇటువంటిది తన భార్య అని చెప్పుకోవటానికే తనకి సిగ్గు. అది చచ్చినా బాగుండును. ఛీ....ఛీ....తన వంశం ఎటువంటిది. అటువంటి వంశంలోకి ఇది కోడలుగావచ్చి తన వంశానికే మచ్చ తెచ్చింది. ఇలా ఏవేవో ఆలోచిస్తూ పార్కులో కూలబడిపోయాడు రాజారావు. అతనిలో ప్రతీకార జ్వాల దహించివేస్తున్నది.

ఏదో ఆలోచించుకొన్న వాడిలా తలవూపి ఇంటికి బయలుదేరాడు.

9

"ఏమిటీ! శ్రీవారు ఇంత ఆలస్యం చేశారు?" అంది సుశీల నవ్వుతూ.

ఆ నవ్వు వెనుక ఎంతటి ఘోరమైన పనులున్నాయో తెలిసేసరికి భయంవేసింది రాజారావుకు.

నవ్వి "క్లబ్బునుండి వచ్చేసరికి ఆలస్యమైంది" అంటూ ముభావంగా డైనింగ్ టేబుల్‌వైపు నడిచాడు.

భర్త అంత ముభావంగా ఉండటం ఎప్పుడూ గమనించ లేదు సుశీల. అతనికి ఏదో అయ్యింది అనుకొంది. కానీ తన విషయం అతనికి తెలిసిపోయ్యిందని ఆమెకు తెలియదు.

వళ్ళు చూసింది. వేడిగా వుంది. భోంచెయ్యద్దని చెప్పి, అతనిచేత బలవంతంగా టాబ్‌లెట్స్ మింగించి, వెచ్చని పాలు త్రాగించింది. ఓ భార్యగా తన పనులన్నీ చేసింది.

రాజారావు భారంగా గదిలోకి వెళ్ళిపోయాడు. అతని మనస్సు సుశీలను చూస్తున్నకొద్దీ నరికి చంపేద్దామన్నంత కసిగా ఉంది. కానీ ఆ కసిని కంట్రోల్లో పెట్టుకొంటున్నాడు.

సుశీల తనవలన సుఖపట్టం లేదా? తనకూ ఎన్నోమార్లు అలాగే అన్పించింది. అందుకే అతన్ని చేరతీసిందా? అలా అయితే ఇందులో తప్పేముందీ? తను ఎటూ సుఖపెట్టలేక పోతున్నాడు. ఆ సుఖం మరొకరినుండి సుశీల పొందు తున్నది. అందులో తప్పులేదు కదా. అయితే ఇది భారత దేశం. భర్త వుండగా మరో పురుషుడితో కామకేళిలు జరిపిన స్త్రీ దుష్టురాలు. పతివ్రత కాదు. కానీ సుశీల.... ఇంకా ఇలాంటి సంబంధాలు వున్నాయా.... పెళ్ళికాక ముందు.... ఈ ప్రశ్న క్రొత్తగా పుట్టింది రాజారావ్‌లో....

సుశీలను గురించి పూర్తిగా తెలుసుకోవాలి. సుశీల డైరీలు చదవాలి. డైరీలు ఎప్పుడూ భద్రంగా దాస్తుంది తన బీరువాలో. అవి ఎవ్వరినీ చూడనివ్వదు సుశీల. తను ఓసారి ఆ డైరీలన్నీ చదవాలి. అంతా నిర్ణయించుకోవాలి. అప్పుడు కానీ సుశీలను చంపటమో, తను ఆత్మహత్య చేసుకోవటమో

చేయాలి అనుకొని కళ్లు మూసుకొన్నాడు.

సుశీల హాయిగా నిద్రపోతూంది.

"వారం రోజులు సెలవుపెట్టనా కాలేజీకి" అన్నాడు రాజారావు.

"యువార్ ఆల్‌రైట్. సెలవుపెట్టటం దేనికి" అంది సుశీల.

"రెస్టు తీసుకుందామని" అన్నాడు రాజారావు ఎటువంటి హావభావాలూ ప్రదర్శించకుండా.

"ఓ. కే." అని హాస్పటల్‌కు వెళ్ళిపోయింది.

10

హాస్పటల్‌లో కారుదిగి గదిలోకి నడుస్తుండగా మాటలు విని ఆగిపోయింది. ఎవరో ఇద్దరు కుర్రోళ్ళు ఇలా మాట్లాడు కొంటున్నారు.

"ఆ వచ్చినామే డాక్టర్. మన ప్రభాకర్ లేడూ. వాడు దాన్ని పట్టాడులే. వాడు పట్టటం గూడానా. అదే వాడ్ని పట్టింది. ఓరోజు ఇంటికి రమ్మనమన్నదట. వీడు వెళ్ళాట్ట. నీవంటే నా కిష్టమన్నదట. నీకూ ఇష్టమేనా అందట. వీడు ఊ.... ఊ.... అన్నాట్ట. అంతే మీదపడి నలిపేసిందట. సెక్సులో మహాదిట్ట అటలే. దీనితో వాడి అనుభవాలు వింటే అదిరిపోతావనుకో."

"ఇవన్నీ నీకు వాడు చెప్పాడా? భలే కోతలు కోశాడే."

"నేనూ అలాగే అనుకొన్నాను. వాడు ఆర్టీసీలో డ్రైవరు కదా. షడన్‌గా ఇక్కడ కుదిరాడు. నాకు ఆశ్చర్యమేసింది. మా చెల్లెల్ని ఇక్కడ చేరిపించాను కదా. బాగా పరిచయ మయ్యాడు. దాంతో తన గొప్పలు చెప్పుకోవటం ప్రారం భించాడు. నేను భలేకోతలు కోస్తున్నావే, నాకు ఇలా చెప్తే చెప్పావుగానీ ఇంకెవరికీ చెప్పకు, ప్రాణాలు తీసేస్తారు

అన్నాను. దాంతో అతనికి కోపం వచ్చి కావాలంటే ప్రూవ్ చేస్తాను పందెం! అన్నాడు. సరే పందెం కాశాను వంద రూపాయలు."

"పందెం గెలిచావా నువ్వు...."

"గెలిస్తే ఈ బాంధెదుకూ. ఓడిపోయాను."

"ఏం!"

"ఆ రోజు పంటిగంటకు ఆమె ఇంటిదగ్గర దింపి. ఆమెతోపాటు ఆమె బెడ్ రూంలోకి వెళ్ళాడు. నేనూ బయట నుంచి కిటికీగుండా పైకి ఎక్కి, వాళ్ళ బెడ్ రూం ప్రక్క దాక్కున్నాను. కిటికీలోగుండా అంతా చూశాను. వీడు నిజంగా ఆమెను పొందాడు."

"ఆమెకు అదేం బుద్ధీ."

"భర్త చాలదేమో!"

"ఏమో! మన కెందుకులే. నర్సు వస్తున్నట్లున్నది. మాట్లాడకు. వాడూ వస్తున్నాడు. మాట్లాడకు" అని ఊరు కొన్నారు.

లోపల స్ప్రింగుడోర్సు ప్రక్కన నిలబడి తమ సంభాష ణంతా డాక్టరు విన్నదని ఆ కుర్రోళ్ళకు తెలియదు.

సుశీల మొఖం కోపంతో, అవమానంతో ఎర్రబడి పోయింది.

ఆ రాస్కెల్ ఎంత పని చేశాడు. తన మొగతనాన్ని పబ్లిసిటీ చేసుకొంటున్నాడా? వీడికంటే మొగాళ్లు లేరనా? ఓరి ఇడియట్. నిన్నేం చేస్తానో చూడ్రా. నిన్ననవసరంగా మా ప్రభాకర్‌తో పోల్చాను కదరా. అతనెక్కడ నీవెక్కడ. నీ అంతు చూస్తాను. నిన్ను చంపిగాని నేను నిద్రపోను. చూస్కో నా తఢాకా! ఒక వెధవకు మన శృంగారం వంద ర్రూపాయల్లకు కిటికీ ఎక్కి చూడమని చెప్తావ్రా ఫూల్! నీ

సంగతి చూస్తాను. నీ అంతు తేలుస్తాను. నీకు పదివేలు ఇచ్చాను. నెలనెలా వేయిరూపాయలు ఇస్తున్నాను. లక్షలు ఆస్తి, పెద్ద చదువుకొన్న నేను నీకు అంతా ఆనందమిస్తుంటే ....ఇడియట్. నీ సంగతి చూస్తాను.

నాకు ప్రిస్టెజ్ ముఖ్యంరా ఇడియట్. ఈ ఆస్తీ, ఈ అంతస్థు, ఈ పేరు ప్రతిష్టలూ అన్నీ నీ మూలంగా నాశన మయ్యేట్టున్నాయి గదరా బాస్టర్డ్. ఇలా ఏవేవో ఆలోచిస్తూ, మనస్సు కుతకుతలాడుతూంటే వీలింగ్ చెయిర్‌లో కూర్చో లేక సతమతమౌతూంది.

పేషంట్లు ఆరోజు పలచగా వున్నారు. ''పేషంట్లను పంపించమంటారా మేడమ్?'' అన్నాడు ప్రభాకర్ లోపలకి వచ్చి.

పేషంట్లను పంపిస్తావట్రా ఇడియట్. నిన్ను పంపిస్తానురా ముందు యమలోకం. అనుకొని ''పంపించు'' అంది పైకి.

వరుసగా రాసాగారు పేషంట్లు. అన్యమనస్కంగా అందరినీ చూపి పంపేసింది

రౌండ్సు తిరిగివచ్చి 'డ్రైవర్!' అంది.

ప్రభాకర్ వచ్చాడు. ''ఈ రోజునుంచి నువ్వు రానక్కర లేదు ఇంటికి'' అంది.

ప్రభాకర్ మొఖం నల్లబడింది. తనేం తప్పుచేశాడు. లేక తనలాంటి వాడు ఇంకోడ్ని మరిగిందా.... ఆలోచిస్తూ వుండిపోయాడు.

అంతలో ఏమాలోచించుకుందో ఏమో! ''ఒకవారం మాత్రమే. మా ఆయన సెలవుపెట్టారు. అందుకని మనకు ఇంట్లో పడదు.'' అని తనే డ్రయివు చేసుకొంటూ వెళ్ళి పోయింది.

ప్రభాకర్ తేలికగా శ్వాస పీల్చుకొన్నాడు.

11

నాలుగు రోజులు మామూలుగా గడిచిపోయాయి.

ఆరోజు సుశీల హాస్పిటల్‌కు పోగానే, బీరువాను డూప్లికేట్ తాళంతో తీసి, డైరీలు తీయసాగాడు. మొత్తం ఇరవై డైరీ లున్నాయి. మెడికల్ కాలేజీలో చేరిన దగ్గరనుండీ డైరీలు వ్రాయటం అలవాటు చేసుకొంది సుశీల.

ఒక్కొక్క డైరీ చదవసాగాడు. ప్రతి డైరీలోనూ స్వేచ్ఛా తనం, లైఫ్‌ను ఎలా ఎంజాయ్‌చేస్తే బావుంటుందో వ్రాసు కొంది. ప్రతిరోజూ ఆనందమే!

థర్డ్ ఇయర్‌లో ప్రభాకర్ పరిచయం. ప్రభాకర్‌తో సినిమాలూ, షికార్లూ, ప్రభాకర్ గదిలో ప్రణయ కలాపాలు. ప్రభాకర్‌పై కవిత్వం, తన అభిప్రాయాలు.... ఇలా.... ఇలా....

తర్వాత కాలేజీ గొడవలు, ఎలక్షన్లు, మొగపిల్లల్ని ఏడి పించటం. ఇలా.... ఇలా....

తర్వాత పెళ్లి. రాజారావ్ ప్రవేశం. ఎంత మమ్మీగాడో. అతనితో తాను ఎలా ఎడ్జస్టు అవుతున్నదీ.

తర్వాత పిల్లలు. పిల్లలమీద ప్రేమ.

తర్వాత హాస్పటల్. హాస్పటల్ ఎలా వృద్ధిచేసింది. ఎన్ని ఎబార్షన్లు చేసింది. ఊరికే జబ్బేం లేకపోయినా హాస్ప టల్లో చేర్పించిన కేసులూ. డబ్బు ఎలా గుంజాల్సిందీ.... ఇలా.... ఇలా....

తర్వాత ప్రభాకర్ విచిత్రంగా ప్రవేశించింది. ప్రభాకర్ ఇచ్చిన సుఖం. ప్రభాకర్‌కు పదివేలు చెక్ వ్రాసి ఇవ్వటం.

ఇరవై డైరీలు చకచకా రెండు గంటలలో చదివేశాడు,

సుశీల పూర్తి తత్వం అర్థమైపోయింది. రాజారావు మనస్సు విపరీతంగా పగతో, ద్వేషంతో, ఈర్ష్యతో, కోపంతో వుడికిపోసాగింది.

సుశీలకు జీవితం కావాలి. జీవితమంటె ఆమె దృష్టిలో అనుభవించటం. సంఘం, సంఘంచేసిన కట్టుబాట్లను కప్పి పుచ్చి. ఏదైనా ఎంతైనా జుర్రుకోవచ్చు. దానికి అండగా, డబ్బుకావాలి. పేరు ప్రతిష్టలు కావాలి. అందుకే అనంతంగా డబ్బు సంపాదించింది. దానివెనుక.... ఆటలు ఆడసాగింది. సుశీ.... నిన్నేం చేయాలి. చూస్తాను. నీ అంతు చూస్తాను. లేదా నా అంతు నేను చూచుకొంటాను. సమయం రావాలి.

చివరన.... అంటె తను సెలవుపెట్టిన రోజు సుశీల డైరీలో వ్రాసుకొన్న విషయం అతన్ని కదిలించి వేసింది.

డెవిల్! ఎంత పనిచేశావ్.... ముచ్చెమటలతో అతని శరీరం తడిసిపోయింది. అతని చేతులు బిగుసుకున్నాయి. కోపంతో అతని కళ్ళు ఎర్రబడ్డాయి. అంత శాంతమూర్తి ఆ క్షణంలో ఓ రాక్షసుడిలా తయారయ్యాడు. అతని మనస్సు చకచకా పనిచేయ సాగింది.

ఇప్పుడు తనేం చేయాలి? తనేం చేయగలడు? అంతా అయిపోయింది. ఇక లాభంలేదు. తనేం చేయలేడు. ఈ రాక్షసివి.... ఈ డెవిల్....ని.... అంటూ సుశీల గొంతు పిసకబోయాడు.

మళ్ళా ఏదో ఆలోచన వచ్చి.... అలాగే ఆగిపోయి, ఆ డైరీ లోపల పెట్టేసి వచ్చి పడుకొన్నాడు.

12

మర్నాటినుండి రాజారావ్ కాలేజీకి మామూలుగానే వెళ్తున్నాడు, వస్తున్నాడు. సుశీల చేసింది నిజమేనా? అయితే

రిజల్టు చూడాలి. అంటూ రిజల్టుకోసం ఎదురుచూడసాగాడు.

ఏవిమిదో రోజు గుండె ఆగి.... ప్రభాకర్ చచ్చి పోయాడు అనే వార్త విన్నాడు.

ప్రభాకర్ చచ్చిపోయాడు. అతని మరణం అందరికీ విచిత్రంగా గోచరించింది—డాక్టర్ సుశీల హాస్పటల్లో అసిస్టెంటు మేనేజర్‌గా ఉంటూ.... హఠాత్తుగా చచ్చిపోయాడంటే.... 'అతనికి గుండె జబ్బుని' డాక్టరు సర్టిఫికేటు ఇచ్చింది.

ఆ తల్లి ఆవేదనకు అంతులేదు. ముగ్గురు అప్పచెల్లెళ్లూ వచ్చారు. ప్రభాకర్ దహన సంస్కారానికి అయిదువందలు ఇచ్చింది డాక్టర్ సుశీల. ఆమె ఔదార్యానికి అంతా మెచ్చుకొన్నారు.

రాజారావ్ బుర్ర తిరిగిపోయింది.

ప్రభాకర్ నిజంగా గుండె ఆగి చావలేదు. అతను స్లో పాయిజన్‌వల్ల చచ్చిపోయాడు. ఆ స్లో పాయిజన్ సుశీల ఇచ్చింది. అవును.... తను ఆరోజు డైరీలో చదివాడు.

"ఇడియట్ ప్రభాకర్ తనను ఎడ్వర్టైజ్‌మెంటుగా వాడుకొంటున్నాడు. వాడ్ని ఎలాగైనా అంతం చేయాలి. రేపే వాడికి స్లో పాయిజన్ ఇంజక్షను ఇస్తాను. ఆ ఇంజక్షను చాలా గమ్మత్తుగా పనిచేస్తుంది. ఆ ఇంజక్షను చేసిన 14వ రోజు గుండె ఆగి చనిపోతాడు ఆ ఇంజక్షను చేయించుకొన్న వ్యక్తి.

ఆ విషయం ఎవ్వరికీ తెలియదు. డాక్టర్లకు కూడా తెలియదు. ఆ విషం 14 రోజులు శరీరంలో రక్తనాళాలకి కొద్దికొద్ది విషాన్ని ఇచ్చి. 14వ రోజు పూర్తి విషం గుండె కెక్కి, గుండె ఇక సంకోచ వ్యాకోచాలు చేయటం మాని వేస్తుంది. దాంతో చస్తాడు.

ఈ ఇంజక్షను అమెరికాలో ప్రభాకర్ కనిపెట్టాడు. అయితే ఇంజక్షను వొక డిసీజులో వరంలా పనిచేస్తుంది. అదే ఆరోగ్యమైన మనిషికి 'శాపం'లా పనిచేస్తుంది. ఇది ఇంకా అమెరికాలో రిజిస్టరు చేయలేదు ప్రభాకర్. దీని ప్రభావాలు నీవు చూసి నాకు వ్రాయి అన్నాడు.

అయితే తను 'వరం'గా వాడుకోలేదు ఈ ఇంజక్షన్ను. శాపంగా వాడుతుంది. మరో వయిల్ వుంది. అది ఎవరి కయినా డిసీజ్డు పర్సన్‌కు వాడాలి. చూస్తాను. దీని ప్రతిభ ఎంతో! ప్రభాకర్ చచ్చాడా? తను విముక్తి పొందినట్లే. ఆ ప్రభాకర్ మందే ఈ ప్రభాకర్‌ను నాశనం చేస్తుంది. ఈ ఇంజక్షను వొకసారి ఇచ్చాక దీనికి మరేమందు తిరుగుడు ఈ ఇండియలో ఎవ్వరూ కనిపెట్టలేదు.''

ఆ చివరి వాక్యమే తనను ప్రభాకర్‌ను రక్షింపజేయలేక పోయింది. ప్రభాకర్ ఓ నిర్భాగ్యజీవి. సుశీలలాంటివారి చేతిలో ఇలాంటి ఎంతమంది నిర్భాగ్యులు చస్తున్నారో.

ఇదంతా చూస్తుండేసరికి రాజారావుకు జీవితంపై విరక్తి వేసింది. తనూ చావాలి. అందుకే.... ఈ రాత్రే.... తాను ఆత్మహత్య చేసుకోవాలి అని కొన్నాడు.

13

ఆరోజు రాత్రి చాలా వుషారుగా వుంది సుశీల. హాయిగా ఫోంచేసి బెడ్ రూంలోకి వచ్చింది, రాజారావు విస్కీ బాటిల్స్ బీరు బాటిల్స్ రెడీ చేస్తున్నాడు.

''చాలా రోజులయ్యింది. ఈ రోజు ఎందుకో షడన్‌గా ఈ బుద్ధిపుట్టింది. కొంస్త కంపెనీ ఇవ్వు'' అన్నాడు.

''వాంతులొస్తాయి బాబూ'' అంది సుశీల.

''వొక అరగంట ఆగే త్రాగుదాం, వాంతులురావ్ ఏమీ

రావే'' అన్నాడు.

"ఏమిటీ! దొరవారు ఇవ్వేళ వుషారుగా వున్నారు" అంది.

"ఇదే మన చివరి పార్టీ!"

"అదేమిటీ?"

"ఇవ్వాళ ఓ ఫ్రెండుతో పందెం వేశాను. ఇవ్వాల్టినుంచి నేను మద్యం ముట్టను అని. ఆ పందెంలో గెలవాలి" అన్నాడు.

"ఇంకా నయం! ఇవ్వాల్టినుంచి పెళ్ళాన్ని ముట్టను అని వేయలేదు మీరు'' అని నవ్వింది.

రాజారావు నవ్వి "ఆపందెం కాస్తే నీవు ఊరుకుంటావా?" అన్నాడు.

సుశీల నవ్వి ''అయితే కానియ్యండీ'' అంది.

ఇద్దరూ విస్కీ, బీరు కలిపి రెండు గ్లాసులూ పట్టుకొన్నారు. చీర్స్ అంటూ త్రాగసాగారు. సుశీల గ్లాసు ఖాళీ చేసింది. నింపాడు. తనుమటుకు త్రాగటంలేదు. తను తాగితే తన ప్లాను సక్సస్ కాదని అతని నమ్మకం. కానీ త్రాగుతున్నట్లు నటిస్తున్నాడు.

సుశీలకు వుషారుగా కబుర్లు చెప్తున్నాడు. భర్త ఎన్నడూ ఇంత వుషారుగా లేకపోయేసరికి, సుశీలకూ వుషారు వచ్చి, మరో గ్లాసు.... మరో గ్లాసు.... ఇరవై నాల్గు అవున్సుల విస్కీ, రెండు బీర్ బాటిల్స్ మత్తుతో అలాగే పడిపోయింది.

రాజారావు గబగబా తను చేయవలసిన కార్యక్రమమంతా చేసేశాడు.

ఓ కాగితంమీద ఇలా వ్రాసిపెట్టాడు.

"నాకు జీవించాలని లేదు. కారణం అడక్కండి. నా ఈ ఆత్మహత్యకూ ఎవ్వరూ బాధ్యులు కారు. నా భార్యకుగానీ, నా పిల్లలకు కానీ ఇందు ఎటువంటి సంబంధమూ లేదు

ఇట్లు రాజారావు."

తర్వాత స్లీపింగు పిల్సు సీసాడు మ్రింగి పడుకొన్నాడు మరణదేవతను ఆహ్వానిస్తూ.

14

తెల్లవారింది. సుశీల మత్తును వొదిలించుకొని, ఎక్కడ పడిన సీసాలు గీసాలూ అన్నీ సర్ది, భర్తవంక చూసి.... ఆశ్చర్యంతో దగ్గరకుపోయి చూసింది. అచేతనంగా పడి ఉన్నాడు. అనుమానంతో చెయ్యి పట్టి చూసింది. అంతే! కెవ్వున కేకేసింది.

క్రింద పనివాడు పరిగెట్టుకొని పైకి వచ్చాడు. అమ్మగారు క్రిందపడి పోవటం-అయ్యగారిలో చలనంలేక పొయ్యే సరికి-వాడికి ఏవో సినిమాలు గుర్తుకొచ్చి, అందులో లాగా పోలీసులకు ఫోన్ చేశాడు.

పోలీసులువచ్చి-సుశీలపై నీళ్ళు చల్లారు. సుశీల లేచింది- భర్త వ్రాసిన చీటీ చూసారు.

భోరుమని ఏడ్చింది....

పోలీసులు తమ పని తాము చూడసాగారు. ఊళ్ళో అందరికీ తెలిసింది. ప్రముఖులంతా వచ్చారు. ఎన్నెన్నో ప్రశ్నలు ఎన్నెన్నో వోదార్పులు. పేరు ప్రతిష్టలుగల డాక్టరు భర్త ఆత్మహత్య చేసుకోవటం, దానికి ఎవ్వరినీ బాధ్యులు కారనీ మరీ కాగితం వ్రాసిపెట్టి చావటం. పోస్టుమార్టమ్ రిపోర్టులో వోవర్ స్లీపింగ్ టాబ్లెట్స్ వలన మరణమని వచ్చింది.

ప్రముఖులంతా చేయవలసిన కార్యక్రమమంతా చేసేశారు.

సుశీల భర్త ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఎంత బుర్ర బ్రద్దలుకొట్టుకొన్నా అర్థంకాలేదు. ఎందుకు ఆత్మ

హత్య చేసుకోవలసి వచ్చింది. తన విషయం ప్రభాకర్ విషయం ఈయన చెవులదాకా వచ్చిందా! అది విని, భరించ లేక ఆత్మహత్య చేసుకొన్నాడా?

ఇప్పుడు తను ఇక విడో. రంగు చీరలు కట్టటానికి వీలులేదు. బొట్టు పెట్టుకోవటానికీ, కాటుక దిద్దుకోవటానికీ వీలులేదు. నిస్సారమైన బ్రతుకు బ్రతకాలి. తనకి నిండా నలభై సంవత్సరాలు గూడా లేవు. రాజారావ్ ఎందుకు చచ్చిపోయాడు? ఏదో షాక్ తిన్నాడు. అది ప్రభాకర్ షాకే అయివుంటుంది.

రూర్కెలానుండి అన్న, వదినలు, తల్లి తండ్రులు ఇతర బంధువర్గమూ అంతా వచ్చింది. అందరికీ అనుమానమే. భార్యా భర్తలమధ్య ఏదో కీచులాటలు వచ్చాయని.

గుచ్చి గుచ్చి అడిగారు సుశీలను. అందరికీ సుశీల ఇచ్చిన సమాధానం వక్కటే.

"ఆయన మరణం నాకు తెలియదు. నాకు తెలిసుంటే నేనే ముందుపోయేదాన్ని...." ఇలా అని, తనే ఆ మాట అన్నదా అని ఆశ్చర్యపోయింది తర్వాత సుశీల.

వాళ్ళంతా ఎవరికి తోచింది వారు చెప్పుకొంటున్నారు.

పదమూడో రోజు కర్మకాండలు అవీ యధావిధిగా జరి పించారు. పెద్ద సమాధి కట్టించారు. దానిమీద ఒక గుడి కట్టారు. సుశీలను విధవను చేశారు.

ఈ పదమూడు రోజులూ హాస్పటల్కు రావడం పూర్తిగా మానివేసింది సుశీల. తన వర్కంతా తన కొలీగ్ డా॥ సుజాతను చూడమంది.

"భర్త పోయాడనీ నీవూ హాస్పటల్కు పోకుంటె ఎలా తల్లీ! రోజు ఇళ్ళకు ఎంతమంది పేషంట్లు వొస్తున్నారో

చూడు.... రేపటినుంచి హాస్పటల్‌కు పో తల్లీ!" అని నచ్చ చెప్పారు తల్లి తండ్రులు.

ప్రభాకర్‌ను చంపిన 'శాపం' నన్నేడిపించటంలేదు ... కదా! అనే భయం సుశీలలోకి వచ్చింది. ఎంతైనా ఆడది కదా. ఈ పదమూడు రోజులూ తిండి, ఆహారం గూడా సరిగ్గా తీసుకోలేదు సుశీల. పధ్నాలుగో రోజు-

విధవగా హాస్పటల్‌లో కాలుపెట్టింది. అంతా సానుభూతిగా జాలిగా చూస్తున్నారు. అయ్యో పాపం అంటున్నారు. ఆ జాలీ, సానుభూతీ అంతాసుశీలను దుఃఖంసముద్రంలో ముంచేసింది.

గటగటా తన గదిలోకి పోయి, వీలింగు ఛెయర్‌లో కూర్చుని వొక్కసారిగా "అమ్మా" అంటూ గుండెపట్టుకొని వెనక్కి పడిపోయింది. ఆ గొంతు విని డాక్టర్ సుజాత, నర్సులు, కాంపౌండర్లు అంతా గుమిగూడారు.

డాక్టరు సుజాత పరిక్షచేసి "గుండె ఆగిపోయి డాక్టర్ సుశీల చచ్చిపోయింది" అంది.

అంతే! నలభై అయిదు రూంల జనమూ, వీధుల్లో, అందరూ వచ్చారు చచ్చిపోయిన సుశీలను చూట్టానికి.

తల్లి తండ్రులూ-అన్న వదినలూ, బంధువులూ, అంతా హాస్పటల్‌కు వచ్చారు. ఎవరికి తోచింది వారు....

అన్ని కామెంటుల్లోకి ఈ కామెంటు ఎక్కువగా వినబడ సాగింది. "భర్త పోయాడని దిగులుతో పాపం తనూ గుండాగి చచ్చిపోయింది. నిజంగా దేవత. భర్త సాన్నిధ్యం లోకి వెళ్ళిపోయింది" అని.

కానీ నిజం ఎవరికి తెలుసు! రాజారావు తాను ఆత్మహత్య చేసుకునే రాత్రి సుశీలను బాగా త్రాగించి, మత్తుగా పడి పోయినప్పుడు ఇంజెక్షన్ సుశీలకు ఇచ్చి, తను నిద్రమాత్రలు మ్రింగాడని.

★


ఆఁ! ఏ సంపాదనలే గురూ!
నన్ను చూస్తే తెలీటంలేదా!
మాకన్నా వీరే నయంగున్నారు!
APP
చంద్ర


బహుమతి
పట్టిచ్చిన వారికి
రూ. 10,000/-
చంద్ర

10 గంటలసేపు ప్రపంచానికి ప్రమాదం

కొమ్మూరి
సాంబశివరావు సీరియల్

సీరియల్

31

(గత సంచిక తరువాయి)

నిమిషంపాటు పింగ్‌మింగ్ దిగ్భ్రమచెందిం. నోటమాటలేక, రాతిబొమ్మలా నిలబడిపోయాడు—

"పింగ్‌మింగ్! నీలాటి వాళ్ళతో బేరాలు కుదుర్చుకోవడం, ఒప్పందాలకి రావడం, నా కిష్టంలేదు. మా దేశానికి, ప్రపంచానికీ యింత ప్రమాదం తెచ్చిపెట్టిన నీలాటి దుర్మార్గుల్ని నడివీధిలో నిలబెట్టి వురితియ్యాలి; కాని, తప్పదు. నీ ప్రాణాల్ని కాపాడాలి. నిన్ను సురక్షితంగా నీ దేశానికి వెళ్ళనిస్తాం; నువ్వు నిజం చెప్పావంటే! ఆలోచించు" అన్నాడు యుగంధర్.

"ఏమిటా నిజం?" అడిగాడు పింగ్‌మింగ్ నేలమీద పడివున్న ప్రవీణ్‌కుమార్ని చూస్తూ.

"హోంమంత్రి పిన్హా ఎక్కడున్నారు? ఎక్కడ ఆయన్ని బంధించారు?" అడిగాడు యుగంధర్.

పింగ్‌మింగ్ విరగబడి నవ్వాడు— "యుగంధర్! తెలియక నువ్వు నీ నాటకం బయటపెట్టేశావు! యీ ప్రవీణ్ కుమార్ నిజం ఎలా కనుక్కున్నాడా, డివైజర్‌ని డిస్‌కనెక్ట్ చెయ్యడం, అతను ఎలా తెలుసుకున్నాడా! అని ఆశ్చర్యపోతున్నాను యిందాకట్నుంచీ, ఇప్పుడు నిజం తెలిసిపోయింది! ప్రవీణ్‌కుమార్ డివైజర్‌ని డిస్‌కనెక్ట్ చెయ్యడం తెలుసుకోలేదు యుగంధర్! నువ్వు అబద్ధం చెప్పావు! నీ అబద్ధం బయటపడింది—" అన్నాడు.

యుగంధర్ క్షణంపాటు తటపటాయించాడు. తనుచేసిన పొరపాటు ఏమిటి? మాలవ్య నగరంలోని ఆ యింట్లోకి

ఎలా ప్రవేశించాలో! అణుబాంబులు ప్రేలకుండా డివైజర్‌ని ఎలా డిస్‌కనెక్ట్ చెయ్యాలో! ప్రవీణ్‌కుమార్ చెప్పిన మాట అబద్ధం కాదు. హోంమంత్రి పిన్హా ని ఎక్కడ బంధించిన విషయానికి, ప్రవీణ్‌కుమార్ చెప్పిన విషయానికి సంబంధం ఏమిటి? ఒకటి తెలుస్తే; రెండోది తెలుస్తుందనా! అంటే- హోంమంత్రి పిన్హా యీ కుట్రలో పాల్గొన్నాడా? లేక—?

"ఏమిటి యుగంధర్ ఆలోచిస్తున్నారు! వ్యవధిలేదు. గడియారం ముళ్లు కదులుతున్నాయ్ చూడండి. అధికారం అప్పచెప్తారా- చెప్పండి, ఏంచేస్తారు?" అడిగాడు సింగ్ మింగ్. మళ్ళీ అతనికి ధైర్యం వచ్చింది. గర్వంతో అహంకారంతో నడుంమీద చేతులు పెట్టుకున్నాడు.

"సింగ్‌మింగ్! ప్రవీణ్‌కుమార్ నాకేమీ చెప్పలేదని, నేను బుకాయిస్తున్నానని నువ్వనుకోవడం పొరపాటు. హోంమంత్రి పిన్హా ఎక్కడ బంధింపబడ్డాడో చెప్పే లోపల ప్రవీణ్‌కుమార్ ప్రాణంపోయింది" అన్నాడు యుగంధర్.

"యుగంధర్! నువ్వు నన్ను బుకాయించక, ప్రవీణ్‌కుమార్‌కి నీకూ ఏమీ తెలియదు. నీది ఒట్టి బుకాయింపే కాదు. ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో అంటున్న మాటలవి" అన్నాడు సింగ్‌మింగ్.

యుగంధర్ సందిగ్ధంలో పడ్డాడు. తను బుకాయించడం లేదు. ప్రవీణ్‌కుమార్ చెప్పాడు. ఆ యింట్లో వున్న అణుబాంబులు ప్రేలకుండా ఎలా డిస్‌కనెక్ట్ చెయ్యాలో! అంతే కాదు, ఆ యింట్లో ఎలా ప్రవేశించాలో కూడా. ఈ సింగ్ మింగ్ ఎందుకలా అంటున్నాడు? ఏమిటి ఇందులో గూఢార్థం? సింగ్‌మింగ్‌కి ఎందుకింత ధైర్యం? ఎలా వచ్చింది?

"సింగ్‌మింగ్! నువ్వే బుకాయిస్తున్నావ్! నువ్వు బుకాయిస్తున్నావో, నేను బుకాయిస్తున్నానో, యింక

కాసేపట్లో తెలుతుంది. మేము వెళ్లుతున్నాం; మా హోం మంత్రి సిన్హాని, కాపాడ్డానికి. నీ ప్రాణాన్ని. నీ కిస్తామని చెప్పాం; తిరస్కరించావు; ఏదో ధైర్యంతో. పొరబాటు నాదో నీదో తెలుతుంది'' అని, యుగంధర్; మిగతా అందరి వైపు తిరిగి—

''మీరిక యీ గదిలో వుండనవసరంలేదు. పింగ్‌మింగ్‌ని ఎక్కడికి పారిపోకుండా అతన్ని బంధించి వుంచే బాధ్యత, బండార్కర్! మీది; నేను వెళుతున్నాను—'' అన్నాడు యుగంధర్.

అప్పటికీ పింగ్‌మింగ్ నవ్వుతూనే వున్నాడు. బండార్కర్, దేశరక్షణ నాయకులూ, పింగ్‌మింగ్ చుట్టూ నిలుచున్నారు. తలుపువరకూ వెళ్ళాక—

''గుడ్‌బై పింగ్‌మింగ్!'' అన్నాడు యుగంధర్. పింగ్‌మింగ్ మళ్ళీ నవ్వాడు—

''అరగంటలో పరుగెత్తుకుంటూ వస్తారు. అప్పుడే గుడ్‌బై ఎందుకు చెప్పడం-'' అన్నాడు పింగ్‌మింగ్.

* * *

మాలవ్య నగరంలోని శత్రువుల స్థావరానికి ఎదురుగా వున్న యింట్లోకి వెళ్ళాడు యుగంధర్, రాజుతో సహా. కర్నల్ జ్వాలాసింగ్ హాల్లోనే వున్నాడు. ఇంటినిండా స్పెషల్ బ్రాంచ్ ఏజంట్లున్నారు. యుగంధర్‌ని చూడగానే, బండార్కర్ అసిస్టెంట్ అయిన, స్పెషల్ బ్రాంచ్ ఏజెంట్ సెల్యూట్ చేసి;

''ప్రవీణ్‌కుమార్ మిమ్మల్ని కలుసుకున్నారా?''అడిగాడు.

యుగంధర్ తలూపి, ''త్వరగా ఏంజరిగిందో చెప్పండి'' అన్నాడు.

"ఏంజరిగిందో నాకు తెలియదు సార్. ప్రవీణ్‌కుమార్ ఆ పరికరాలన్నీ పెట్టుకొని, ఏవో ఏవో మీటలు నొక్కుతూ, ఏవో ఏవో వ్రాస్తున్నారు కాయితం మీద. ఉన్నట్లుండి సంతోషంతో, లేచి నిలబడి- వెంటనే యుగంధర్‌గార్ని పిలిపించండి; రహస్యం కనుక్కొన్నాను అన్నారు ఆయన. ఆ మాట అంటూ లేచి నిలుచున్నారు; అంతే; అమాంతం నేలమీద పడిపోయారు. ఛాతీనుంచి రక్తం కారుతోంది; ఎక్కడ్నుంచో, దూరాన్నుంచి, టెలిస్కోప్ లెన్సుతో, ప్రవీణ్‌కుమార్ని చూస్తూ; ఎలాగో ప్రవీణ్‌కుమార్ మాటలు అర్థమై; బహుశా, ఎదురుగా వున్న ఆ యింట్లోనుంచి, ప్రవీణ్‌కుమార్‌ని షూట్‌చేసి, వుండాలని అనుకున్నాను. నేను బైనాక్యులర్స్‌తో చూశాను. ఎవరూ కనిపించలేదు ఆ యింట్లో. ప్రవీణ్‌కుమార్‌ని ఆసుపత్రికి తీసుకెళ్దామను కున్నాం; కాని, ప్రవీణ్‌కుమార్; వీల్లేదని, తను తెలుసుకున్న విషయాలు వెంటనే మీకు చెప్పాలని, తన ప్రాణం పొయ్యే లోపల, దేశాన్నీ ప్రపంచాన్నీ రక్షించాలనీ, యిక్కడ్నుంచి బయలుదేరారు. తన కాయితాల్ని, పరికరాల్ని, ఎవ్వరూ ముట్టుకోకుండా జాగ్రత్తగా వుండనివ్వమని చెప్పారు. అందుకని, నేను యిక్కడే వుండిపోయాను. నా అసిస్టెంట్‌ని తోడుయిచ్చి; మీ దగ్గరికి పంపించాను" అన్నాడు బండార్కర్ అసిస్టెంట్.

"ప్రవీణ్‌కుమార్ మరణించారు" అంటూ యుగంధర్ మేడమీదికి వెళ్ళాడు.

శత్రువుల స్థావరంలోకి ప్రవేశించడం ఎలాగో; ఆ అణు బాంబుల్ని డిస్‌కనెక్టు చెయ్యడం ఎలాగో, ప్రవీణ్‌కుమార్ తెలుసుకొన్నాడని శత్రువులకి ఎలా తెలిసింది—? తెలిసిన

మరుక్షణమే. ఎలాషూట్ చేశాడు? ఎవరో. ఆ ఇంట్లోనుంచి. బైనాక్యులర్స్‌తో ప్రవీణ్‌కుమార్ని చూస్తూ వుండాలి. మాటలు వినబడకపోయినా; పెదిమల కదలికవల్ల అతను అంటున్న మాటలు శత్రువులకి అర్థమై వుండాలి. అక్కడ్నుంచే షూట్ చేసి వుండాలి ప్రవీణ్‌కుమార్ని.

"హోంమంత్రి సిన్హాని రక్షించండి; ప్రమాదం తప్పుతుంది. హోంమంత్రి సిన్హాని రక్షిస్తే అణుబాంబులు ప్రేలవు. శత్రు స్థావరంలోకి ప్రవేశించడం ఎలాగో; నా కాయితాల్లో వ్రాశాను" అని చెప్పాడు ప్రవీణ్‌కుమార్ కొన వూపిరితో వుండగా; ప్రవీణ్‌కుమార్ వ్రాసిన కాయితాల్ని తిరగేస్తున్నాడు యుగంధర్.

సిగ్నల్ కోడ్స్; ఏవేవో గీతలు. చాలా వున్నాయి. యుగంధర్ అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

"రాజూ! యివి చూడు" అన్నాడు యుగంధర్. రాజు చూశాడు. సింగ్‌మింగ్‌కి ఎందుకు ధైర్యం వచ్చిందో; ఎందుకు తిరగబడ్డాడో. యిప్పుడు అర్థమయింది ఆ యిద్దరికి.

హోంమంత్రి సిన్హా గుండెకి, అణుబాంబులు ప్రేల్చే డివైజర్‌ని ఏర్పాటు చేశారు శత్రువులు. హోంమంత్రి చనిపోతే; అంటే గుండె ఆగిపోతే; అణుబాంబులు ప్రేలుతాయి. రాత్రి పన్నెండు గంటల లోపల హోంమంత్రి సిన్హా గుండె ఆగిపోయేటట్లు చేసివుండాలి శత్రువులు. ఎలాగైనా, హోంమంత్రి సిన్హా గుండె ఆగిపోయే లోపల, డివైజ్ డిస్‌కనెక్టు చేసేస్తే, సర్క్యూట్ పూర్తికాదు; అణుబాంబులు ప్రేలవు. ఇవన్నీ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగు అద్భుతాలు. సందేహంలేదు. ఇది కనిపెట్టిన ఎలక్ట్రానిక్ ఇంజనీర్ మేధావి. అందులోనూ సందేహంలేదు. ఆ మేధస్సు మాన

వాళి సుఖశాంతులకు కాక వినాశనానికి వుపయోగించడం దురదృష్టం. ఆ ఎలక్ట్రానిక్ ఇంజనీర్ మేధస్సును మించిన మేధస్సు ప్రవీణ్‌కుమార్‌ది. ఏ సూచనా లేకుండా తెలుసుకున్నాడు. ఎలా తెలుసుకున్నాడో? చూస్తున్నాడు ప్రవీణ్ కుమార్ కాయితాల్ని యుగంధర్—

గుండె దడదడ వినిపిస్తోంది; వినిపిస్తోందట అతనికి. ఎందుకు? సిగ్నల్స్ ఫ్రీక్వెన్సీ మార్చిచూశాడు; ఇద్దరి మాటలు వినిపిస్తోందట అతనికి. అదీ వ్రాశాడు ప్రవీణ్‌కుమార్.

"పింగ్‌మింగ్ హోంమంత్రిగా ఆ గదిలో బంధింపబడ్డాడు."

"భయంలేదు; అసలు హోంమంత్రి మన బందీగా వుండగా."

"పింగ్‌మింగ్‌ని వాళ్ళు బంధిస్తే?"

"రాత్రి పన్నెండు గంటలకి హోంమంత్రి సిన్హా గుండె ఆగిపోతుంది. అణుబాంబులు ప్రేలుతాయి."

ఈ మాటలు, ఎవరు, ఎవరితో మాట్లాడారు? ప్రవీణ్ కుమార్ వ్రాయలేదు ఆ విషయం. విన్నాడు, ఫ్రీక్వెన్సీ మార్చి; ఆ ఫ్రీక్వెన్సీకి మార్చాలని ప్రవీణ్‌కుమార్‌కి ఎలా తెలిసింది. ఏమిటి ప్రవీణ్‌కుమార్ సూచన! హోంమంత్రి ఎక్కడున్నాడని అడగ్గానే, సింగ్‌మింగ్‌కి ధైర్యం వచ్చింది! ఎదురు తిరిగాడు! ఇప్పుడేం చెయ్యాలి? హోంమంత్రి సిన్హాని ఎలా వెదికి పట్టుకోవడం? ఆలోచిస్తున్నాడు యుగంధర్!

* * *

కళ్లు తెరిచాడు హోం మంత్రి సిన్హా. ఎదురుగా కూర్చొని వున్నాడు ఒకతను.

"అయిపోయిందా?" అడిగాడు సిన్హా.

"మీ వాళ్ళు యింకా లొంగలేదు; ఆ యుగంధర్ జోక్యంవల్ల, ఆ ప్రవీణ్‌కుమార్ అనే అతని జోక్యంవల్ల" అన్నాడు ఎదురుగా కూర్చున్నతను.

పిన్హా బరువుగా వూపిరి పీల్చాడు. ఆలోచిస్తున్నాడు. తన ప్రాణాన్ని బలియిస్తే; దేశానికి అపాయం తప్పుతుందని ఎవరన్నా చెపితే, సంతోషంగా బలియిస్తాడు. అది కాదు పరిస్థితి. తన ప్రాణంపోతే; తనగుండె ఆగిపోతే; దేశానికీ, ప్రపంచానికీ ప్రమాదం. ఈ ప్రమాదం పోయేటంతవరకూ, తన గుండె కొట్టుకుంటూనే వుండాలి. కాపాడుకుంటూ వుండాలి. ఆగకూడదు. అందుకే కదలకుండా పడుకొని వున్నాడు ప్రక్కమీద అతను.

'తను ఎక్కడున్నాడు? యుగంధర్‌కి తెలుస్తే! తను ఎలాగైనా తెలియజేయగలిగితే; యుగంధర్; తననీ, దేశాన్నీ, ప్రపంచాన్నీ రక్షించగలడు. యుగంధర్ మీద తనకి ఆధైర్యం వుంది. ఎలా తెలియజేయడం యుగంధర్‌కి' ఆలోచిస్తున్నాడు హోం మంత్రి పిన్హా.

*　　　*　　　*

యుగంధర్ ప్రవీణ్‌కుమార్ వ్రాసిన కాయితాల్ని తిరిగేస్తున్నాడు. యిన్ని విషయాలు కనుక్కున్న ప్రవీణ్‌కుమార్, పిన్హా ఎక్కడ బంధింపబడ్డదీ కనుక్కున్నాడా! కనుక్కోలేదా? కనుక్కొనివుంటే వ్రాసి వుండడా!

"రాజూ."

"ఆఁ."

"చూడు" అన్నాడు యుగంధర్.

"యస్. సార్! దీన్నిబట్టి పిన్హా, ఆ యింట్లోనే వున్నాడు." అన్నాడు రాజు.

" అంటే. సిన్హా గుండెకివున్న డివైజ్ అణుబాంబులు ప్రేలడానికి మాత్రమే ఏర్పాటు చేయబడిందన్నమాట. ఆ యింట్లో ప్రవేశించడానికి ఆ డివైజ్ అడ్డురాదు మనకి. ఆ వార్నింగు డివైజ్ డిస్కనెక్ట్ చెయ్యడానికి వేరేమార్గం వుండి వుండాలి రాజు!" అన్నాడు యుగంధర్.

రాజు మిగతా కాయితాల్ని తిప్పుతున్నాడు.

"సార్; చూడండి."

"ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"దీనికేమిటి అర్థం సార్?" అడిగాడు రాజు.

"థాంక్ గడ్! ప్రవీణ్‌కుమార్ వృధాగా ప్రాణాల్ని బలియివ్వలేదు. ఇది, వార్నింగుసిస్టమ్ డిస్కనెక్టు చేసేమార్గం, రాజు." అన్నాడు యుగంధర్.

"అయితే వెళ్దాం; పదండి" అన్నాడు రాజు.

"రాజు! అది అంత సులభంకాదు. మనం ఆ యింట్లో ప్రవేశించి నంతమాత్రాన ఏం లాభం? ఆ యింట్లో బంధింపబడ్డ హోం మంత్రిని చంపేశారంటే, మన శ్రమంతా వృధా అవుతుంది; దేశాన్నీ, ప్రపంచాన్నీ ప్రమాదానికి గురి చేసిన వాళ్ళం అవుతాం." అన్నాడు యుగంధర్.

రాజు, యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"రాజూ! ఎత్తుకు పైఎత్తు వెయ్యాలి! వార్నింగు సిస్టమ్ డిస్కనెక్టుచెయ్యడం; మనం లోపల ప్రవేశించడం; తరువాత మనం లోపలికివెళ్ళాక; మనం శత్రువులం కామని, వాళ్ళల్లో ఒకళ్ళమని, వాళ్ళు అనుకోవాలి. అనుకునేట్లు చెయ్యాలి. హోంమంత్రి బంధింపబడ్డ గదిలోకి వెళ్ళాలి. అంతా బయట పడకుండా, త్వరగా జరగాలి. హోంమంత్రిని రక్షించాలి-" అన్నాడు యుగంధర్.

"అది అంత సులభమా?" అడిగాడు రాజు.

"సులభంకాదు రాజూ; సులభంకాదు; చాలా కష్టం; కానీ సాధించాలి.. తప్పదు" అన్నాడు యుగంధర్.

* * *

"మీ పథకం నాకు నచ్చలేదు యుగంధర్" అన్నాడు బండార్కార్.

"అవును; మాకూ నచ్చలేదు. యింత పెద్ద పని; దేశానికీ, ప్రపంచానికీ సంబంధించిన విషయం, మీ యిద్దరి మీదే ఆధారపడి వుండటం మాకు నచ్చలేదు" అన్నాడు ఆర్మీ చీఫ్.

"అయితే మీ సలహా ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"వార్నింగ్ సిస్టమ్ డిస్కనెక్టు చెయ్యగానే, ఆర్మీ లోపల ప్రవేశిస్తుంది; ఏర్‌ఫోర్స్ పైనుంచి బాంబులు వేస్తుంది ఆ యింటిమీద" అన్నాడు బండార్కార్.

"హోంమంత్రి సిన్హా మరణిస్తారు; అణుబాంబులు పేలుతాయి" అన్నాడు రాజు.

"ప్రవీణ్‌కుమార్ మనదేశానికి చేసిన సేవ చాలా గొప్పది. కానీ; ప్రవీణ్‌కుమార్ ఒక్కరేనా యీ దేశంలో వున్న ఎలక్ట్రానిక్ నిపుణులు; యింకా చాలామంది వున్నారు; యుగంధర్. బాంబులకి సిగ్నల్స్ అందకుండా; అడ్డు సిగ్నల్ పంపే ఏర్పాటు చెయ్యాలి. మనకి, శత్రువుల వేవ్‌లెంత్ తెలుస్తుంది" అన్నాడు ఆర్మీ చీఫ్.

"ఒక్క వేవ్‌లెంత్ మీదే ఆ సిగ్నల్స్ వెళ్తాయని ఏమిటి నిశ్చయం? మీ ఇష్టం; మీకు తోచినట్లు చెయ్యండి. దేశక్షేమం; కోటానుకోట్ల ప్రాణులక్షేమం. నేను ఒక్కణ్ణే. వాటికి బాధ్యుడ్ని కావడం నాకూ ఇష్టంలేదు" అన్నాడు యుగంధర్.

రాష్ట్రపతి గొంతు సవరించుకున్నాడు. "డిటెక్టివ్ యుగంధర్ ఆదేశాన్ని నా ఆదేశంగా పాటించమని ఆజ్ఞ యిచ్చాను. మీకు జ్ఞాపకం వుందా? ఈ విపత్తులో నుంచి దేశాన్నీ ప్రపంచాన్నీ తప్పించాలంటే; యుగంధర్ ఆదేశాన్ని పాటించడం ఒక్కటే మార్గం" అన్నాడు రాష్ట్రపతి.

ఆర్మీ ఛీఫ్, బండార్కర్ మౌనంగా వుండిపోయారు.

"ఎవరు ఏంచెయ్యాలో చెప్పండి యుగంధర్! మేమంతా అలాగే చేస్తాం!" అన్నాడు ప్రధాని.

క్షణంపాటు యుగంధర్ ఆలోచించి, "పథకం అంతా ఆలోచించి పెట్టాను; ముందు సింగ్‌మింగ్‌ని యిక్కడికి తీసుకురండి" అన్నాడు యుగంధర్.

బండార్కర్ లేచి వెళ్ళాడు.

"మీ పథకం ఏమిటి?" అడిగాడు ప్రధాని. అంతలో సింగ్‌మింగ్‌ని అక్కడకు తీసుకువచ్చాడు బండార్కర్.

"ముందు సింగ్‌మింగ్‌ని చంపేస్తాను" అన్నాడు యుగంధర్ సింగ్‌మింగ్ రావడం చూడనట్టు.

"తరువాత?" అడిగాడు ప్రధాని.

"సింగ్‌మింగ్ శవాన్ని ఆ యింటిముందుకు తీసుకు వెళతాను" అన్నాడు యుగంధర్.

"తరువాత!"

"సింగ్‌మింగ్ శవాన్ని వుపయోగించి, వార్నింగ్ సిస్టమ్ ఛేదిస్తాను" అన్నాడు యుగంధర్.

"మిష్టర్ యుగంధర్! యు ఆర్ ఎ ఫూల్. నన్ను చంపినా ఆ వార్నింగ్‌సి-" అంటున్నాడు సింగ్‌మింగ్.

"షటప్! నీతో మాట్లాడవలసిన అవసరం యిక నాకు

లేదు. సిన్హా గుండెకి, మీరు ఎలా డిప్యైజర్ కంట్రోలర్ ఏర్పాటుచేశారో నాకు తెలిసిపోయింది! మిష్టర్ బండార్కర్! తీసుకురండి పింగ్‌మింగ్‌ని-'' అని లేచాడు యుగంధర్.

''యుగంధర్! క్షణం ఆగండి; మీరు యిందాక ఏదో బేరం అన్నారు'' అంటున్నాడు పింగ్‌మింగ్ బెదురుతూ.

''ఇప్పుడిక ఏ బేరమూ లేదు'' అన్నాడు యుగంధర్.

''ప్లీజ్: వినండి; చెబుతాను. ఎలా హోంమంత్రిని....'' అంటున్నాడు పింగ్‌మింగ్.

''టైం లేదు. బండార్కర్, తీసుకురండి. పింగ్‌మింగ్‌ని త్రోవలో.... కారులో.... చెప్తాడు ఏదైనా చెప్పవలసి వుంటే....'' అంటూ యుగంధర్ అక్కడినుంచి ఒక్కడుగు ముందుకు వేశాడు.

పకపకా నవ్వు వినిపించింది.

''యూ ఫూల్! నేను ఎవర్నో చూడు; నేను పింగ్‌మింగ్‌ని కాను. నేను హోంమంత్రి సిన్హాని. చూడు!'' అంటూ విగ్గు తీసేశాడు పింగ్‌మింగ్. మీసాలు వూడపీకేశాడు. గొంతు మళ్ళీ మార్చుకున్నాడు.

ఏమిటీ ఆశ్చర్యం? విగ్గు తీసేసి, మొహం తుడుస్తే పింగ్‌మింగ్ అయ్యాడు; గొంతు మారిపోయింది. మళ్ళీ, హోంమంత్రి సిన్హాగా మారిపోయాడు. ఎన్ని పొరల మేకప్ వేసుకున్నాడు, ఎలా మనిషి యిలా మారుతున్నాడు.

''నన్ను చంపారో- ఆ బాంబులు పేలుతాయి'' అన్నాడు.

అతనెవరు? హోంమంత్రి సిన్హా? చైనీస్ దేశపు గూఢచారి పింగ్‌మింగా? అతనెవరు? ఎవరైతేనేం? ఏంచెయ్యాలి ఇప్పుడు? ఆలోచిస్తున్నాడు యుగంధర్.

(వచ్చే సంచికలో పూర్తవుతుంది)

ఈ నెల జోక్స్

ఎం. వీరాస్వామి

టీచర్ పిల్లలకు ఉత్తరం వ్రాసే విధానం బోధిస్తున్నాడు. అంతా చెప్పిం తర్వాత పిల్లలను ఉద్దేశించి-

"ఒరే గాడిదల్లారా! మీ, మీ స్నేహితులకు నే చెప్పిన విధంగా ఉత్తరాలు వ్రాసి చూపించండి" అని నీరసంతో కుర్చీలో కూలబడ్డాడు.

టీచర్ ఆర్డర్ వేయగానే పిల్లలంతా చక, చకా వ్రాయడం ప్రారంభించారు.

కాని ఓ విద్యార్థి మాత్రం తనకు పట్టనట్టుగా గమ్మున కూర్చున్నాడు.

టీచర్ చూసి, "ఏరా! నేను చెప్పింది వినబడలా?" అన్నాడు కోపంగా.

వినబడిందంటూ తలకాయ ఆడించాడు విద్యార్థి.

"మరి, ఎందుకు వ్రాయడం లేదు" గ్రుద్దురుముతూ హూంకరించాడు మళ్ళీ.

"మరే, నే నెప్పుడూ గాడిదలతో స్నేహం చేయలేదు మాష్టారూ! ఎలా వ్రాసేది మరి" అన్నాడు విద్యార్థి అయోమయంగా చూస్తూ.

టీచర్ బుర్ర గిర్రున తిరిగిపోయింది.

* * *

"ఓయ్ గుర్నాధం! మా అమ్మాయి ఒహటే మొండి పట్టు కట్టిందోయ్. తను ప్రేమించిన వాడినే పెళ్ళిచేసు కుంటానంటోంది. లేకపోతే నూతిలో దూకి చస్తానంటోంది. ఏమి చేయడానికి పాలుపోవడం లేదు" అంటూ తన గుండె ల్లోని బాధనంతా వెళ్లబోసుకున్నాడు.

"ఓస్, ఇంతేనా! ఈమాత్రం దానికే కంగారెందుకు. హాయిగా నుయ్యిని పూడ్పించేస్తేసరి."

* * *

"ఒరే, అప్పారావ్! ఓ సిగరెట్టుంటే ఇవ్వరా! మనస్సు అంతా ఎలాగో ఉంది."

"అదేంట్రా, సిగరెట్లు త్రాగడం మానేశావని విన్నానే!" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు అప్పారావు.

"నిజమేరా! కాని త్రాగటం ఎప్పుడో మానేశా."

* * *

"సిగ్గులేదురా వెధవా! ఊరికే డబ్బులడుగుతావు. నేను ఎంత కష్టపడి సంపాదిస్తున్నానో నీకేం తెలుసు. రోజుకు

పది గంటలు పనిచేస్తే కానీ మా యజమాని జీతం ఇవ్వడు'' అన్నాడు తండ్రి, కొడుకుమీద కాస్త కోపం, విసుగు ప్రదర్శిస్తూ.

కొడుకు:-నీదే అదృష్టం నాన్నా! నేను ప్రతిపైసాకు అడ్డమైన గడ్డి కరవవలసి వస్తుంది నీ దగ్గర!!

* * *

యమధర్మరాజు:-ఒరే సేవకా! సుబ్బారావు ప్రాణం తెమ్మంటే, తిమ్మారావు ప్రాణం తెచ్చావేమిట్రా.

సేవకుడు:-అది ఈ జనమకు ఈలుపడదు మహా ప్రెభో

యమధర్మరాజు:-కారణమేమిట్రా?

సేవకుడు:-సుబ్బారావు గోరు జనన మరణ మినిస్టేరు బావమరిది గోరంట. ఆయన పేణం తీసుకెళ్లేందుకు యీల్లేదనీ తిమ్మారావుగాడి పేణం ఇచ్చి పంపేరు మినిస్టేరు గోరు.

* * *

''ఒక్కరే వచ్చారేమండీ? ఇందాక ఆఫీసునుంచి ఫోన్ చేసి మీ అన్నయ్య వచ్చాడని, భోజనానికి ఇద్దరం కలిపి

వస్తాం, అన్నారుగా?" అప్పుడే ఇంట్లోకి అడుగెట్టిన భర్త నుద్దేశించి వసపిట్ట వాగినట్టుగా వాగింది భార్యామణి.

"ఈ ఒక్క పూటయినా కాస్త తృప్తిగా భోంచేద్దామని చిన్న అబద్ధం చెప్పాలే?" అన్నాడు భర్త బిక్కుబిక్కుమని చూస్తూ.

* * *

బహిరంగ సభలో ఓ నాయకుడు దీర్ఘమైన ఉపన్యాసం ఇస్తున్నాడు. మధ్యలో-

"మనదేశంలో విలయతాండవం చేస్తోన్న క్షామాన్ని రూపుమాపాలంటే, ప్రజలంతా ఏం చేయాలి....?

"మీలాంటి దొంగనాయకులను గద్దె దించాలి" అందుకున్నాడు ఓ ప్రేక్షకుడు.

* * *

ఆలస్యంగా వచ్చిన గుమాస్తాపైన మండిపడుతున్నాడు ఆఫీసరు.

అప్పుడే లోనికొచ్చిన రామారావుని చూచి-

"ఏంటోయ్, ఇంతసేపు ఎక్కడ చచ్చావ్! ఎందుకింత ఆలస్యమైంది?" అడిగాడు కర్కశమైన గొంతుతో.

రామారావు భయం భయంగా చూస్తూ, "మరండీ...., మరండీ, మా పన్నెండో అబ్బాయి ఆడుకోవడానికి బస్సు కావాలని గోలచేస్తేనూ...., కొని తెచ్చేసరికి ఈవేళ అయ్యింది" అని నసిగాడు చేతులు నలుపుకుంటూ.

దానికి ఆఫీసరు మరింత మండిపడుతూ__

"రేపు నా తలకాయ తీసుకు రమ్మంటాడు తీసుకెళ్తావా?"

"ఓ....మీరు అనుమతి ఇస్తే తప్పకుండా తీసుకెళ్తాను" అష్ట వంకర్లు తిరిగిపోతూ అన్నాడు రామారావు.

*　*　*

స్కూలు తనిఖీచేసే ఇన్స్పెక్టర్ ఇంకో పది నిమిషాల్లో వస్తాడనగా, ఐదో క్లాసు పిల్లలకు మాస్టారు ఇలా చెపుతున్నాడు.

"ఒరే, నాయనల్లారా మా బాబులుగనూ, ఈ ఒక్కసారికి నామాట వినండ్రా! నా పరువు కాపాడండి. రేపటి నుండి మీరు ఏం చేసినా నేనేమనను చాలా. అసలు మీరు ఏం చేయాలంటే, ఇన్స్పెక్టర్‌గారు క్లాసులోకి రాగానే ఏదయినా ప్రశ్నించవచ్చు. మరి ఆయన అలా ప్రశ్నిస్తే మీరు ఏమని జవాబిస్తారు, తెలియదు. కాబట్టి ఇప్పుడు నేనెలా అంటానో, అలాగే చెప్పాలి మీరంతా. ఏంటి....అర్థమయిందా?"

ఏకబిగిన మాట్లాడి, కాస్త ఊపిరి తీసుకోవడానికి ఆగాడు. అలా ఆగాడో లేదో వెనక బెంచీలో నుండి కల, కలం బయలుదేరింది.

మాష్టారు అది చూసి ఉగ్రుడయ్యాడు.

"ఒరేయ్, గాడిదా! అలాగేరా కూర్చోవడం, ఎక్కువగా వాంగావంటే నీ తోలు వలుస్తాను." అంటూ నోటికి వచ్చినట్టుగా తిట్టాడు అందుకు కారకుడయిన విద్యార్థిని.

అంతలోనే స్కూల్ ఇన్స్పెక్టర్ వచ్చాడు క్లాసులోకి. కుర్చీలో కూర్చుంటూ—

"అబ్బాయిలూ! ఇవాళ మీ మాష్టారు ఏం పాఠం చెప్పారో అది చెప్పగలరా?" అడిగాడు పిల్లలను ఉద్దేశించి.

ఇన్స్పెక్టర్ అడిగిందే తడవుగా, ఓ విద్యార్థి లేచి, "ఒరేయ్, గాడిదా! అలాగేరా కూర్చోవడం. ఎక్కువగా

హొంగావంటే నీ తోలు వలుస్తాను."

అది వింటూనే ఇన్స్పెక్టర్ కోపంతో పిచ్చివాడయ్యాడు.

"ఏమిట్రా, ఇప్పుడు నీవు కూసింది. మక్కెలిరగ తంతాను" అంటూ అబ్బాయిని కొట్టడానికి కుర్చీలోంచి లేచాడు ఇన్స్పెక్టర్.

"నేను కూయలేదు సార్! మీ రేదయినా అడిగితే, అలా చెప్పమని మాష్టారు చెప్పారు." అన్నాడు విద్యార్థి బెరుగ్గా చూస్తూ.

అప్పుడు మేస్టారుగారి అవతారం చూసి తీరాల్సిందే!

*　　*　　*

"అరె....ఏమిట్రా ఆ కట్లు చేతికి, ఎక్కడైనా ఆక్సిడెంట్ జరిగిందా ఏమిటి?" ఆశ్చర్యము, అనుమానము మిశితమైన ధోరణిలో అడిగాడు తన నేస్తంను.

"ఏంటి చెప్పన్రా బాబూ! రోడ్డుమీద వెళ్లేప్పుడు నా ముందు నల్లటి, లావాటి ఓ రాక్షసిలాంటి గర్భిణిస్త్రీ ఉందని చూసుకోక, 'అమ్మాయే పుడుతుంది, అచ్చం అమ్మలాగే ఉంటుంది' అని పాట పాడాను. అంతే; దాని ఫలితమే ఇది అంటూ విట్టూర్చాడు.

★

క్రైమ్‌లో తమాషాలు

నమ్మకం?

"దయ్యంపైన నమ్మక ముందా?"

"లేదు."

"దేవుని పైనా?"

"లేదు."

"డబ్బు పైనా?"

"లేదు."

"నీ మీదయినా నీకు నమ్మకముందాసలు?"

"లేదు."

"మరి నువ్వు దేన్ని నమ్ముతావ్? ఎందుకు బ్రతుకుతావ్?"

"నేను నమ్మేది శారదను. బ్రతికేది నీరజకోసం"

—ఎమ్. ఏ. గోపాల్, కూచనపల్లి.

"చిలుక జోస్యం"

రామారావు నడుస్తున్నాడు. అతని కాళ్లు భారంగా అడుగులేస్తున్నాయి. కానీ అతని మనస్సు మాత్రం అతనిలో లేదు. ఎక్కడో, ఎక్కడెక్కడో ప్రయాణిస్తోంది.

భగవంతుడు డబ్బుకింత ప్రాముఖ్యత ఎందుకిచ్చాడో రామారావు ఎంత ఆలోచించినా తెగని సమస్య. తనవాళ్ళందరిని సుఖపెట్టలేకపోతున్నాడు. తనవాళ్ళ కోరికలు తను తీర్చలేకపోతున్నాడు. కారణం డబ్బే.

తనకు డబ్బులేదు. తను ఓ లక్షాధికారికాడు. ఏదో ఆ ఉద్యోగంలో వచ్చే జీతం తనవాళ్ళ కడుపును కూడా నింపటం లేదు.

అయినా తన కెవరూ లేకపోతే ఎంత బావుండేది. ఉంటే తినేవాడు లేకపోతే పస్తులుండేవాడు. తను ప్రతి కుండగా కోడలిని చూడాలంటూ తనకు పెళ్ళిచేసి, ఒక వ్యక్తిని తన భాగస్వామిగా చేశాడు తన తండ్రి. ఇంకా ఆయనపోతూ పెళ్ళీడు కొచ్చిన చెల్లెలిని పై చదువుల కెదిగిన తమ్ముడిని తన కప్పగించి మరీ కన్నుమూశాడు తండ్రి.

తన కీ రోజు డబ్బు కావాలి. ఎందుకు....ఎందుకా.... కష్టపడి చెమటోడ్చి సంపాదించి ఆ సంపాదనతో తమ్ముడిని ఇంటర్ మీడియట్ చదివిస్తున్న తను ఈనాడు వాడి పరీక్ష ఫీజు కట్టకపోతే తన కష్టం అంతా వృధా! ఫైన్‌తో సహా ఈరోజే ఆఖరు.

అసలు పెద్దవాళ్ళు ఆడపిల్లలకు చిన్నతనంలోనే పెళ్ళి చెయ్యా లంటారు. అది తన చెల్లెలి విషయంలో నిజ మయింది. మనకు డబ్బులేదని, పెళ్ళిచేసే స్థితిలో లేమని వయసొచ్చిన ఆడపిల్లలలోని కోరికలు పోతాయా! చెల్లెలి లోని నిగ్రహం చెదిరింది. తనలోవున్న కోరికలకు దాసురా లైంది. ఉదయం డాక్టరు చెప్పిన విషయం.

అమ్మో! గుర్తుకుతెచ్చుకొంటేనే ఒళ్ళు గగుర్పొడు స్తోంది. దానికి....దానికి....మూడోనెల. ఇంక దానిని ఎవడు పెళ్ళిచేసుకుంటాడు....లేదు....లేదు. దానికి గర్భంపోవాలి. అంటే డబ్బు కావాలి. ఎలా వస్తుంది....అప్పు అడుగుదా మన్నా ఇచ్చే వాడెవడు.

బహుశ ఇటువంటి సమస్యలవల్లేనేమో ప్రతీమనిషి ఆత్మ హత్యకు పాల్పడతాడు. నో... నో నేను చావను. ప్రతీ మనిషికి ఈ రోజులలో చావంటే తేలికయింది. కానీ అలా చచ్చేవాడంటే నా కసహ్యం. అదో రకమైన బలహీనతని నా ఉద్దేశ్యం.

ప్రక్కకు చూశాడు. ఒకటి రెండు చిలకలనుపెట్టుకుని రోడ్డుమీద చిలక జోస్యం చెపుతున్నాడు ఒకతను.

తన జీవితం ఎలాఉందో....తను కూడా చిలక జోస్యం చెప్పించుకుంటే.

అంతే, గబగబా వెళ్ళి చాపమీద కూర్చుని పదిపైసల నాణెం పెట్టిపై పెట్టాడు. చిలకను బయటకుతీసాడు. ఏదో ఒక కాగితంతీసి వాడికి అందించింది. వాడు దానిని చదివి "ఆహా! ఏం అదృష్టమండీ! మీకు లక్ష్మీకటాక్షం త్వరలోనే ఉంది!"

రామారావు కొయ్యబారిపోయాడు. ఆ మాటలను పది సార్లు చెప్పించుకున్నాడు. తనకు లక్ష్మీకటాక్షం ఉంది. అదీ త్వరలోనే!

ఆకాశంలో విహరిస్తునట్లుగా నడవటం ప్రారంభించాడు. ఏదో ఊహాలోకాలలో తిరుగుతున్నాడు. తను త్వరలోనే లక్షాధికారి కాబోతున్నాడు. తన అదృష్టాన్ని తల్చుకుంటూ నడుస్తున్న రామారావు ఎదురుగా పరిగెత్తుకుని వస్తున్న అతన్ని గుద్దెయ్యటం, అనుకోని ఈ దెబ్బకు ఎదురుగావచ్చే అతని బ్రీఫ్‌కేస్‌తో సహా క్రిందపడటం-క్రిందపడగానే బ్రీఫ్ కేస్ తెరుచుకుంది.

అంతే, ఆ బ్రీఫ్‌కేస్ వంకచూసిన రామారావు కళ్లు మిరు మిట్లు గొల్పాయి. దాంట్లో వందరూపాయి కాగితాలకట్టలు రెండు,

డబ్బు....డబ్బు....చిలక జోస్యం మనసులో మెదిలింది. తనకు లక్ష్మీకటాక్షం ఉంది. ఇదే విధంగా తనను లక్ష్మి వరిస్తోందా!....నిజమే ఈ సమయం మించితే మళ్ళీ లక్ష్మి వరిస్తుందో? లేదో?

బ్రీఫ్‌కేస్ తీసుకుంటున్న అతని గడ్డం క్రింద ఒక్క గుద్దుగుద్ది బలంగా ఎగిరి, అతని డొక్కలలో బలంగా ఒక్క తాపు తన్నాడు.

అంతే. పాపమాతను ఉండలా చుట్టుకుని పడిపోయాడు. మరుక్షణం బ్రీఫ్ కేస్‌తో సహా పరుగెత్తడం ప్రారంభించాడు.

ఐదు నిమిషాలు పరుగెత్తిన రామారావు ముందు పోలీస్ జీప్‌వచ్చి ఆగటం, అందులోనుండి ఇద్దరు కానిస్టేబుల్స్ దిగి రామారావు చేతులలోని బ్రీఫ్ కేసుని లాక్కుని ఇన్‌స్పెక్టర్‌కు అందించి రామారావును పట్టుకున్నారు.

రామారావు ఈ హఠాత్ పరిణామానికి తెల్లబోయాడు. ఇంతలో ఇన్‌స్పెక్టర్ పెట్టి తెరచి చూచి "ఏరా బ్రూట్! నడిరోడ్డుమీదే మా కళ్ళ ఎదుట దొంగతనంచేసి మా కళ్ళలో కారం కొడతావా! పద పోలీస్‌స్టేషన్‌కి" అంటూ కానిస్టేబుల్‌కి ఆర్డరుఇచ్చిన మరుక్షణం తాను జీప్‌లో చేతికి బేడీలతో వారి మధ్య కూర్చున్నాడు. అప్పుడు గుర్తుకొచ్చింది. ఇద్దరివి తెల్లలాగూ, తెల్లచొక్కాలే అని.

మళ్ళీ రామారావు మనస్సులో చిలకజోస్యం గుర్తు కొచ్చింది. తనీ పరిస్థితికి కారణం చిలకజోస్యమే! కానీ తనకు లక్ష్మీకటాక్షం గాదు కటకటాల మోక్షం రానుందని పాపం దానికి తెలియదు.

—హెచ్. వి. ఎస్. సుబ్రహ్మణ్యం, మౌలాలి. ★


అంతరిక్ష
యాత్ర
రమణశ్రీ
INDIA

సీరియల్

(గత సంచిక తరువాయి)

చిన్‌లీ హెచ్చరిక ప్రకారం మన పరిశోధనగానీ, ప్రయోగ సన్నాహాలు కానీ మానలేదు. కాబట్టి ప్రయోగాన్ని ఆపి వెయ్యడానికి ముఖ్యమయిన మరికొందరిని చిన్‌లీ అపహరించే ప్రయత్నం చేయవచ్చు. ఆ అవకాశాన్ని వినియోగించుకొని మనం శత్రుస్థావరాన్ని కనిపెట్టాలి. సో, ఎవరికీ తెలియకుండా, కనీసం స్పేస్ సెంటర్ డైరక్టర్ మిశ్రాకు గూడా తెలియకుండా ఆ ప్రదేశమంతా స్పెషల్ పోలీస్ ఫోర్స్‌ను నియమించండి. మీకు నమ్మకమైన ఐ. డి. పార్టీ మెంబర్స్‌ను మన అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో పనిచేసే ముఖ్యులైన ప్రతి సైంటిస్ట్ వెనుక రహస్యంగా, అతనికి కూడా తెలియకుండా సంచరించమని ఆజ్ఞాపించండి.''

''అలాగే కమల్‌జీ'' వుత్సాహవంతంగా ఫోన్ అందుకున్నాడు కమీషనర్.

26

ఎయిర్ కండిషన్డ్ చేయబడిన ఆగది చల్లగావుంది.

''కమల్‌జీ! మనం ఎంత జాగ్రత్తగావున్నా, పాటిల్‌ను కోల్పోయాం. నేను చాలా విచారిస్తున్నాను. పాటిల్ ఒక సమర్థుడైన వ్యక్తేగాక అరుదైన శాస్త్రవేత్త కూడా!'' చెప్పాడు మిశ్రా.

''ఎస్. మిస్టర్ మిశ్రా! పాటిల్‌ను విడుదల చేయడానికి మా సర్వశక్తులూ కేంద్రీకరిస్తున్నాం. అంతే కాదు. ఇప్పుడు మా బాధ్యతలు మరింత అధికమయ్యాయి. రాకెట్ ప్రయోగం విఫలం చేయడానికి శత్రువులు ఎంత కయినా తెగించేటట్లున్నారు. అవసరమయితే ఈ స్పేస్ సెంటర్‌నంతా భస్మీపటలం

గావిస్తామని బెదిరించారు.''

''వాట్ కమల్‌జీ, మీరేం మాట్లాడుతున్నారో నా కర్ధం కావడం లేదు. శత్రువులు అంత విజృంభించేవరకూ మీరేం చేస్తున్నారు?''

''లేదు మిస్టర్ మిశ్రా! ఇంతవరకూ శత్రువు గురించిన స్పష్టమైన సమాచారం లభించలేదు. మేం పన్నిన వ్యూహా లన్నీ వ్యర్థమయి పోయాయి. ఏది ఏమైనా ఈసారి నేను పన్నిన వ్యూహంలో శత్రువు చిక్కుకోక తప్పదు.'' దృఢంగా అన్నాడు కమల్‌నాథ్.

''కమల్‌జీ! శత్రువులు నిజంగా పాటిల్‌ను చంపేస్తారా?'' అడిగాడు మిశ్రా.

''చెప్పలేం మిశ్రాజీ! సాధ్యమయినంత వరకూ మనం పాటిల్‌ను రక్షించడానికి ప్రయత్నించాలి. ఒకటి మాత్రం ఖాయం. ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్-1 ప్రయోగం విజయ వంతంగా జరిగేటట్లు చూడాలి.'' చటుక్కున ఆగి అనుమా నంగా అడిగాడు—

''మిస్టర్ మిశ్రా! పాటిల్ లేనంత మాత్రాన స్పేస్ షిప్ ప్రయోగానికి అవరోధమేమీ లేదు కదా?''

''లేదు కమల్‌జీ. ఆఖరికి నేను లేకపోయినా సరే, నౌక ప్రయోగం విజయవంతంగా జరుగటానికి తగిన ఏర్పాట్లు చేశాం. ఈ కేంద్రంలో సగంమంది శాస్త్రవేత్తలు అదృశ్య మయినా వ్యోమనౌక విజయవంతంగా పోవడం తప్పదు.''

''వెరీ వెల్ మిశ్రాజీ. స్పేస్‌షిప్ ప్రయోగ సన్నాహాలు ఎంతవరకూ వచ్చాయి?''

''ఫినిషింగ్ చాలవరకూ అయిపోవచ్చింది. సరిగ్గా మరో అయిదు రోజులలో నౌక ప్రయోగింపబడవచ్చు. పాటిల్ లేని లోటు కనిపించినా, కవర్ చేయడానికి ప్రయత్నిస్తున్నాం.''

"వెరీ గుడ్. గ్రౌండ్ కంట్రోల్‌కు మార్స్-2 నుండి ఏమైనా మెసేజ్ వచ్చిందా?"

"ఎలా వస్తుంది కమల్‌జీ?"

"ఐమీన్. మన వాళ్ళు అక్కడి ప్రమాదంనుండి ఏమైనా తెలివిగా విడుదలయ్యా రేమో నని...."

"సారీ కమల్‌జీ.....అలా స్వయంగా విడుదల అవడానికి అవకాశం ఎంతమాత్రం లేదు. అప్పటికీ గ్రౌండ్ కంట్రోల్ నుండి కొన్ని తీవ్రమైన ప్రయత్నాలే చేశాం. కానీ ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికీ గ్రౌండ్ కంట్రోల్‌నుండి వైర్‌లెస్ ద్వారా విరామంలేకుండా సంకేతాలు పంపిస్తూనే వున్నాం. ఒకవేళ అదృష్టముంటే మన సంకేతాలు వారికి అందవచ్చుననే ఆశతో."

"మీ ఆశ ఫలించాలనీ. మీ కృషి విజయవంతం కావాలనీ కోరుకునే వారిలో ప్రధమ్ముణ్ణి నేను." నవ్వాడు కమల్‌నాధ్.

మిశ్రా కూడా చిన్నగా నవ్వి "థాంక్యు కమల్‌జీ" అన్నాడు.

"ఇక నే వెళ్తాను మిస్టర్ మిశ్రా. కొన్ని ఎమర్జన్సీ ఎంగేజ్‌మెంట్స్ వున్నాయి" లేచాడు కమల్‌నాధ్.

మిశ్రా కూడా తన ఛెయిర్‌లోంచి లేచాడు.

అదే సమయంలో టేబిల్‌మీద ఫోను రింగయింది. రిసీవర్ అందుకొని "హల్లో....డైరక్టర్ మిశ్రా స్పీకింగ్" అన్నాడు.

అవతలనుండి "మిస్టర్ మిశ్రా. అలంకార్ జంక్షన్‌లో మీ గ్రౌండ్ కంట్రోల్ చీఫ్ సురేష్‌కుమార్ కారు పెద్ద ఆక్సిడెంట్‌కు గురయింది. వెనుక కారులో వస్తున్న యిద్దరు సెక్యూరిటీగార్డ్సు ఘోరంగా షూట్ చేయబడ్డారు. మీరు వెంటనే ఒకసారి రండి" అని వినిపించింది ఇనస్పెక్టర్ జన

రల్ ముఖర్జీ కంఠరి.

రిసీవర్ క్రెడిల్ చేసి "కమాన్ కమల్ జీ" అంటూ బయ టకు పరుగెత్తాడు మిశ్రా.

27

స్పేస్ సెంటర్‌కు చెందిన టయోటాకారు వాయువేగంతో వచ్చి అలంకార్ జంక్షన్‌లో ఆగింది.

కారులో నుండి సీక్రెట్ బ్రాంచ్ డైరెక్టర్ కమల్‌నాథ్. ఎస్. బి. డైరక్టర్ మిశ్రా వడివడిగా దిగి ముందుకు నడిచారు.

జంక్షన్‌లో సరిగ్గా నాలుగురోడ్ల కూడలిలో ఆగిపోయి వుంది కారు. కారు ముందు భాగం బాగా దెబ్బతింది. అప్ప టికే అక్కడ ఇనస్పెక్టర్ జనరల్ ముఖర్జీ కమీషనర్ నజీర్ ఖాన్ తమ తమ బృందాలతో వున్నారు.

కమల్‌నాథ్‌ను చూడగానే విష్ చేశారు ఐ. జి., కమీష నర్‌లు.

"మీకు రెండు మూడుసార్లు ఫోనుచేశాం. కానీ లైనులో మీరు దొరకలేదు."

"నేను మిశ్రా దగ్గరకు వెళ్ళాను. అసలీ యాక్సిడెంట్ ఎలా జరిగింది? మీ కెవరు చెప్పారు? వివరంగా చెప్పండి" ఆతృతగా అడిగాడు కమల్‌నాథ్.

కమీషనర్ కారు దగ్గరున్న ఓ వ్యక్తిని పిలిచాడు.

"ఇతనే కమల్‌జీ మాకు ఫోన్‌చేసింది. జరిగిన ఈ ఘోర సంఘటనను ప్రత్యక్షంగా చూసిన సాక్షులలో ఒకడు. ఇతనే మీకు వివరాలు మరోసారి చెబుతాడు. వినండి." వివరాలు మరోసారి చెప్పమన్నట్లు అతనివైపు చూశాడు కమీషనర్.

కమల్‌నాధ్ అతనివైపు పరీక్షగా చూశాడు.

కాఫీకలర్ పాంట్‌మీద వైట్‌షర్ట్ ధరించాడు. జుట్టంతా రేగిపోయి వుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి.

"నీ పేరేమిటి?" అడిగాడు కమల్‌నాథ్.

"మురుగన్."

"ఏం చేస్తుంటావ్?"

"నేషనల్ ఆర్ట్ ప్రింటర్స్‌లో కంపోజిటర్‌గా పనిచేస్తున్నాను.

"జరిగిన సంఘటన వివరంగా చెప్పు?"

చిన్నగా గొంతు సవరించుకొని చెప్పసాగాడు మురుగన్.

"ప్రెస్‌లో పని అయిపోగానే యింటికి బయలుదేరాను. ప్రెస్‌కు ఇల్లు దగ్గరే కాబట్టి మెల్లగా నడుస్తూ బయలుదేరాను. ఈ జంక్షన్‌లోకి రాగానే ఏదో పెద్ద శబ్దమయి అటువైపు చూశాను. ఏక్సిడెంట్! ఉత్తరం వైపునుండి వస్తున్న యీ కారును, పడమర దిశనుండి వస్తున్న పెద్ద ట్రక్ డాష్ యిచ్చింది. కంగారుగా ఆ స్పాట్ దగ్గరకు పరుగెత్తబోయాను. అంతలో 'ఢాం' మని శబ్దమయింది. అందరితోపాటు నేనూ నిశ్చేష్టుడై నిల్చుండిపోయాను.

అటువైపు కళ్ళు చిట్లించుకొని చూశాను. అంతే అదిరిపడ్డాను. డ్రైవర్ రక్తం మడుగులో గిలగిల కొట్టుకుంటున్నాడు. అదే సమయంలో యాక్సిడెంట్‌కు గురయిన కారు వెనకనే ఆగివున్న మరో కారులో నుండి యిద్దరు రివాల్వర్స్‌తో ముందుకు వురికారు. అంతే. ట్రక్ లోపలి నుండి యిరువురు వ్యక్తులు మెషీన్ గన్స్‌తో దూకారు.

కారులోనుండి క్రిందకు దిగిన యిరువురు వ్యక్తుల చేతిలోని రివాల్వర్స్ ఒకేసారి ప్రేలాయి. ధన్, ధన్ మంటూ. బుల్లెట్స్ ముందుకు దూసుకుపోయాయి. ఎదురువైపునుండి కెవ్వున కేక వినిపించింది. మెషీన్‌గన్స్ పట్టుకున్న వ్యక్తుల్లో ఒకడు కెవ్వున అరుస్తూ క్రిందకు కూలిపోయాడు. రెండవ వ్యక్తి కళ్ళు భగ్గున మండాయి. వెంటనే మెషీన్‌గన్ యిష్టం

వచ్చినట్లు టపటప లాడించాడు.

నే నింతవరకూ నడిరోడ్ మీద నా జన్మలో ఇంతటి ఘోరయుద్ధం చూడలేదు. ఆ తుపాకీ చప్పుళ్ళు వినలేక, ఆ ఘాతుక కృత్యంను చూడలేక కళ్ళు, చెవులు గట్టిగా మూసుకున్నాను.

ఓ నిమిషమాగి కళ్ళు తెరచి చూశాను. ఆ ప్రదేశమంతా ఏదో పొగతో నిండిపోయి వుంది. అప్పటికే చాలామంది ఆ కారుచుట్టూ గుమిగూడి పోయారు. నాకు వెంటనే కర్తవ్యం గుర్తుకువచ్చి కంట్రోల్ రూంకు ఫోన్ చేశాను. ఫోన్ చేసి, ప్రమాదం జరిగిన స్పాట్ దగ్గరకు వెళ్ళాను. అక్కడి దృశ్యం చూడగానే నా గుండె చెదరిపోయింది. వెనుక కారులోనుండి దిగిన యిద్దరు వ్యక్తులు, ముందు కారుడ్రైవర్ రక్తం మడుగులో చచ్చిపోయివున్నారు. ముందుకారు వెనుక సీట్లో వ్యక్తి స్పృహతప్పి పడిపోయి వున్నాడు. కారును ఎటాక్ చేసిన ట్రక్ వెళ్ళిపోయింది. ట్రక్ లోంచి దిగినవాడి శవాన్ని గూడా తీసుకు వెళ్ళిపోయినట్లున్నారు. ఫోన్ చేసిన ఐదు నిమిషాలలో పోలీసులు వచ్చేశారు. ఆ తరువాత జరిగిందంతా వారే చెబుతారు'' ముగించాడు మురుగన్.

''థాంక్యూ మిస్టర్ మురుగన్'' కృతజ్ఞతలు వెల్లడించాడు కమల్ నాధ్.

''రండి. స్పాట్ లోకి వెళ్దాం,'' ముందుకు దారి తీశాడు ముఖర్జీ.

అక్కడి దృశ్యం చూడగానే కమల్ నాధ్ గుండె కూడా చెదరిపోయింది. సురేష్ కుమార్ కారు ప్రక్కనే ఆ కారు తాలుకు డ్రైవర్ వేషంలో వున్న సెక్యూరిటీగార్డ్ నేలమీద వెల్లకిలా పడిపోయి వున్నాడు. అతని గుండెలో రెండు బుల్లెట్లు దిగాయి. ఇంకా రక్తం స్రవిస్తూనే వుంది. ఆ

కారుకు వెనుకే ఆగివున్న మరో కారు ప్రక్కన యిద్దరి వ్యక్తుల శవాలు దారుణంగా పడివున్నాయి. ఒంటి నిండా మెషీన్‌గన్స్ చేసిన తూట్లు. వాళ్ళ కిరాతకానికి ఒక్కసారి ఒళ్లు జలదరించి ఆ వెంటనే శరీరం కోపంతో బిరుసెక్కింది.

కారు వెనుకసీటులో వాలిపోయివున్నాడు సురేష్‌కుమార్. పోలీసు డాక్టర్ అతనికి స్పృహ రావడానికి ఇంజక్షన్ చేసి. రిజల్టుకోసం మొహంలోకి దీక్షగా చూస్తున్నాడు. ఎస్. పి. డైరక్టర్ మిశ్రా ఆతృతగా సురేష్‌కుమార్‌వైపు చూస్తున్నాడు. మిశ్రాముఖంలో ఆందోళన ఛాయలు ప్రస్ఫుటంగా స్పందిస్తున్నాయి.

క్రింద పడివున్న మూడు శవాలను మార్చురీకి తరలించమని సిబ్బందిని ఆజ్ఞాపించాడు ముఖర్జీ.

అంతలో ఓ కానిస్టేబుల్ ఏదో వస్తువు తీసుకుని కమీషనర్ వద్దకు పరుగెత్తుకు వచ్చాడు.

"సార్. ఇది సురేష్‌కుమార్ గారి కారువద్ద దొరికింది" అంటూ ఆ వస్తువుని కమీషనరుకు అందించాడు.

కమీషనర్ దానివైపు పరీక్షగా చూశాడు. అది ప్రేలకుండా వుండిపోయిన నాటు బాంబు. లోపల మెటీరియల్ సరిగా అమరక ప్రేలలేదు. కొంచెం కాలిపోయి. ఆరిపోయివుంది. ఆ బాంబ్ అవశేషాన్ని కమల్‌నాథ్‌కు అందించాడు.

కమల్‌నాథ్ దాని ఒకసారి పరిశీలించి ఎక్స్‌ప్లోజివ్ స్పెషలిస్ట్‌కి అందించాడు.

"వాట్ కమల్‌జీ. ఈ ఆక్సిడెంట్‌పై మీ వుద్దేశ్యం?" అడిగాడు కమీషనర్ చిన్నగా.

"ఆ దుండగులు సురేష్‌కుమార్‌ని కూడా ఎత్తుకుపోవడానికి ప్రయత్నించారు. సరిగ్గా పాటిల్ కారులానే దీన్ని

కూడా మాయం చేద్దామనే అనుకొని వుంటారు. అయితే ఈ కారు వెనుకగూడా మన సెక్యూరిటీ రావటంతో వారి ప్లాను విఫలమయ్యింది."

"అయితే కమల్‌జీ. వారు సురేష్‌కుమార్‌ను ఎందుకు అపహరించుకు పోలేదు? అతని అపహరణ కోసమే ముగ్గురి సెక్యూరిటీ ఆఫీసర్లను హతమార్చారా?" అడిగాడు కమీషనర్ నజీర్‌ఖాన్.

ఓ నిముషం ఆలోచించాడు కమల్‌నాధ్.

"కరక్టు! వాళ్లు వచ్చింది సురేష్‌కుమార్ని అపహరించడానికి. అతన్నికూడా అపహరించి పాటిల్ ప్రాణాలను, అతని ప్రాణాలనుకూడా జోడించి బేరమాడదామని భావించి వుంటారు. అయితే యిక్కడ వాళ్ళు వూహించని విధంగా సెక్యూరిటీగార్డ్సు ఎదురవటంతో ప్లాన్ కొంచెం బెడిసి కొట్టింది. ముందు డ్రైవర్ని హతమార్చారు. తరువాత ఆ యిద్దర్నీ హతమార్చేలోగా, మన ఏజంట్ కాల్పులకు వారిలో ఒకడు బలయిపోయాడు. ఇక దాంతో శత్రువుకు కొంచెం గుండె జారిపోయింది. వెంటనే ఒక దృఢమైన నిర్ణయానికి వచ్చి వుంటాడు. అతని ధ్యేయం సురేష్‌కుమార్‌ని ఎత్తుకు పోయినా, మనం అతని కోర్కెలకు అంగీకరించక పోతే చంపేయడమేగా! అదీగాక గ్రౌండ్ కంట్రోల్ ఛీఫ్ సురేష్ కుమార్ మరణిస్తే స్పేస్‌షిప్ ప్రయోగం నిరవధికంగా ఆగి పోవచ్చునన్న దుర్బుద్ధితో వాళ్లు నాటుబాంబును యిలా కారు మీదకు వేసి వెళ్ళిపోయారు.

"ఐతే అదృష్టవశాత్తు ఆ నాటుబాంబు ప్రేలలేదు. కొంచెం మండి వూరుకుంది. దాంతో సురేష్‌కుమార్ ప్రాణాలు రక్షింపబడ్డాయి." విపులంగా చెప్పాడు కమల్‌నాధ్.

"మీ వూహాగానం రియల్లీ కరెక్టు కమల్‌జీ. లేకపోతే

యీ సరికి సురేష్‌కుమార్ కూడా మనకు దూరమయి వుండే వాడు'' అన్నాడు కమీషనర్.

''మిస్టర్ నజీర్‌ఖాన్'' ప్రక్కకు పిలిచి చెవిలో అడిగాడు కమల్‌నాథ్.

"నేను చెప్పిన ఏర్పాట్లు సవ్యంగా చేశారా?''

''ఆల్‌రైట్ సార్! మంచి పగడ్బందీగా చేశాను. స్పేస్ సెంటర్‌లోని శాస్త్రవేత్తల్ని అనుక్షణం కనిపెట్టుకుండమని ఐ. డి. పార్టీ మెంబర్లని ఆదేశించాను.''

"మరి సురేష్‌కుమార్ వెనుక ఎవరినైనా నియమించారా?"

''ఆఁ....సుకుమార్ అనే సి.ఐ.డి., ఎస్.ఐ.ని సురేష్ కుమార్‌ని కనిపెట్టుకుండమని ఆదేశించాను. ఈ విషయం సురేష్‌కుమార్‌కి గాని, మిశ్రాజీకిగాని తెలియదు.''

''వెరీగుడ్, మరి అతను శత్రువుల నేమన్నా వెంబడించాడా?''

''ఎస్ కమల్‌జీ, ఇలా ఓ ఘోర సంఘటన జరిగిందని, సురేష్ కుమార్‌ని హత్య చేయడానికి శత్రువులు ప్రయత్నించారని, తను రహస్యంగా శత్రువుల్ని వెంబడిస్తున్నానని, శత్రువుల సమాచారం అందగానే తెలియజేస్తానని నాకు కోడ్‌లో మెసేజీ అందజేశాడు.'' సంతోషంగా చెప్పాడు కమీషనర్.

కమల్‌నాథ్ ముఖం ఒక్కసారి ఆనందంతో ప్రఫుల్లిత మయింది.

''వెల్డన్ కమీషనర్‌జీ వెల్డన్! ఈసారితో శత్రువుల బండారమంతా బహిర్గత మవుతుంది. మరేం ప్రమాదంలేదు. మనం సనాల్‌చేసిన గడువులోపల ఆ చిన్‌లీని బంధించి పాటిల్‌ను ప్రాణాలతో విడిపించుకోవచ్చు.'' సంతోషంగా అన్నాడు కమల్‌నాథ్.

అంతలో ముఖర్జీ వచ్చి "కమల్ జీ, సురేష్ కుమార్‌కు స్పృహ వచ్చింది" అని చెప్పాడు.

గబగబా కారు దగ్గరకు నడిచాడు కమల్‌నాథ్, కమీషనర్‌లు.

సురేష్‌కుమార్ బాక్ సీట్‌లోనే పడుకుని కళ్ళు తెరచి అయోమయంగా అందరివైపు చూస్తున్నాడు.

"మిస్టర్ సురేష్‌కుమార్, మిస్టర్ సురేష్‌కుమార్" ఆతృతగా పిలిచాడు అప్పటి వరకూ ఆందోళనగా చూస్తున్న మిశ్రా.

ఒక్కసారి వులిక్కిపడి ఘటుక్కునలేచి కూర్చున్నాడు సురేష్ కుమార్. అతని కళ్ళు అందరివైపు వింతగా చూశాయి.

అతని దృష్టి మిశ్రామీద పడి నిలిచిపోయింది.

"బాస్? ఏం జరిగింది? ఇంతమంది యిక్కడ వున్నారేమిటి? నాకేమిటి! అదోలా వుంది?" గబగబా ప్రశ్నల వర్షం కురిపించాడు.

"మిస్టర్ సురేష్‌కుమార్, విదేశీ గూఢచారులు నిన్నపహరించడానికి ప్రయత్నం చేశారు. అది విఫలం కావడంతో నిన్ను హత్య చేయడానికి కూడ ప్రయత్నించారు. దైవ వశాత్తు అది కూడా విఫలం అయింది." గంభీరంగా చెప్పాడు.

"మైగాడ్! ఇంతటి ప్రయత్నం జరిగిందా? ఈ కారులో ఒక సెక్యూరిటీగార్డు కారు వెనుక మరో యిద్దరు సెక్యూరిటీ గార్డ్స్ వున్నారుకదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నీ ప్రాణం కాపాడటంకోసం ఆ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు మిస్టర్ సురేష్ కుమార్" చెప్పాడు మిశ్రా.

"వాట్?" ఆశ్చర్యపోయాడు సురేష్‌కుమార్. అతని

కళ్ళ వెంబడి జలజలా కన్నీళ్ళు క్రిందకు రాలాయి.

"తుచ్ఛమయిన నా యీ ప్రాణాలకోసం ఓ ముగ్గురు దేశభక్తులు చనిపోయారన్నమాట!" గద్గద కంఠంతో అన్నాడు.

"కమీషనర్, పేషెంట్ ఓ రెండు రోజులు హాస్పిటల్‌లో వుండటం మంచిది." సలహా చెప్పాడు పోలీస్ డాక్టర్.

ఆమాట వినగానే ఆందోళనగా అన్నాడు సురేష్‌కుమార్.

"నో. డాక్టర్. నో. అయామ్ ఆల్‌రైట్! నేను వెంటనే లాబ్‌కు వెళ్ళాలి. అక్కడ నేను నిర్వర్తించవలసిన పనులు చాలా వున్నాయి. నాకేం ఫర్వాలేదు. కావాలంటే అక్కడకు వచ్చి ట్రీట్‌మెంట్ యివ్వండి."

కమీషనర్, డాక్టర్, మిశ్రావైపు చూశారు.

"అవును డాక్టర్. సురేష్‌కుమార్‌తో లాబ్‌కు చాలా పని వుంది. ఆదీగాక అతను పాటిల్ లేని కొరతను కొంత తీరుస్తాడు. స్పేస్‌షిప్ ప్రయోగ సన్నాహాలకు సురేష్‌కుమార్ ముఖ్యం." చెప్పాడు మిశ్రా.

"ఆల్‌రైట్ డాక్టర్. సురేష్‌కుమార్ అంగీకరిస్తున్నాడు కాబట్టి అతనిని లాబ్‌కు పంపండి. మీరు తరుచూ అక్కడకు వచ్చి ట్రీట్‌మెంట్ యివ్వండి" చెప్పాడు కమల్‌నాథ్.

"ఆల్‌రైట్ సర్!" అంగీకరించాడు పోలీస్ డాక్టర్.

"మిస్టర్ మిశ్రా, సురేష్‌కుమార్‌ని జాగ్రత్తగా తీసుకు వెళ్ళి మనం వచ్చిన కారులో కూర్చోబెట్టండి. లాబ్‌కు తీసుకువెళదాం" అన్నాడు కమల్‌నాథ్.

"అలాగే కమల్‌జీ," అంటూ కారులోంచి దింపి కారులో ఎక్కించాడు మిశ్రా.

"మిస్టర్ కమీషనర్! మేం కారులో లాబ్‌కు వెళతాం. ఈలోగా మీరు మరికొన్ని వివరాలు సేకరించండి," కార్తు

స్టార్ట్‌చేస్తూ చెప్పాడు కమల్‌నాథ్.

"అలాగే కమల్‌జీ" చిన్నగా నవ్వాడు కమీషనర్.

కారు వేగంగా లాబ్‌వైపు బయలుదేరింది. సురేష్ కుమార్ జరిగినదంతా మిశ్రాకి వివరించి చెబుతున్నాడు.

"మిస్టర్ మిశ్రా. సురేష్‌కుమార్ గ్రౌండ్ కంట్రోల్ వదిలి బయటకు ఎందుకు వెళ్ళవలసి వచ్చింది" అడిగాడు కమల్‌నాథ్ డ్రైవ్‌చేస్తూనే.

"మీ సూచన ననుసరించి ముఖ్యమైన శాస్త్రజ్ఞుల నెవ్వరినీ గ్రౌండ్ కంట్రోలు రూం. లాబ్‌దాటి బయటకు పోనీయటంలేదు. కానీ ఇటీవలనే సరిగా సురేష్‌కుమార్ లాబ్‌లో లాండింగు పాడ్‌వద్దకు వెళ్ళవలసివచ్చింది. నాతో చెప్పి బయలుదేరాడు సురేష్‌కుమార్. నేను అతని భద్రతకు మీ సూచన ప్రకారం గట్టి బందోబస్తు చేశాను. కారు డ్రైవర్‌గా సెక్యూరిటీగార్డ్‌ను నియమించాను. కారు వెనకగా ఇరువురు సెక్యూరిటీగార్డ్‌లు వెళ్లే ఏర్పాటుచేశాను. కానీ అనుకోకుండానే ఈ సంఘటన జరిగిపోయింది." విచారంగా చెప్పాడు మిశ్రా.

"నెవర్ మైండ్ మిస్టర్ మిశ్రా. జరిగిన దానికి విచారించకండి. ఇక ముందు భద్రతాచర్యలను మరింత పటిష్టంగా గైకొనండి. అయినా చిన్‌లీ ఆటలు ఇక ఎంతోకాలం కొనసాగవు. త్వరలోనే అతన్ని బంధించటానికి నేనుచేసిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి" హామీ యిచ్చాడు కమల్‌నాథ్.

"థాంక్యూ మిస్టర్ కమల్‌నాథ్" సంతోషంగా అన్నాడు మిశ్రా.

సురేష్‌కుమార్ సీటుకు చేరగిలబడి కూర్చుని కళ్లు మూసుకుని వున్నాడు. అయిదు నిముషాల్లో కారు స్పేస్ సెంటర్ ముందు ఆగింది.

28

పోలీస్‌స్టేషన్ కంట్రోల్ రూంలో కూర్చొనివున్నారు కమీషనర్ నజీర్‌ఖాన్, సీక్రెట్ బ్రాంచ్ డైరెక్టర్ కమల్‌నాథ్. వారిద్దరిచూపులూ టేబుల్‌మీదవున్న టెలిఫోన్ పైనే కేంద్రీకరింపబడివున్నాయి.

సురేష్‌కుమార్ కారు ఆక్సిడెంట్ జరిగి ముప్పయిగంట లవుతుంది. ఏ క్షణంలోనైనా సరే. ముప్పయిగంటల క్రితం దుండగులను అన్వేషిస్తూవెళ్ళిన ఇన్వెస్టిగేషన్ డిపార్టు మెంట్ సబిన్స్‌పెక్టర్ సుకుమార్ ద్వారా దుండగుల స్థావరం గురించిన వివరాలు తెలియవస్తాయేమోనని ఆతృతగా ఎదురు చూస్తున్నారు అధికారు లిద్దరూ.

వందమంది స్పెషల్ ఏజంట్లతో సహా సెక్యూరిటీ సిబ్బంది యావత్తూ ట్రక్కులో, వాన్స్‌లో రెడీగా వున్నారు.

సుకుమార్ దగ్గరనుండి దుండగుల స్థావరం గురించిన సమాచారం రావడమే ఆలస్యం. ఆ స్థావరంపై విరచుకు పడటానికి సిద్ధంగావున్నారు సెక్యూరిటి సిబ్బంది. అధికారుల ఆదేశాలకోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారంతా.

టేబుల్‌మీద ఫోన్ 'గణగణ' మంటూ మ్రోగింది. కుర్చీలోంచి కమిషనర్, కమల్‌నాథ్ ఒకసారి లేచి ఫోన్ దగ్గరకు నడిచారు.

నజీర్‌ఖాన్ ఫోన్ అందుకొని "ఎస్, కమిషనర్ స్పీకింగ్!" అన్నాడు గంభీరంగా.

"పెట్రోలింగ్ స్క్వాడ్ నెంబర్ టూ సార్జంట్‌గోపాల్ రిపోర్ట్‌సార్!" అవతలనుండి వినబడింది.

ఒక్కసారి నిరుత్సాహపడిపోయాడు కమిషనర్.

"వాట్? వాట్ హేపెండ్ మిస్టర్?" విసుగుగా అడిగాడు.

"ఘాట్‌వద్ద ఓ శవం పడివుంది సార్! మొఖమంతా ఘోరంగా చెక్కేసి వుంది."

"అయితే వెంటనే మార్చ్యురీకి పంపించు" కోపంగా చెప్పాడు.

"మాకు ఒక అనుమానంవచ్చి ఆ శవాన్ని కదల్చకుండా వుంచేసాం సార్. ఆశవం చేతిమీదవున్న 'పచ్చ' ఆధారంగా రాకెట్ సెంటర్‌గ్రౌండ్ కంట్రోల్ చీఫ్ సురేష్‌కుమార్‌దిగా భావిస్తున్నాం సార్!"

"వాట్?" అదిరిపడ్డాడు నజీర్‌ఖాన్.

"మిష్టర్ గోపాల్, సురేష్‌కుమార్ గ్రౌండ్ కంట్రోల్ రూంలో సురక్షితంగా వున్నాడు. పొరబాటుపడ్డావేమో సరిగ్గా గమనించు."

"లేదు సార్! ముఖం ఆనవాలు లేకుండా చెక్కేయబడినా, చేతిమీద పచ్చబొట్టు స్పష్టంగా కనబడుతోంది సార్!"

"ఆల్‌రైట్! మేం వెంటనే అక్కడకు వస్తున్నాం" రిసీవరు క్రెడిల్‌చేసి కమల్‌నాధ్ వైపు చూశాడు కమిషనర్.

"వాట్ కమీషనర్‌జీ, ఏం జరిగింది?" కంగారుగా అడిగాడు కమల్‌నాధ్.

"ఘాట్‌వద్ద ఓ శవం కన్పించిందట పెట్రోలింగ్ స్క్వాడ్‌కు, ఆ శవం చేతిమీద సురేష్‌కుమార్ పేరు 'పచ్చబొట్టు' ద్వారా పొడవబడి వుందట! మొహంమాత్రం గుర్తుపట్టలేనంతగా చెక్కేయబడి వుందట!" చెప్పాడు కమిషనర్,

"ఈజిట్?" ఆశ్చర్యంగా చూశాడు కమల్‌నాధ్.

అతని తల గిర్రున తిరిగిపోతోంది! సురేష్‌కుమార్ చేతిమీద వున్న పచ్చబొట్టు తననేకసార్లు చూశాడు. సందేహం లేదు. ఆ శవం సురేష్‌కుమార్‌దే ననడం! మరి తాము రక్షించిన సురేష్‌కుమార్ అప్పుడే దుండగుల చేతికి ఎలా

చిక్కాడు? సాధ్యమయినంత వరకు గ్రౌండ్ కంట్రోల్ సెంటర్‌ను వదల వద్దని హెచ్చరించినా సురేష్‌కుమార్ బయటకు ఎలా వచ్చాడు? ఇంతకూ యీ విషయం మిశ్రాకు తెలిసిందా?

"మిస్టర్ నజీర్‌ఖాన్, ఇదంతా చాలా తికమకగా వుంది. ఏ విషయం వూహకు అందడం లేదు. పదండి. ఒకసారి వెళ్ళి ఆ శవాన్ని చూసి వద్దాం." బయటకు నడుస్తూ అన్నాడు కమల్‌నాథ్.

కొద్ది క్షణాలలోనే జీప్ హత్యా ప్రదేశానికి బయలు దేరింది.

29

జీప్ ఘాట్ వద్దకు వచ్చి ఆగింది. జీప్‌లోంచి కమల్‌నాథ్, కమిషనర్ క్రిందకు దిగారు.

సార్జంట్ గోపాల్ వారికి ఎదురొచ్చి విష్‌చేసి శవంవున్న ప్రదేశం దగ్గరకు తీసుకువెళ్ళాడు.

రెండు పెద్దపెద్ద రాతిబండల మధ్యలో పడివుంది శవం వెల్లకిలా. మొఖమంతా కత్తితో చదునుగా చెక్కేశారు.

వికృతంగా వున్న ఆ శవాన్ని చూడలేకపోయారు అధికారు లిద్దరూ. కమల్‌నాథ్ శత్రువుచేసిన యీ ఘాతుకానికి లోలోపల మండిపోతున్నాడు. శవం దగ్గరకు వెళ్ళి చేయిమీద పరిశీలనగా చూశాడు. పేరు, ఊరు, చక్కగా పచ్చబొట్టులో కనబడుతోంది.

"కమల్‌జీ ముఖం గుర్తుపట్టడానికి వీలులేకపోయినా, శవం ఒడ్డూ, పొడుగూ పరిశీలిస్తే సురేష్‌కుమార్‌దే యీ శవమని తెలిసిపోతుంది." అన్నాడు కమిషనర్ నజీర్‌ఖాన్.

"ఎస్, మిష్టర్ నజీర్‌ఖాన్! ఈ శవం సురేష్‌కుమార్‌ది అనడంలో సంధేహంలేదు!" అన్నాడు కమల్‌నాథ్,

''అయితే ఏంచేద్దాం కమల్‌జీ?'' ప్రశ్నార్థకంగా చూశాడు నజీర్‌ఖాన్.

''శవాన్ని పోస్టుమార్టంకు పంపించండి. ఇకపోతే యింత వరకు మిశ్రాగారికి యీ విషయం తెలుసో, తెలియదో? కాబట్టి మనం ఓసారి రాకెట్ సెంటర్‌కు వెళ్ళి మిశ్రాగారిని కలుద్దాం," చెప్పాడు కమల్‌నాధ్.

''ఆల్‌రైట్ కమల్‌జీ! ఈలోగా యిక్కడి విశేషాలు సేకరించి విచారణ ప్రారంభించమని ఆదేశాలిస్తాను'' అంటూ ఫోటోగ్రాఫర్‌కు, వేలిముద్రలనిపుణునికి, సార్జంట్ గోపాల్‌కు గబగబ వారి కర్తవ్యాలను ఆదేశించాడు.

''పదండి కమల్‌జీ, రాకెట్ సెంటర్‌కు వెళదాం!'' జీప్ ఎక్కి స్టార్ట్‌చేశాడు కమిషనర్. కమల్‌నాధ్ కూడా జీప్ ఎక్కాడు.

మరుక్షణం జీప్ రాకెట్ సెంటర్‌వైపు కదిలింది.

30

''మీరు చెప్పేది నాకర్థం కావడంలేదు'' రాకెట్ సెంటర్ డైరెక్టర్ మిశ్రా అయోమయంగా అన్నాడు.

''నేను చెప్పేది నిజం మిష్టర్ మిశ్రా! గ్రౌండ్ కంట్రోల్ చీఫ్ సురేష్‌కుమార్ శవం మాకు ఘాట్‌వద్ద లభించింది. దుండగులు ముఖమంతా చెక్కేసి చాలా ఘోరంగా హత్య చేశారు'' దృఢంగా చెప్పాడు కమల్‌నాధ్.

అదిరిపడ్డాడు మిశ్రా! మరుక్షణంలోనే ఉగ్రుడయ్యాడు.

''మిష్టర్ కమల్‌నాధ్! ఇంతమంది మీ బ్రాంచ్ ఏజంట్లు, పెద్ద పోలీస్ బలగంవున్న కమిషనర్ యిక్కడ వుండగానే హత్య జరిగిందంటే మీకు సిగ్గుచేటుగా లేదూ? పాటిల్ అదృశ్యమే మాకు తీరని లోటు అనుకొంటుంటే ఇప్పుడు

సురేష్‌కుమార్ మరణం శరాఘాతం వంటిది. అతను తన వెంట తీసుకు వెళ్ళిన లూపింగు ట్యూబ్స్ ఎంతో విలువైనవి. అసలు మీ సెక్యూరిటీ సిబ్బందిని నమ్ముకుని సురేష్‌కుమార్ని బయటకు పంపడం నాదే బుద్ధితక్కువ!" కోపంగా అన్నాడు రాకెట్ సెంటర్ డైరెక్టర్ మిశ్రా.

కమిషనర్, కమల్‌నాధ్‌లు ఏమీ మాట్లాడలేదు. తలవంచుకొని నిల్చుండిపోయారు.

"కమల్‌నాధ్, ఒక్క సురేష్‌కుమార్ శవమే మీకు కన్పించిందా? సురేష్‌కుమార్ సెక్యూరిటీగా పంపిన మీ సిబ్బంది ఏమయ్యారు. వారు ప్రాణాలతోనే వుండి మీకు రిపోర్ట్ చేశారా?" అడిగాడు మిశ్రా.

"మిష్టర్ మిశ్రా, జరిగిందేమిటో నిదానంగా చెప్పండి. అసలు సురేష్‌కుమార్ ఎప్పుడు బయలుదేరాడు యిక్కడి నుండి? ఎక్కడకు బయలుదేరాడు? ఎందుకు బయలుదేరాడు? అతనికి మీరు గావించిన సెక్యూరిటీ ఏర్పాట్లు ఏమిటి? జాగ్రత్తగా గుర్తుతెచ్చుకొని చెప్పండి."

చిన్నగా నిట్టూర్చి అన్నాడు మిశ్రా.

"ఏం చెప్పమంటారు కమల్ జీ. సురేష్‌కుమార్ బయలుదేరి సరిగ్గా గంట కూడా కాలేదు, అప్పుడే యింత ఘోరం జరుగుతుందని కలలో గూడా వూహించలేదు. లాంచింగ్ పాడ్ వద్ద పాటిల్ మిస్ అవడంతో, ఆ బాధ్యత సురేష్‌కుమార్ స్వీకరించవలసి వచ్చింది. ఒక గంట క్రితమే రాకెట్‌లో ముఖ్యభాగాలయిన 'లూపింగ్ ట్యూబ్స్'ను తీసుకొని వాటిని రాకెట్‌లో ఫిక్స్ చేయడం కోసం లాంచింగ్ పాడ్‌కు వెళతానన్నాడు. నేను వెంటనే అతని కారులో యిద్దరు, కారు వెనక మరో కారులో ముగ్గురూ సెక్యూరిటీ గార్డ్స్ వుండేటట్లు ఏర్పాటు చేశాను"

చెప్పాడు మిశ్రా.

ఈసారి అదిరిపోవడం కమిషనర్ కమల్‌ల వంతయింది.

"వాట్? సురేష్‌కుమార్ గ్రౌండ్ కంట్రోల్ నుండి బయలుదేరి గంట గూడా కాలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు కమిషనర్.

కమల్‌నాథ్ బుర్ర తిరిగిపోతోంది। హత్యాప్రదేశం దగ్గర శవాన్ని పరిశీలించిన డాక్టర్ మరణం సంభవించి దాదాపు ఇరవై గంటలవుతుందని చెప్పాడు. అంటే సురేష్‌కుమార్ చచ్చిపోయి ఇరవై గంటలయిందని డాక్టర్ రిపోర్టు. మరి మిశ్రీ చెప్పిన ప్రకారం సురేష్‌కుమార్ గ్రౌండ్ కంట్రోల్ నుండి బయలుదేరి గంట గూడాకాలేదు. ఇదెలా సంభవం? ఇరవై గంటల క్రితం చనిపోయిన సురేష్ గంట క్రితం లూపింగ్ ట్యూబ్స్ తీసుకు వెళ్ళడం ఎంతవరకు సంభవం?

హఠాత్తుగా కమల్‌జీ మనసులో ఓ వూహ మెరిసింది.

"మిష్టర్ మిశ్రా. సురేష్‌కుమార్ లాంచింగ్‌పాడ్ చేరుకున్నాడో, లేదో ఫోన్ చేయండి" అన్నాడు.

ఆశ్చర్యపోయాడు మిశ్రా. "అదేమిటండీ కమల్‌జీ, సురేష్‌కుమార్ చచ్చిపోయాడని, అతని శవం మాకు లభించిందని మీరే అన్నారు. మళ్ళీ సురేష్ లాంచింగ్ పాడ్ చేరాడేమో కనుక్కోమంటారేమిటి? మీకేమన్నా మతి చలించిందా?"

"లేదు మిష్టర్ మిశ్రా, మతి యిప్పుడే ఆలోచించడం ప్రారంభించింది" అంటూ గబగబ ఫోన్ దగ్గరకు నడిచి లాంచింగ్‌పాడ్‌కు డయల్ చేశాడు. వెంటనే అక్కడినుండి రిప్లై వచ్చింది, 'సురేష్‌కుమార్ అసలు అక్కడికి రాలేదని.'

(సశేషం)

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల 10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా వ్రాయవచ్చును.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు "హోమ్ డెలివరీ" పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు చొప్పున నగదు బహుమతి పంపుతాము. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) ఏప్రిల్ '75 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

అంతం చూసే ఆరాటం!

ఆకాశంలో పోరాటం!!

పంపినవారు: శ్రీ కె. జ్యోతి సరస్వతి, హోం. డె. నెం-131, శ్రాఫ్-ఏజెంట్, బ్యాంక్ ఆఫ్ బరోడా, మెయిన్ రోడ్, కాకినాడ-1.

(2) ఏప్రిల్ '75 నెల "సప్లిమెంట్" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

అరవడానికి నోరు లేదు!

అరచి మరి ప్రయోజనం లేదు!!

పంపినవారు: శ్రీ కాసారపు సంజీవయ్య, హోం. డె. నెం-595, పోచమ్మవాడ, జగిత్యాల (కరీంనగర్ జిల్లా.)

లేఖలు

ప్రభాకర్‌గారి ముఖచిత్రాలు ప్రతి నెలనెలా క్రొత్త అందాలు పులుముకుంటున్నవి. కొమ్మూరి సాంబశివరావు గారి '10 గంటలసేపు ప్రపంచానికే ప్రమాదం' సీరియల్ పత్రిక కొక ముఖ్య ఆకర్షణ. అంతరిక్షయాత్ర, ఖైదీ సీరియల్స్ ఒక దానితో నొకటి పోటీపడుతున్నవి. ఈ నెల జోక్స్. క్రైమ్‌లో తమాషాలు, చివరిపేజి వినోదం మమ్మల్ని కడుపుబ్బ నవ్విస్తున్నాయి. ''సప్లిమెంట్'' లోని నవలలు మళ్ళీ మళ్ళీ చదవాలన్పించే విధంగా ఉన్నవి. మీ యొక్క అపారమైన కృషికి మా ప్రత్యేకాభినందనలు.

—సి. సత్యనారాయణ, రుద్రూరు.

డిటెక్టివ్ సాహిత్యాన్ని విమర్శించే పెద్ద మనుషులకు "అపన"లోని కథలూ, ఫీచర్సు కనువిప్పు కలిగించి తీర్తాయి. 'పరిష్కారం' కథ చదివాక, దాని ఎండింగ్ షాక్ నించి త్వరగా తేరుకోలేకపోయాను. అంత మంచి కథ పటుత్వమైన శైలిలో రాసిన 'రమణశ్రీ' అభినందనీయుడు.

—కాసారపు సంజీవయ్య, జగిత్యాల.

కొమ్మూరి సాంబశివరావుగారి కలంనుండి ధారాళంగా వెలువడుచున్న '10 గంటలసేపు ప్రపంచానికే ప్రమాదం' సీరియల్ చాలా హుషారుగా నడుస్తుంది. 'ఈ నెల జోక్స్' చదివిన తర్వాత మేము నవ్వు ఆపుకోలేకపోయాము. ఈ శీర్షిక ''అపన''కే హైలైట్. చక్కటి కథలను, సీరియల్స్‌ను, క్రొత్తక్రొత్త శీర్షికలను అందిస్తున్న సంపాదకు

లకు మా హృదయపూర్వక అభినందనలు.

—న్యాయపతి రమేష్‌బాబు, బరంపురం-1.

ఈ నెల పత్రికలు రెండూ అద్భుతంగా ఉన్నాయి. ''అపన''లోని కథలు అన్నీ బాగున్నా 'ద్రోహి' 'సర్వాంతర్యామి' నన్నెక్కువగా ఆకర్షించాయి. 'అంతరిక్షయాత్ర', 'ఖైదీ' సీరియల్స్ కొరకు ఒక నెల పొడుగునా ఎదురు చూడాలంటే చాలా బాధ కలుగుతోంది. ప్రేయసికై ఎదురు చూచే ప్రియునిలా ఎదురు చూస్తుంటాను. ''సప్లిమెంట్'' లోని నాలుగు నవలల్లో బ్రెయిన్ దొంగతనం. భూగర్భ సాహసయాత్ర, త్రినేత్రుడు ఒకదాన్ని మించి ఒకటున్నాయి.

—చాగాపురం నాగేశ్వరరావు, మల్డకల్.

'భూగర్భ సాహసయాత్ర' నవలలో ఎప్పుడు, ఏం జరుగుతుందో ఊహించలేనంత సస్పెన్స్, వెరైటీవుండి నన్ను ముగ్ధుణ్ని చేసింది. కొమ్మూరిగారిని ప్రత్యేకంగా అభినందించాలి. ఎందుకంటే సమావేశంలోనే ము, ము. నాయకుడిని చిత్రించటం. అదీ హోం మంత్రి స్థానంలో. ఈ నవలకు రచయిత '10 గంటలసేపు ప్రపంచానికే ప్రమాదం' అని పేరు పెట్టారుగాని, ఇది అడుగడుగునా ప్రమాదాల పుట్ట. 'అనుక్షణం ప్రమాదం' అంటే ఇంకా బాగుండేది.

—ఎమ్. ఏ. గోపాల్, కూచనపల్లి.

నా రచన 'సర్వాంతర్యామి' కథను తగ్గించినా సస్పెన్స్ తగ్గలేదు. అది మీ నైపుణ్యం. ''అపన''కు స్టోరీ రాపి జీనియస్‌గా మెప్పు పొందటం 'భాగ్యలక్ష్మి' పొందటం లాంటిది. యీ నెల ''సప్లిమెంట్''లో అన్ని వెరైటీ నవలలు అందించారు.

—కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ.

నా అభిమాన "సప్లిమెంట్"లో, యీ నెల అన్ని నవలలు అత్యంత ఆనందాన్నిచ్చాయి. రచయితలకు నా కృతజ్ఞతలు అందజేయండి. ఇకపోతే కొమ్మూరి సాంబశివరావుగారి "10 గంటలసేపు ప్రపంచానికే ప్రమాదం' సీరియల్ చదువుతుంటే గుండె ఆగినంత పనవుతుంది. ముఖచిత్రాలు పత్రికలకే హైలైట్.

—వి. భూమేశ్వరరావు, ఖుదావంద్‌పూర్.

ప్రేయసి - పిశాచి, అర్ధరాత్రి ఆగంతకుడు, ద్రోహి, సర్వాంతర్యామి కథలు మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేలా వున్నాయి. సీరియల్స్ ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. ఇంత మంచి మూడు సీరియల్స్‌ను ఒకేసారి మాకు అందించటం మహాభాగ్యం. 'మీ తీర్పు ఏమిటి' అతి చక్కావి. ఉత్తమస్థాయి శీర్షిక. ఇటువంటి ప్రయోజనకరమైన శీర్షికను హోం. డె. సభ్యులకే పరిమితం చేయడం విచారకరం.

—ఎమ్. ఆర్. కె. తులసి, మలక్‌పేట.

ఈ నెల పత్రికలు నాకు వి. పి. ద్వారా అందాయి. 'హోమ్ డెలివరీ'లో ఉన్న సౌఖ్యం ఏమిటో నాకు తెల్పింది. మిగతా పత్రికల లాగా కాకుండా పాఠకులకు మీరు చేస్తున్న సేవ అపారమని చెప్పడానికి వెనుదీయను. ఈ నెలలో కథలన్నీ చాలా బాగున్నాయి, 'ఖైదీ' సీరియల్ సరేసరి. మే '75 పత్రికలకోసం ఇప్పటినుండే ఎదురుచూస్తున్నాను.

—ఎమ్. వి. రమణమూర్తి, సుదామిడి.

Edited and Published by S. DAMODAR REDDY (phone: 36959), 3-4-554 Narayanaguda Hyderabad-500029, and printed at Kranti press, Madras-1